



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-2-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 17 పేజీలు: 10+4 వెల: 6.50









ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మహిళా రైతులతో మాట్లాడుతున్న బిల్‌గేట్స్. చిత్రంలో సిఎం చంద్రబాబు నాయుడు

## ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించిన బిల్‌గేట్స్

**విజయవాడ,ఫిబ్రవరి16, ప్రభాతవార్తప్రతినిధి:** ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సందర్శించారు. అక్కడ ప్రకృతి సాగుఉత్పత్తులను పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ రంగంలో అవలంభిస్తున్నఏఐ సహా ఇతర సాంకేతిక విధానాల గురించి అధికారులు ఈ సందర్భంగా వివరించారు. డ్రోన్ల సాయంతో పంటల్లో చీడపీడలు నివారిస్తున్న తీరును స్వయంగా పొలంలోకి వెళ్లి గేట్స్ తిలకించారు. అనంతరం అక్కడ రైతులతో బిల్‌గేట్స్ ముఖాముఖిచర్చించారు. వ్యవసాయక్షేత్రానికి చేరుకున్న సిఎంకు, బిల్‌గేట్స్‌కు మహిళా రైతులు స్వాగతం పలికారు. వారు వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు.

## 'పరకామణి'లో లెక్క తప్పిందా?

>> ఉన్నతాధికారి, పోలీసు అధికారులు వ్యాఖ్యలు కూడా సంచలనం రేకెత్తించాయి. చిన్నమొత్తమే చోరీ చేస్తే భారీగా నిందితుడుగా తేల్చిన సివిరవికుమార్ నుండి టిటిడి బోర్డు ఆయన ఆస్తుల్లో 14కోట్ల రూపాయలు దేవునికి కానుకగా 07గిఫ్ట్‌డీడ్‌పేరుతో రాసివ్వడమేంటనేది నేటికీ వీడని సందిగ్ధత. ఈ కేసులో సిఐడి అధికారులు ఇప్పటికే పలు కోణాల్లో 40మందివరకు సాక్షులను, పోలీసు, విజిలెన్స్ అధికారులను, ఫిర్యాదిదారుడ్ని, కేసుకు సంబంధం ఉన్న వ్యక్తులను గత నవంబర్ 6వతేదీ నుండి సుదీర్ఘంగా విచారణ చేపట్టి వివరాలను 156 పేజీల నివేదికలను హైకోర్టుకు అందజేశారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తుకు ఆయన ఆస్తులపై కూడా ఏసిబి అధికారులు విచారణ చేసి ఐటి,ఇడికి సమాచారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశాలు. అదే సమయంలో నిందితుడుగా వున్న వ్యక్తి పరకామణిలో చోరీ కేసుపై స్వతహాగా ఓ వీడియోను కూడా విడుదల చేయడం, మహాపాపం ,క్షమించరాని పెద్దతప్పు చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. మరీ ఆ తరువాత వరుసగా సిఐడి, ఏసిబి, ఐటి,ఇడి దర్యాప్తు ఏం తేల్చారనేది మాత్రం వీడని రహస్యం. ఏడుకొండల వేంకటేశ్వరునికి రోజువారీగా 90వేలమంది వరకు భక్తులు తమ మొక్కుబడుల్లో ముడుపులుగా హుండీకి పలు విధాలుగా కానుకలు సమర్పించుకుంటున్నారు. ఈ కానుకలను తిరుమలలోనే అధునాతన పరకామణి భవనంలో లెక్కిస్తారు. అక్కడ కరెన్సీ, నాణేలు, విదేశీ కరెన్సీ వేర్వేరుగా ఖజానాకు తరలిస్తారు. ఆ సమయంలో మూడేళ్ళక్రిందట పరకామణిలో దొంగతనం ఉదంతం ఇంకా స్తబ్ధత వీడటంలేదు. నిందితుడికి ఆస్తులు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, తిరుపతి,విశాఖల్లో ఉన్నట్లు డాక్యుమెంట్లను, వాటిల్లో కొన్ని విక్రయించినట్లు విక్రయ రికార్డులపై సిఐడి ,ఎసిబివిచారణ ఏమైందనేది వీడని అనుమానాలు.

## ప్రపంచం చూపు భారత్ వైపు

>> చర్చకు ప్రపంచాన్ని ఒకే వేదికపై తీసుకువస్తున్నాం. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ప్రపంచ నలుమూలల వచ్చిన నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, టెక్ నిపుణులను స్వాగతిస్తున్నా. ఇది మా దేశానికి గర్వకారణం. అలాగే భారత యువత సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ అభివృద్ధికి భారత్ సహకారాన్ని అందిస్తోందనడాన్ని ఈ సమ్మిట్ మరింత బలపరుస్తుంది" అని ప్రధాని మోడీ రాసుకొచ్చారు.

## ఆ ఐదు ఊళ్లివ్వండి

>> అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు తదితర అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. ఈ మేరకు అమరావతి వెళ్లిన మంత్రి తుమ్మల సోమవారం అక్కడ ఏపీ సీఎంను కలిశారు. ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని విన్నవించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25శాతం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు (14.75శాతం ) తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సాగు, జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడి ఉన్నందున తక్షణ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. కరకట్టలోని కొంత భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. తక్షణ సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని ఏపీ సీఎంను కోరారు. ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తింపు పూర్తైందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి ప్రతిపాదించారు. సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఎపిప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్

>> పర్సంటైల్‌తో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించాడు. 100 పర్సంటైల్ సాధించిన 12 మంది విద్యార్థుల వివరాలు శ్రీయాన్ మిశ్రా(ఢిల్లీ), జి నరేంద్ర బాబు(ఏపి), శుభమ్ కుమార్(బీహార్), కబీర్ చిల్లార్(రాజస్థాన్), చిరంజిబ్ కర్(రాజస్థాన్), భవేష్ పాత్ర(ఒడిషా), అనయ్ జైన్(హర్యానా), అర్నవ్ గౌతమ్(రాజస్థాన్), పసల మోహిత్(ఏపి), మాధవ్ విరాదియా(మహారాష్ట్ర), పురోహిత్ నిమయ్(గుజరాత్), వివాన్ శరద్ మహేశ్వరి(తెలంగాణ) ఉన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ లీగ్

>> సింధులు శాఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో నిర్వహించే శాఫ్ లీగ్ ట్రోఫీ, మస్కట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడాప్రాధికార సంస్థ వీసీ, ఎండీ బి. భరణి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శాప్ లీగ్‌తో నూతన క్రీడా కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం రాష్ట్రంలోని అట్టడుగు స్థాయి నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యమన్నారు. ఈ లీగ్ ఫిబ్రవరి రెండో వారం నుండి డిసెంబర్ వరకు ఏడాది పొడవునా కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి క్రీడాకారులు, ముఖ్యంగా పాఠశాల స్థాయి విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు. దీని కోసం పాఠశాల విద్యాశాఖ, శాప్‌తో కలిసి పని చేస్తాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, ఎంపికైన వారు నేరుగా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఫిబ్రవరి 21న తిరుపతిలో రాష్ట్రస్థాయి చెస్ లీగ్ ప్రారంభం కానుందన్నారు. దీని కోసం ఇప్పటికే సుమారు 20, 000 మంది క్రీడాకారులు రిజిస్టర్ చేసుకున్నారన్నారు.ఎంపికైన క్రీడాకారులకు భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం కల్పిస్తామని వీసీ మరియు ఎండీ బీ. భరణి తెలియజేశారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన ఎంతోమంది క్రీడాకారులు ఉన్నారని, వారిలోదాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి శాప్ ఈ లీగ్‌ను ఒక వేదికగా ఏర్పాటు చేసిందన్నారు. ఈ లీగ్ ద్వారా గుర్తించబడిన క్రీడాకారులకు భవిష్యత్తులో అవసరమైన మెరుగైన శిక్షణ, ఆర్థిక సహాయం అందించి, వారు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడం శాప్ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టినందుకుశాప్ అధికారులకు, సభ్యులందరికీధన్యవాదాలు తెలియజేస్తూ, క్రీడాకారులందరికీ సింధు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడానికి ఈ లీగ్‌ను ప్లాట్‌ఫారమ్‌గా ఎంచుకుందన్నారు. ఈ లీగ్ ద్వారా విభిన్న క్రీడల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారిని వెలికితీసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎంపికైన క్రీడాకారులకు భవిష్యత్తులో అవసరమైన శిక్షణతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శాప్ ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో క్రీడలకు ఎల్లప్పుడూ మంచి ప్రోత్సాహం లభిస్తుందని, శాప్ తీసుకున్న ఈ చొరవ వల్ల భవిష్యత్తులో మన రాష్ట్రం నుండి ఎంతోమంది అంతర్జాతీయ విజేతలుగా తయారవుతారని ఆశాభావం కోనేరు హంపి వ్యక్తం చేశారు.

## వారం - వర్జ్యం

17-02-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
అమావాస్య సా.5.27
ధనిష్ఠ రా.9.12
వర్జ్యం : తె.4.24-6.00
దు.ఉ.8.53-9.40, 2) రా.10.50-11.37
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండుట మంచిది. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి.

**వృషభం:** ఆలోచనలతో మీ మనస్సును ఆందోళనకు గురి చేయకండి. పొదుపుకు సంబంధించి పురోగతి సాధిస్తారు.

**మిథునం:** పెద్దలతో సంభాషించునప్పుడు, సంయమనమును పాటించండి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కర్కాటకం:** ఆర్థిక సంబంధిత విషయముల మీద మీ దృష్టిని కేంద్రీకరించ వలసి వస్తుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** మీ కార్యచరణకు సంబంధించిన ప్రణాళికలు పలువురితో ముడిపడి ఉండడం వలన పురోభివృద్ధి ఉండదు.

**కన్య :** మీకు అనుకూలంగా వ్రాయబడిన దస్తావేజులలో ముఖ్యమైన పత్రాలలో కొన్ని లోపాలను గమనిస్తారు.

**తుల :** ఇష్టపడి కొనుగోలుచేసినా వాటిని తిరిగి మార్పుచేయాలని యోచిస్తారు. మిత్రుల సలహాలు, పోరు విసుగు కలిగిస్తాయి

**వృశ్చికం:** ధనమే అన్నిటికి మూలమని రూఢీ చేసుకుంటారు. తప్పనిసరి పరిస్థితులలో అప్పు చేయవలసి రావచ్చు.

**ధనుస్సు:** ఎంత పనిచేసినా సవతిప్రేమ చూపే ఉన్నతాధికారుల వైఖరి కొంత నిరాశకు గురిచేస్తుంది. ప్రయాణాలు.

**మకరం:** మనపని మనం చేసుకుపోతే ఏనాటికి ఫలితాలు అనుకూలంగానే ఉంటాయని భావిస్తారు. ప్రముఖుల కలయిక.


**కుంభం:** వృత్తి, ఉద్యోగములలో మీరు ఆశించిన మార్పులు, బదిలీలు జరుగు తాయి. మానసిక ధైర్యం అన్నిటీ కన్నా గొప్పదని గుర్తించండి.

**మీనం:** అనాలోచితంగా మీరు పెట్టిన పెట్టుబడులకు కొద్దిపాటి నష్టము కలుగవచ్చును. క్రమశిక్షణ మరింత మేలు

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'గేట్స్'తో రాష్ట్రానికి కొత్త దిశ

>> ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశదిశ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాడుతుందన్నారు.బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని సమావేశంలో ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.1997లో మొదటిసారి బిల్ గేట్స్‌ను కలిసిన సంగతిని సమావేశంలో సీఎం ప్రస్తావించారు. హైదారాబాద్ మైక్రోసాఫ్ట్ రాకతో ఐట రంగంలో అభివృద్ధి చెందిందన్నారు..వైద్యరంగంలో తెచ్చిన మార్పులు సాధించిన ఫలితాలపైనా ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో ముఖ్యమంత్రి వివరించారు.వాస్తవానికి ఆనాడు మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగంలో హైదరాబాద్ మేటిగా నిలబడిందన్నారు.ఏపీలో అన్ని వనరులు ఉన్నాయి, ఇప్పుడు సంపద సృష్టి జరగాల్సి ఉంది అన్నారు.బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం అన్నారు.10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నాం అన్నారు..స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానం అన్నారు. ఇందుకు టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తున్నాం.అన్నారు.అమరావతి డిజైన్ అండ్ ఫౌండ్రీ, క్వాంటం వ్యాలీగా ఆవిష్కృతం అవుతుంది. డేటాఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నాం. ఎలక్ట్రానిక్స్ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్ స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నాం.రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నాం అన్నారు. విద్యారంగంలో అధునిక విధానాలను పాటిస్తున్నాంఅన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా బోధనలో మార్పులు చేస్తున్నాంఅన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నాం అన్నారు. రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నాం అన్నారు.మెరుగైన ప్రజారోగ్య సేవలు అందించేందుకు అత్యున్నత స్థాయి నిపుణులతో సలహా మండలి ఏర్పాటు చేశాం.అన్నారు.యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ విధానం ప్రజలకు ముందస్తుగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. సీఎం, మంత్రులు, సెక్రటరీలతో సమావేశంలో పలు అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్న బిల్ గేట్స్ సమావేశంలో చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్‌ఫ్రెండ్ అనిసమావేశంలో సరదాగా బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు.భారతదేశంలో ఇన్నోవేషన్స్, వేగవంతమైన నిర్ణయాలు, చర్యలు అద్భుతంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు.డిజిటల్ విప్లవానికి భారతదేశంలో బలమైన పునాదులు పడ్డాయన్న బిల్ గేట్స్ భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. తా న్ ు మొదటిసారి సీఎం చంద్రబాబును కలిసినప్పటి విషయాలను సమావేశంలో బిల్ గేట్స్ పంచుకున్నారు. ప్రపంచ దేశాల్లో తాను కలిసిన ఎంతో మంది నాయకుల ఆలోచనల కంటే చంద్రబాబు ఆలోచనలు చాలా ముందున్నాయని తొలి భేటీలోనే గ్రహించినట్టు వెల్లడించారు.. నాటి సింగపూర్ ప్రధాని కూడా చంద్రబాబు తరహా భిన్నమైన, విజన్‌తో కూడిన ఆలోచనలు చేసేవారని సమావేశంలో వివరించారు..గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని వివరించిన గేట్స్.ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని సమావేశంలో అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి... వారికి సరైన రీతిలో.. తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందని వివరించారు..విద్యారంగంలో అద్భుతమైన మార్పులు తీసుకురావడానికి ఏఐటెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పారు.వ్యవసాయం రంగ చాలా ముఖ్యమైన రంగమని అభిప్రాయపడ్డ బిల్ గేట్స్... ఈ రంగం ఎంత ముఖ్యమో ఇప్పటికీ చాలా మందికి తెలియదని వ్యాఖ్యానించారు.టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన బిల్ గేట్స్.టెక్నాలజీని రైతులకు అందించేందుకు. ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేసేందుకు ఏపీ కృషి చేస్తోందని చెప్పిన బిల్ గేట్స్ అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో టెక్నాలజీని వినియోగించడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ దాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుండం మంచి పరిణామమని వెల్లడించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలతో ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు కావడం బాగుందన్న బిల్ గేట్స్ డిజిటల్ గవర్నెన్స్ అనే ఆలోచనను ప్రపంచానికి అర్థమయ్యేలా చెప్పడానికి తాను ప్రయత్నిస్తున్న సమయంలో సీఎం చంద్రబాబు దాని గురించి ఆలోచన చేయడమే కాకుండా... అమలు చేశారన్నారు.డ్రోన్లతో వివిధరకాల సేవలు వినియోగించుకునే ఆలోచన అద్భుతంగా ఉందన్న బిల్ గేట్స్,మలేరియా, అనీమియా జబ్బుల నివారణ కోసం అందరం కలిసి పని చేయాలని బిల్ గేట్స్ సూచించారు.సమావేశంలో గేట్స్‌ను పలు అంశాలపై ప్రశ్నలు వేసి అభిప్రాయాలు కోరిన మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్..హైదరాబాద్‌లో మైక్రో సాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు కారణమేంటని పయ్యావుల ప్రశ్నించారు. దీనికి ఆసక్తికర సమాధానం చెప్పారు చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారని చెప్పారుజ.అదే సమయంలో చంద్రబాబు మైక్రో సాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్ లో పెట్టాలనే ప్రతిపాదన పెట్టారని బిల్ గేట్స్ చెప్పారు. దీనిపై తమ వద్ద పని చేసే వారి అభిప్రాయం కోరితే... హైదరాబాద్ సెంటర్ ఏర్పాటు చేస్తే తాము వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారని వివరించిన బిల్ గేట్స్.. ఇప్పుడు కూడా భారతదేశంలో మైక్రో సాఫ్ట్ కంపెనీల్లో పని చేసే చాలా మంది ఉద్యోగుల్లో హైదరాబాద్ వారే ఎక్కువగా ఉన్నారని బిల్ గేట్స్ వివరించారు.ఈ సమావేశంలో బిల్‌గేట్స్‌ను సీఎం, డీసీఎం.మంత్రి నారాలోకేష్ సత్కరించారు.ఇక బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటన ముగిసింది. విజయవాడ నుంచి ముంబై మీదుగా ఢిల్లీకి వెళ్లనున్నారు. దాదాపు ఐదున్నర గంటల పాటు వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు.



సోమవారం అమరావతిలో బిల్‌గేట్స్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డి.సిఎం పవన్. చిత్రంలో సిఎం చంద్రబాబు

## బిల్ గేట్స్ ఫౌండేషన్ సేవలు అసాధారణం

### ఆయనకు స్వాగతం పలుకడం ఆనందంగా ఉంది: డి.సిఎం పవన్

**విజయవాడ,ఫిబ్రవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టిందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం "ఎక్స్" లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు.

రాష్ట్రంలో అమలు చేస్తున్న టెక్నాలజీ ఆధారిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర, స్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## పాలన మరింత సరళం

>> వేయాలన్నారు. ప్రజల్లో డిజిటల్ లిటరసీ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వంలోని 8.20 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణా సామర్థ్యాలను మరింత మెరుగు పరుచుకునేలా వివిధ కోర్సుల్లో శిక్షణ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ కోర్సులను అందించాలని సీఎం సూచించారు. వార్షిక నివేదికల్లోనూ సామర్థ్యాన్ని ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఆర్టీజీఎస్ కేంద్రంలో ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని ఆయన అధికారులను అభినందించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏపీఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టులపై చూపిన ప్రజెంటేషన్లు బిల్ గేట్స్‌ను కూడా ఆకట్టుకున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో గేట్స్ ఫౌండేషన్ ద్వారా చేపట్టే ప్రాజెక్టులను రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల్లో అమలవుతున్న అత్యుత్తమ ప్రమాణాల్ని అన్నింటా అనుసరించేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రజల నుంచి మంచి అభిప్రాయం వ్యక్తం అవుతుందని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్నా క్యాంటీన్లలో వడ్డించే ఆహారాన్ని మరింత రుచికరంగా ఉండేలా చూడాలని సీఎం సూచనలు చేశారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక బెస్ట్ హాస్టల్‌ను మోడల్‌గా తీసుకుని మిగిలిన వాటిలోనూ అవే ప్రమాణాలను పాటించేలా చూడాలన్నారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో విజిబుల్ పోలీసింగ్ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నేరాల రేటును తగ్గించే అంశంలో పోలీసు విభాగం తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాలన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న చర్యల్ని ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలని హోంశాఖ అధికారులను ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎప్పటికప్పుడు చెత్తను క్లియర్ చేయటంతో పాటు కలుషిత నీటి సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇప్పటి నుంచే ముందస్తు కార్యాచరణ చేపట్టాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు డ్రోన్ వినియోగాన్ని పెంచి పౌరసేవలను మరింత సరళతరం చేయాలన్నారు. ఈ సమీక్షకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ కె.విజయానంద్ పురపాలక, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## హాలో ఫ్రెండ్!హౌ ఆర్ యు?

### సిఎం చంద్రబాబును పలకరించిన బిల్‌గేట్స్

**విజయవాడ,, ఫిబ్రవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** హాలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ..? ఇదీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి బిల్ గేట్స్ పలకరింపు. సోమవారం ఏపీలో పర్యటించేందుకు వచ్చిన గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం మొదటి బ్లాకు వద్ద బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు. చంద్రబాబును చూడగానే.. బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు.

హాలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ అంటూ సీఎం చంద్రబాబును బిల్ గేట్స్ అడిగారు. ఆ తర్వాత తన మంత్రివర్గ సహచరులను, సీఎస్ విజయానంద్‌ను బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి పరిచయం చేశారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను మంత్రి నారా లోకేష్ రిసీవ్ చేసుకున్నారు. విమానాశ్రయం వద్ద బిల్ గేట్స్‌కు స్వాగతం పలికిన బృందంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, సత్యకుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఉన్నారు.

## నెల్లూరు, ఏలూరు మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

**విజయవాడ, ఫిబ్రవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** నెల్లూరు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ ఎన్నికకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాల్సిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నెల్లూరు మేయర్ విషయంలో అన్యాయం జరుగుతోందంటూ మాజీ మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్ ఆందోళనలు చేపట్టారు. అయితే జయవర్ధన్ ఆరోపణలను టీడీపీ నేతలు ఖండించారు. వైసీపీ ప్రోత్సాహంతోనే తమపై విషప్రచారం సాగించారని టీడీపీ నేతలు ఆరోపించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. నెలాఖరున వర్షాలు

**విజయవాడ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం అల్పపీడనంగా మారనుంది. దీని ప్రభావంతో ఈనెల 25నుంచి 28 వరకు తెలంగాణ, ఏపీలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఏపీ రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గి పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రత 30 డిగ్రీలు దాటగా, నెలాఖరుకు గరిష్ఠంగా 40 డిగ్రీలకు చేరే సూచనలున్నాయని అధికారులు హెచ్చరించారు.

## కేంద్ర మంత్రి 12 గంటల ప్రజా దర్బార్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** శ్రీకాకుళం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నాడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వెల్లువలా తరలి వచ్చిన ప్రజలు తమ వినతులను కేంద్ర మంత్రికి నేరుగా అందించారు. ఉదయం పది గంటల నుండి రాత్రి పది గంటలు దాటిన వరకు గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగగా ఓపికగా వాటిని అందుకున్న రామ్మోహన్ నాయుడు పరిష్కార మార్గాలను సూచించారు. అవసరమైన వాటికి అక్కడికక్కడే సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి స్పష్టమైన ఆదేశాలను అందించారు. త్వరలో జరగబోయే ఉత్సవాలు, శుభకార్యాలయాలకు ఆహ్వానాలను అందుకున్నారు. దాదాపు పన్నెండు గంటల పాటు సాగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో సుమారు పదిహేను వందలమంది ప్రజలు తమ వినతులను కేంద్ర మంత్రి చెంతకు చేర్చారు. అమాత్యుల నుండి భరోసా లభించిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Project Office: Rayapudi(V), Thullur (M), Amaravati - 522237
E-Procurement Tender Notice (Second Call)
NIT No. 110/MAU61-PLGOCCMP/01/2026-PLG/2nd call Dt. 16.02.2026
Name of Work: APCRDA - "RFP for Engagement of Consultant for Integrated Master Plan including Infrastructure, Financial Plan and Detailed Land Pooling Area Plan in APCRDA Region". The bid can be downloaded on AP e-procurement portal from 17.02.2026 to 04.03.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 04.03.2026 up to 15.00 Hrs. Technical bid opening 04.03.2026 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Amaravati

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-2-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 17 పేజీలు: 10+4 వెల: 6.50

ఎపిలో టెక్నాలజీ పాలన భేష్: బిల్‌గేట్స్ 5
కన్నుల పండువగా శ్రీశైల మల్లన్న రథోత్సవం 6

## ప్రపంచం చూపు భారత్ వైపు

ఎఐతో విప్లవాత్మక మార్పులు

140 కోట్ల మంది భారతీయుల వల్లే ఎఐలో ముందంజ

ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** కృత్రిమ మేధస్సు (ఎఐ) ఇప్పటికే పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, పరిశ్రమలు వంటి రంగాల్లో మార్పులు వచ్చాయని వివరించారు. అయితే ఎఐ వినియోగంలో బాధ్యతాయుతంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని భారత మండపంలో ఐదురోజులపాటు నిర్వహిస్తున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను ప్రధాని మోడీ ప్రారంభించారు. ప్రపంచ స్థాయిలో చర్చలకు ఈ సమ్మిట్ దోహదపడుతుందన్నారు. ఈ సమ్మిట్ ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన అవకాశాల ఆధారిత భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. 140కోట్ల మంది భారతీయుల వల్లే దేశం ఎఐ మార్పులో ముందంజలో ఉందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఎకోసిస్టమ్, ఆధునిక పరిశోధనలు ఇవన్నీ ఎఐ పట్ల భారత్‌కు ఉన్న ఆశయం, బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయని ప్రధాని మోడీ తెలిపారు. సదస్సు ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ, వేదిక వద్ద ఉన్న వివిధ స్టాళ్లను సందర్శించి, ఎక్స్‌పోలో పాల్గొన్న కంపెనీలతో పాటు స్టార్టప్‌లతో మాట్లాడారు. ఈ ఎక్స్‌పోలో 600కు పైగా స్టార్టప్‌లు, ఎఐ పర్యావరణ వ్యవస్థలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రదర్శించే 13 దేశ పెవిలియన్‌లు ఉన్నాయి. వీటిలో ఆస్ట్రేలియా,జపాన్, రష్యా,యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్టోనియా, తజికిస్తాన్, ఆఫ్రికా నుండి పెవిలియన్‌లు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రతినిధులతో సహా 2.5 లక్షలకు పైగా సందర్శకులు ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరుకానున్నారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై సోషల్ మీడియా 'ఎక్స్'లో ప్రపంచ దేశాలను ఆహ్వానిస్తూ ఎఐ సదస్సు ఉద్దేశాలు, లక్ష్యాలను గురించి రాసుకొచ్చారు. ప్రపంచం ఇప్పుడు ఇండియాకు వస్తోందన్నారు. "ఏఐపై >>2

## ముగ్గురు తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్

జెఇఇ ఫలితాలు




100 పర్సంటైల్ సాధించిన శరద్, మోహిత్

ఎపి నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒకరు

దేశవ్యాప్తంగా 12 మందికి 100 పర్సంటైల్

**జెఇఇ మెయిన్ 2026 ఫలితాలు విడుదల చేసిన ఎన్‌టిఎ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 16:** దేశ వ్యాప్తంగా జనవరి 21 నుంచి 28 వరకు నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) మెయిన్-2026 జనవరి ఫలితాల్లో ముగ్గురు తెలుగు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. వారిలో ఒకరు తెలంగాణ విద్యార్థి కాగా.. ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వారు ఉన్నారు. దేశ వ్యాప్తంగా 12 మంది విద్యార్థులు జెఈఈ మెయిన్ ఫలితాల్లో 100 పర్సంటైల్ సాధించారు. జనవరి 21 నుంచి 28 వరకు నిర్వహించిన జెఈఈ మెయిన్ పేపర్-1 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) సోమవారం సాయంత్రం ప్రకటించింది. సోమవారం ఉదయం జెఈఈ మెయిన్ మొదటి సెషన్‌కి సంబంధించిన ఫైనల్ కీని విడుదల చేయగా.. సాయంత్రం ఫలితాలను రిలీజ్ చేశారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరిలో జరిగిన జెఈఈ మెయిన్ మొదటి సెషన్‌కి 13, 55,293 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 13,04,653 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షకు 4,67,817 మంది బాలికలు, 8,87,476 476 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణకి చెందిన విద్యార్థి వివన్ శరద్ మహేశ్వరి 100 పర్సెంటైల్ సాధించగా.. ఏపీకి చెందిన జి.నరేంద్రబాబు, పసల మోహిత్ ఇద్దరు 100 పర్సంటైల్ సాధించారు. ఓబీసీ కేటగిరీలో ఏపీ విద్యార్థి జి నరేంద్ర బాబు ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించాడు. ఎస్సీ కేటగిరీలో ఏపీ విద్యార్థి దేవ శ్రీవేద్ 99.9992271 >>2

## 'గేట్స్'తో రాష్ట్రానికి కొత్త దిశ

ప్రభుత్వం, గేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

బిల్‌గేట్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక సమావేశం

స్వర్ణాంధ్రవిజన్, పాలసీలపై బిల్‌గేట్స్‌కు ప్రెజెంటేషన్ ఇచ్చిన సిఎం

వివిధ ప్రాజెక్టులకు ఫౌండేషన్ సాయంపై చర్చలు

గేట్స్ అమరావతి పర్యటన చరిత్రాత్మకం: సిఎం చంద్రబాబు



సోమవారం అమరావతిలో బిల్‌గేట్స్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్. చిత్రంలో మంత్రి లోకేశ్



బిల్‌గేట్స్‌కు స్వాగతం పలుకుతున్న సిఎం

2

**హాలో ఫ్రెండ్! హౌ ఆర్ యు?**

సిఎంను పలకరించిన బిల్‌గేట్స్

**విజయవాడ.ఫిబ్రవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని ఎప్పటికప్పుడు వినూత్న రీతుల్లో అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేస్తామన్నారు.శాస్త్రీయంగా అనేక ఆవిష్కరణలను వెలుగు చూస్తున్నాయని,వాటిని సద్వినియోగం చేసుకునే మావన వనరులు రాష్ట్రానికి అపారంగా ఉన్నాయన్నారు.ఈ క్రమంలో గెట్స్ ఫౌండేషన్‌తో కీలక ఒప్పందాలను చేసుకుని రాష్ట్రంలో పలు రంగాల్లో అభివృద్ధికి శ్రీకారం చూడుతున్నామన్నారు.ఈ క్రమంలో గెట్స్ పౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటన చారిత్రాత్మకం అన్నారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ పర్యటన దోహదం చేస్తుంది అన్నారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటన సందర్భంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ 2047,ప్రభుత్వ పాలసీలు,లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్‌గేట్స్‌కు >>2



సోమవారం తంబళ్లపల్లె కోర్టులో జోగి రమేష్ తదితరులు

## తంబళ్లపల్లె కోర్టుకు జోగి బ్రదర్స్

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ములకలచెరువు కల్తీ మద్యం కేసులో నిందితులుగా ఉన్న ఏ 32 మాజీ మంత్రి జోగి రమేష్ ఆయన సోదరుడు ఏ 33 జోగి రాము, ఏ 29 అల్లాబక్షు, ఏ 19 అన్సర్రాసు, ఏ 16 కిరీకంటి రవి, ఏ 14 బాల రాజు, ఏ6 మని మారన్, ఏ 5 రాజేష్, మొత్తం ఎనిమిది మంది నిందితులు సోమవారం తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు లో విచారణ నిమిత్తం హాజరయ్యారు. అనంతరం కేసువాయిదా పడడంతో జోగి సోదరులు మల్లయ్య కొండకు బయలు దేరారు. జోగి సోదరులను కలవడానికి తంబళ్లపల్లెకు చెందిన వైకాపా శ్రేణులు పెద్ద ఎత్తున కోర్టు వద్దకు హాజరయ్యారు. జోగి సోదరులు కూడా హాజరవుతున్న సందర్భంగా మొలకలచెరువు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు నుండి బయటకు వచ్చిన జోగి సోదరులకువైకాపా నాయకులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు ప్రకటించారు.

## ఆ ఐదు ఊళ్లివ్వండి

రాష్ట్ర విభజనలో ఎపికి వెళ్లిన భద్రాద్రి మండలం ఐదుగ్రామాలను తెలంగాణలో విలీనం చేయండి

సిఎం చంద్రబాబును కోరిన తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తిరుమలలో తెలంగాణకు ఐదెకరాలివ్వండి

పెదవాగు మరమ్మతుకు 85% నిధులు విడుదల చేయండి..



సోమవారం అమరావతిలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్‌లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి ఖమ్మం జిల్లాకు సంబంధిచిన సాగునీటి వసతులు, భక్తులు, ప్రజల సౌకర్యానికి సంబంధించిన పలు కీలక విజ్ఞప్తులు చేసారు. రాష్ట్ర పునర్విభనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అయిదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబునాయుడిని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఏటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు 8గంటలు ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా >>2

## విమానయానానికి ప్రపంచస్థాయి నైపుణ్యం: మంత్రి లోకేశ్

**విజయవాడ,ఫిబ్రవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** విమానయాన రంగానికి ప్రపంచస్థాయి నైపుణ్యాల దిశగా కీలక ముందడుగు పడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు.లోకేష్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు.సోమవారం మధ్యాహ్నం తరువాత ఆయన ఢిల్లీ చేరుకున్నారు.ఆయనకు అక్కడి విమానాశ్రయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తనపర్యటనలో భాగంగా పలుకార్యక్రమాల్లో యువనేత పాల్గొంటున్నారు. చార్లీఫాక్స్ ట్రాట్‌ఏవియేషన్ సర్వీసెస్‌ను లోకేశ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ పైలెట్ కేడట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మీడియాతో మాట్లాడారు. అట్లాంటా పర్యటన సమయంలో ఆలోచనగా మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు నిజంగా రెక్కలు తొడుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి ప్రతిభతో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగని వివరించారు. యువపైలట్ కేడట్లతో జరిగిన ముఖాముఖి కార్యక్రమం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.




## 'పరకామణి'లో లెక్క తప్పిందా?

దేవుని సొమ్ము చోరీపై దర్యాప్తు నత్తనడకేనా?

**తిరుపతి,పిబ్రవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** 'ఎక్కడవేసిన గొంగడి అక్కడే' అనే చందంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కానుకలు లెక్కించే పరకామణిలో మూడేళ్ళక్రిందట జరిగిన చోరీ ఉదంతంలో దర్యాప్తు లెక్కతప్పిందా?అనే ప్రశ్నలు అటు భక్తుల్లోనూ ఇటు టిటిడి వర్గాల్లోనూ దుమారం రేపుతున్నాయి. ఈ కేసులో సమగ్ర విచారణకు హైకోర్టు ధర్మాసనం ఏసిబి, సిఐడి దర్యాప్తు విభాగాలతో బాటు ఐటి ,ఇడికి కూడా సమాచారం అందించాలని ఆదేశాలు. మరీ ఈ ఆదేశాలు వెలువడి రెండునెలలపైగానే కావస్తున్నా దేవుని సొమ్ము చోరీపై దర్యాప్తులో ఏం తేల్చారనేది సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో ఇప్పటికే ఆయా విభాగాలు దర్యాప్తు చేపట్టినా వాటి వివరాలు మాత్రం బయటకు రానీయకపోవడంలో ఆంతర్యమేమిటనే అనుమానాలు టిటిడిలో చర్చసాగుతోంది. వందరూపాయలు దేవుని హుండీలో చోరీచేస్తేనే సిసికెమెరాల ద్వారా గమనించి పట్టుకుని అరెస్ట్‌చేసే దొంగను అంత పెద్ద మొత్తంలో కోట్లరూపాయలు విలువైన అమెరికన్ డాలర్లు చోరీ అయినా ఇప్పుడూ ఉదాసీనత ఎందుకనేది భక్తుల్లో విస్మయం కలిగిస్తోంది. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు కూడా ఏమయ్యాయనేది అటు పిటిషనర్ అనుచరుల నుండి కూడా ఒకింత అసహనం వ్యక్తమవుతోంది. ఈ కేసులో అనేక మలుపులు తిరిగినా నిందితుడిగా గుర్తించిన వ్యక్తిని కాపాడిందెవరనేది తేల్చలేకపోతుండటం వెనుక బలమైన కారణాలేమిటనేది ఇప్పుడు టిటిడిలో గుప్పుమంటోంది. 2023లో జరిగిన పరకామణి చోరీ కేసులో అన్ని వైపుల నుండి సంబంధిత అధికారులను సిఐడి అధికారులు సమగ్రంగా విచారణ చేశారు. గత టిటిడి బోర్డులో కొందరు పెద్దల్ని,పోలీసు అధికారులను విచారణ చేసిన విషయం విదితమే. మరీ ఈ కేసులో ఏం తేల్చారనేది మాత్రం గుట్టువిప్పడంలేదు. మరీ నిజంగా ఎంతమొత్తంలో దేవుని సొమ్ముచోరీ జరిగిందనేది కూడా లెక్కలు తేల్చాల్సిన అవసరం ఉందనేది భక్తుల్లో వాదనలు. కేవలం 920 అమెరికన్ డాలర్లు 72వేల రూపాయలు విలువమాత్రమేనని అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, >>2

## పాలన మరింత సరళం

కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువచేయడమే లక్ష్యం

రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్తప్రతినిధి:** పాలనలో వివిధ ప్రక్రియలను, నిబంధనల్ని మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు అత్యంత సులభంగా ప్రజలకు చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. దీనిపై అధ్యయనం కోసం ఓ కమిటీ వేయాలని ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం సమీక్షించారు. టెక్నాలజీ అనుసంధానంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దీనికి అనుగుణంగా ప్రతీ ప్రభుత్వ శాఖ సన్నద్ధం కావాలని.. సులభతరమైన పౌర సేవల్ని అందించాలని సీఎం సూచించారు. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా చెల్లింపులు ఇతర ప్రభుత్వ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కోకూడదని..ఆటోమేషన్ దిశగా అడుగులు >>2




శాప్‌లీగ్ ట్రోఫీ మస్కట్‌ను ఆవిష్కరించిన సింధూ, హంపి

## తిరుపతిలో 21న రాష్ట్రస్థాయి చెస్ లీగ్

క్రీడాప్రాధికార సంస్థ విసి, ఎండి బి. భరణి

జాతీయ స్థాయిలో రాణించేందుకు విద్యార్థులకు తర్ఫీదు

శాప్‌లీగ్ ట్రోఫీ, మస్కట్‌లను ఆవిష్కరించిన కోనేరు హంపి, పివి సింధు

**విజయవాడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త ప్రతినిధి:** పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేసి వారు జాతీయ, అంతర్జాతీయ క్రీడాంశాల్లో పోటీపడి విజేతలుగా నిలిచేలా శాఫ్ లీగ్ నిర్వహిస్తున్నామని క్రీడాపాధికార సంస్థ వీసీ, ఎండీ బి.భరణి అన్నారు. స్థానిక బెరంపార్క్‌లో సోమవారం క్రీడాపాధికార సంస్థ వీసీ, ఎండీ బి. భరణి, ప్రముఖ చెస్ క్రీడా కారిణి కోనేరు హంపి, ప్రముఖ బ్యాట్మింటన్ క్రీడాకారిణి పీవీ >>2

వార్త

కొత్తభాషను ఎవరో ఎక్కడో చోట సృష్టిస్తారనుకుంటాం! ఎవ్వరూ అలా చేయలేరు. కొన్ని తరాలు తమ జీవిత క్రమంలో భాషల్ని సృష్టిస్తారు.

-రాహుల్ సాంకృత్యాయన్

# ఉచిత మీమాంస తగునా!


ఏదో 'ఉచితానుచితాలు' మరచి అనుకుంటాం కానీ ఏది ఉచితం, ఏది అనుచితం అని చెప్ప గలిగే వాళ్లెవరైనా ఉన్నారా అని పరకాయించి చూస్తే అన్నీ సందేహాలమయమే. రాజకీయాల్లో ఉచితాలనండి, ప్రజాకర్షక పథకాలనండి ఏవైనా వాటి లబ్ధిదారులను సోమరిపోతుల్లా పెంచి పోషించడమేనని పెద్దలు పదేపదే పలు సందర్భాల్లో హితవు చెబుతూనే ఉన్నారు. ప్రధానంగా పూర్వ రిజర్వుబ్యాంకు గవర్నర్‌లు దువ్వూరి సుబ్బారావు, రఘురామరాజన్‌లో నిర్ద్వందం గానే చెప్పజూసారు. వాళ్లకు దొరికిన వేదికమీదల్లా దేశాభివృద్ధిలో ఉచితాలనబడేవి తిరోగమనానికి సాక్షీ భూతాలుగా అభివర్ణించారు. కానీ ఎందుకో రాజకీయ నేతల చెవికెక్కడం లేదు. ఎంత నిజాయితీగా ఉన్నా తాయిలాలు లేకపోతే ఓటర్లు తమను పట్టించుకోరనే ఆందోళనతో అలా చేసి ఉండవచ్చు. ఇలా ఓటర్లను ఆకర్షించే పథకాలు ఎన్నాళ్లు అనే సంశయం ఉండనే ఉంది. ఇలాంటి వాటితోనే జాతి జనుల సామర్థ్యాలు నిర్వీర్యమైపోతాయనే అంచనాలు కూడా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఆయా సమస్యలు మళ్లీ మళ్లీ అధికారం లోకి తామే రావాలనే ఆకాంక్షలతో ఉచితాలు గుప్పిస్తు న్నారు. తాజాగా మన ప్రధాని నరేంద్ర మోడీ కూడా దేశ ఆదాయ వ్యయాల పట్టికలో ఉత్పాదకతను పెంచేలా ఖర్చులు ఉండాలన్న అభిమతంతో కేంద్ర సర్కారు బడ్జెట్ లో ప్రజాకర్షక పథకాల జోలికి పోలేదని వివరించారు. ఈ యేడాది బడ్జెట్ అందుకు లోబడే ఏర్పికూర్చినందుకు ఆనందపడాల్సిందే. కానీ త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో ఏయే పార్టీ ఎలాంటి ఉచిత వ్యూహాలు పన్ను తుందో ఇప్పుడిప్పుడే చెప్పలేం. స్వల్పకాలిక ప్రజాకర్షక పథకాలను తాము ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టామని ప్రధాని స్పష్టం చేశారు. తాత్కాలిక ప్రజాకర్షక పథకాల కన్నా ప్రజల జీవన ప్రమాణాలను పెంచామనే సంకల్పం తో ముందడుగు వేస్తున్నట్లుగా చెప్పారు. బీహార్ ఎన్నికల సమయంలో ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రకటించిన అమలు చేసిన మహిళా అనుకూల పథకాలే ఎన్డీఏకు పట్టం కట్టాయన్న విషయం జగద్వి దితమే. అంతలోనే ఇంత మార్పా అని మనం నోరెళ్ల బెట్టినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేరళ రాష్ట్రం ఎన్నికల నాటికి వ్యూహాలు ఎలా ఉంటాయో అప్పుడే చెప్పలేం. ఇప్పటికే తమిళనాడులో అధికార పార్టీ డిఎంకె మహిళ లను ఆకట్టుకునే పనిలో పడింది. బీహార్‌లో గత అధికార పార్టీ అమలు చేసినట్లే ఒక పథకానికి అంకురార్పణ చేసింది. కాగా తమిళనాడులోని దాదాపు 1.3 కోట్ల మంది మహిళా లబ్ధిదారులకు ఖాతాల్లో 'మగళిర ఉరిమై తిట్టమ్ ఫ్లస్' పథకం కింద ఐదువేల రూపాయలు నగదు జమ చేయుటకు ఉద్దేశించబడింది. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక నెలవారీ సహాయం రెండువేల కన్నా రెట్టింపుగా ఉంటుందని ఎంకె అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ ప్రకటించారు. ఈ బాపతు నగదు బదలీని ఏమనుకోవాలి. బీహార్‌లో స్త్రీ శక్తిని ఆకట్టుకుని నితీష్ కుమార్ గెలిచినట్లే తానూ గెలవాలని స్టాలిన్ సంకల్పం కావచ్చు. తమిళ మహిళల సంక్షేమం గురించి ఆలోచించడానికి ఎన్నికల ముందువరకుఎందుకు వేచి ఉన్నారని విపక్షాలు నిలదీసాయి. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు విచ్చలవిడిగా ప్రకటిస్తున్న ఉచిత పథ కాలు దేశ ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెడుతున్నా యని 2025-26 ఆర్థిక సర్వే హెచ్చరిస్తోంది. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నివేదికలోని అంశాలు గమనిస్తే నిబంధనలు లేని నగదు బదలీ పథకాల కోసం రాష్ట్రాలు చేస్తున్న ఖర్చు గత మూడేళ్లలో ఐదు రెట్లు పెరిగి, ఈ యేడాది 1.7లక్షల కోట్లకు చేరుకుంది.జీతాలు, పెన్షన్‌లు, వడ్డీలు, ఉచిత పథకాలకు వెచ్చించే సొమ్ము ఆయా రాష్ట్రాల ఆదా యంలో దాదాపు 62శాతం అని తేలింది.పర్యవసానంగా రోడ్లు, రైల్వేలు, ఆసుపత్రులు విద్యావైద్య సౌకర్యానికి అవసరమైన మూలధనవ్యయం దారుణంగా తగ్గిపోతుం దని సర్వే వివరించింది. అప్పులు చేసి మరీ ప్రజల చేతిలో ఉచితంగా నగదు అందించడం వలన పేదరికం మాత్రం ఇసుమంతైనా తగ్గలేదని ఆనివేదికలో పేర్కొంది. ఇలాంటి అప్పులు, వినియోగాల ఖర్చుల వలన రాష్ట్రాలు దివాలా తీసినా అనుమానించక్కర్లేదని సర్వే నివేదిక సారాంశం. మళ్లీ ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కేందుకు బ్రెజిల్‌లో విజయవంతమై 'బోల్సా ఫ్యామిలియా' తరహా విధానాన్ని అనుసరించాలని ఆ ఆర్థిక సర్వే సూచించింది. ఉచితంగా నగదు బదలీ చేయడంకన్నా కొన్ని నిబంధన లు కూడా ఈ పథకానికి జోడించడం తప్పనిసరియని నివేదిక పేర్కొంది.ప్రభుత్వంనుండి ప్రయోజనాలు పొందే కుటుంబాలలోని పిల్లలు ఖచ్చితంగా పాఠశాలలకు వెళ్లాలి. చదువు మీద శ్రద్ధ చూపించాలి. సకాలంలో వైద్యం, టీకాలు వేయించుకోవాలన్న అనేకశ్రత్తులు ఉండవలసిన నిబంధనలు తెలియచెప్పిన విషయాలు. ఇదే అతిపెద్ద సామాజిక బాధ్యత అవుతుంది. ప్రతి పథకానికి ఒక ముగింపు గడువు ఉండాలి. లేకుంటే ప్రజల స్వయం ఉపాధి గురించి ఆలోచించకపోగా వారి శక్తి కోల్పోతారని సూచిస్తోంది. స్వయం సమృద్ధి సాధించే విధంగా పథకాల రూపకల్పన అవసరం. నగదు బదలీ అవసరమే మరో ఉపాధి రంగంలోకి వెళ్లకుండా కోట వేస్తున్నట్లైనని కూడా అంచనాలున్నాయి. దేశ ఉత్పాదకతపై ప్రభావం చూపే ఇలాంటి ఆలోచనలు సృష్టి చెప్పడం మంచిది.

ఖచ్చితమైన బ్రహ్మచర్యం పాటించడమొక్కటే జీవితంలో అన్ని రకాల విజయాలలోనూ గల రహస్యం.



వివేకానందుడు

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమైనది. కృషితో మనం సాధించుకునేది శాశ్వతమైనది.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు

**తెలంగాణా** రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపాలన అటు పంచాయితి ఇటు మునిసిపల్ ఎన్నికల ఘన విజయంతో మరింత బలోపేతమైంది. బలమైన ప్రత్యర్థి బిఆర్ఎస్. తప్పని సరై రెండవ స్థానంలో నిలిచింది. ఎందుకంటే బిజెపి అతి తక్కువ వార్డులు గెలుచుకోవడమే. అడపా దడపా కొన్నిఎమ్.పి.మరికొన్ని అసెంబ్లీ సీట్లు గెలిచినంత మాత్రాన కాంగ్రెసుకు గాని, బిఆర్ఎస్‌కు గానీ గట్టి ప్రత్యామ్మయం కాబోదు. ఇదే పరిస్థితి ఆంధ్రలో కూడా ఉన్నది. తెలంగాణ కాంగ్రెసులో బయటపడని ఎన్ని లుక లుకలు ఉన్నా 2029 వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురు లేదు. ఆతరువాత రాజెవరో మంత్రివరో ప్రజలు నిర్ణయిస్తారు. బిఆర్ఎస్ 2024లో ఓడిపోతుందని, కాంగ్రెస్ పదవిలోకి వస్తుందని ఎవరైనా అనుకున్నారా? కాలం ఎల్లప్పుడు ఒకేలా ఉండదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### టారిఫ్ లాభదాయకమా?

**ప్రభుత్వాలు** క్రెడిట్ దక్కించుకోవడానికే ఆరాటపడుతు న్నాయాఅని అనుమానం రాకమానదు.ఎందుకని భారత్ కు ఎగుమతిచేసే వస్తువులపైన 0శాతము పన్ను విధిం చగా అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపైనా టారిఫ్ 25 శాతం నుండి 18కి తగ్గించారు. ఇక్కడే ఆ ఒప్పందం లాభదయాకమా లేదా నష్టాదయాకమా అని ఆలోచించ వలసి ఉంది.దానిని భారత్ ఎందుకువ్యతిరేకించడం లేదు అనేది ఒక ప్రశ్న. ఎగుమతి అనంతరం చేయవలసినా పనులు అన్ని అమెరికా చేయదు కానీ భారత్ మాత్రం అమెరికాకు ఎగుమతి చేయాలి.

-భారత అవినాష్, జనగామ

### హెల్మెట్ తప్పనిసరి

**ఇటీవల** సంభవిస్తున్న రోడ్ ప్రమాదాల్లో హెచ్చు శాతం మోటార్ వాహన చోదకులు సరైన హెల్మెట్ ధరించక, లేకఉన్నప్పటికీ ఎదుటివాహనాన్ని ఢీకొట్టడంవల్ల తల భాగం మరణానికి కారణమవుతుంది. ఇది ఒక రక్షణకు ముఖ్య వస్తువు. దాన్ని ధరించడం తప్పనిసరి చేయాలి. అందరూ విధిగా చేస్తే ట్రాఫిక్ పోలీసులు లేని వారికి తనిఖీ అవసరమే లేదు. తిరుపతిలో దీన్ని ప్రత్యేకంగా ప్రచార భాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన హెల్మెట్ను బంక్ ద్వారా అమ్మకం చేశారు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### జూదగాళ్లుగా మారుతున్న యువత

**భారతదేశ** ఆర్థిక ముఖచిత్రం గత కొన్ని ఏళ్ళలో గణనీయమైన మార్పులకు లోనైంది. గతంలో వాటా మార్కెట్ పరిమిత వర్గా లకే సాధ్యమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల స్మార్ట్‌ఫోన్‌ఉన్న ప్రతిఒక్కరూ పెట్టుబడిదారులుగా మారుతున్నా రు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో మార్కెట్లోకి ప్రవే శిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం సానుకూల అంశమే అయినప్పటికీ, వాటావ్యాపారం గంభీరమైన పెట్టుబడి ప్రక్రియ నుండి ఒక సరదా ఆటలా రూపాంతరం చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈధోరణివల్ల యువతలో విశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణలాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది. ఆధునిక డిజిటల్ వేదికలు పెట్టుబడి ప్రక్రియను ఒక వీడియో క్రీడఆడినంతసులభంగా మార్చేశాయి.యువత దీర్ఘకాలిక పెట్టు బడిదారుల నుండి స్వల్పకాలిక జూదగాళ్లుగా మారుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఓటర్ రైట్స్ యాక్ట్ తీసుకురావాలి

**వినియోగదారుల** హక్కులు వాలేనే 100 రూపాయలు చెల్లిస్తే డబ్బుకు రషీదు ఇవ్వాలి.నాణ్యత లేకుంటే వారంటీకింద రిపేరీ, గ్యారెంటీ కింద రీప్లేస్మెంట్ ఇవ్వాల్సిందే కానీ ఇప్పుడుమేమ డు గుతున్నది ఓటర్ హక్కుల గురించి ఓటుకు రసీదు కావాలి. హామీల అమలుకు గ్యారెంటీ కావాలి.గెలిచిన అభ్యర్థి ప్రజలకు సేవ చెయ్యనిచో వారిని రీప్లేస్మెంట్ వారంటీ ఇవ్వాలి. ఇప్పుడు మనం మాట్లాడుకోవాల్సింది కన్స్యూమర్ రైట్స్ యాక్ట్ గురించి మాత్రమేకాదు ఓటర్‌రైట్స్ యాక్ట్ గురించికూడా. ప్రజాస్వామ్యం లో ప్రజలకు సేవ చేయాలి లేనిచో రికల్ చెయ్యాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### అట్టడుగు వర్గాలపై కన్ను

**బ్రిటిష్ వాళ్లు** మన దేశాన్ని రెండు శతాబ్దాలు పాలించారు, కానీ బ్రతక నేర్చిన భారతీయులే వేల ఏళ్ళుగా మన మనసుల ను పాలిస్తున్నారు. బ్రిటిష్ వాళ్లు మన భూమి దోచుకున్నారు, బ్రతక నేర్చిన వీళ్లు మన బుద్ధి దోచుకున్నారు. ఒక రాయిని గుడిలో దేవుడని పెట్టించారు, ఇంకో రాయిని సాకిరేవులో పెట్టించి వాళ్ళ బట్టలు ఉతికించుకున్నారు.భయం భక్తీ పేరుతో భావ దాస్యం చేయించుకుంటున్నారు. దాన్నే మతం, దాన్నే సంస్కృతి అని నమ్మిస్తూఉన్నారు. ఇదిమతం కాదు, మానసిక దోపిడీ.భారతదేశంబ్రిటిష్ పాలననుండి బయట పెట్టగలిగారు.

- వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాద బాధితులను 'రాహ్‌వీర్' కాపాడేనా?

**రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిండా మునిగి వుండే వైద్య ఆరోగ్యశాఖ సైతం రాహ్‌వీర్‌ల గుర్తింపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. ఇకపోతే రాష్ట్రానికి అధిక మొత్తంలో రాబడి వనరుల ను సంపాదించి పెడుతున్నప్పటికీ సిబ్బంది కొరతతో విశాలమైన తమ పరిధిలో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న రవాణాశాఖ కూడా ఇదేదో అదనపు బాధ్యతగా,బరువుగా భావించకుండా రాహ్‌వీర్ పథకం కన్వీనర్‌గా తన బాధ్యతను గుర్తెరిగి ఈ కార్యక్రమం అమలు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి. ఆస్పత్రులలో చేరిన అర్హులైన ప్రమాద బాధితులకు ఆర్థిక భారం పడకుండా ఒక లక్షా ఏభైవేల రూపాయల నగదు రహిత ఉచిత వైద్య సహాయాన్ని అందించడానికి గతేడాది కాలం నుండి అందుబాటులో వున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పథకం తన పేరు మార్చుకుని పి.యమ్. రాహత్ పేరుతో మరో వినూత్న పథకంగా నిన్నటికి నిన్న దేశ ప్రధాని చేతుల్లో పురుడు పోసుకోవడం కొసమెరుపు.**



డాక్టర్ నీలం సంపత్

నేటి యాంత్రిక యుగంలో ప్రపంచంలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలకు నెలవుగా కొనసాగుతున్న మన దేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్ట్ ఆదేశాలకు అనుగుణంగా, మోర్త్ మార్గదర్శకాల తోడ్పాటుతో, ప్రపంచ బ్యాంక్ ప్రాయోజిత పథకాల తోడ్పాటుతో రోడ్డు ప్రమాదాల నివారణకై కృషి చేస్తూనే వున్నాయి. ఓ వైపు ఘోర రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి అవసరమైన ప్రణాళికల తో ముందుకు సాగుతూనే మరో వైపు ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పుడు గోల్డెన్ అవర్‌లో తీవ్రంగా గాయపడిన బాధితులను సమీప క్రిటికల్ కేర్ హాస్పిటల్‌లో చేర్పించి వారి ప్రాణాలను కాపాడడానికి అవసరమైన చర్యలను తీసుకుంటున్న వైనం అభినందనీయమే. సదరు ప్రభుత్వ చర్యలలో భాగంగా 2021లో పురుడు పోసుకున్న గుడ్ సమరిటన్ పథకం 31.3.2026 వరకే అమలులో ఉండేలా మార్గదర్శకాలను రూపొందించి దేశంలో వివిధ రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేయడం కోసం ఆయా ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్రంతో సహా అనేక రాష్ట్రాలలో వాటి అమలు అంతంత మాత్రమే జరిగిందనేది నిర్వివాదాంశమే. ఫలితంగా ఘోర రోడ్డు ప్రమాదాల బాధితులకు స్వాంతన చేకూర్చే విధంగా ఆయా ప్రాంతాల్లో ఉండే బై స్టాండర్లకు గుడ్ సమరిటన్ లా పై అవగాహన కలగని కారణంగా మెడికో లీగల్ కేసుల నెపంతో పోలీసు శాఖ ఇబ్బందుల పాలు చేస్తారనే భయం నేటికీ వారిని వెంటాడుతోంది. ఫలితంగా గత ఐదేళ్ల కాలంలో ఘోర రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితుల పాలిట జీవన రక్షకులుగా బై స్టాండర్‌లు పని చేయలేకపోయారు. గతేడాది 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2025లో అప్పటికే నాలుగేళ్ల నుండి అమలులోవున్న ఈ పథకం పై విస్తృత ప్రచారం జరగలేదు. ఐతే నెలరోజుల ఆకార్యక్రమం లో చివరి దశలో ఘోర రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితులను 'గోల్డెన్ అవర్'లో సమీప క్రిటికల్ కేర్ ఆస్పత్రులలో చేర్పించే బాధ్యతను చేపట్టే గుడ్ సమారిటన్ లకు ఇచ్చే బహుమతి మొత్తాన్ని ఐదువేల రూపాయల నుండి ఇరవై ఐదు వేలరూపాయలకు పెంచాలని ప్రధాన మంత్రి నిర్ణయం తీసుకున్నారని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పత్రికాభిముఖంగా ప్రకటన చేయడం జరిగింది. సదరు ప్రకటనకు కొనసాగింపుగా నేమో అన్నట్లు ఈ సంవత్సరం మార్చి 31తో ముగిసి పోయే ఆ గుడ్ సమారిటన్ మార్గదర్శకాలను సవరిస్తూ గతేడాది ఏప్రిల్ మాసంలో ఈ పథకాన్ని రాహ్ వీర్‌గా మారుస్తూ గతంలో ఓ నిర్దిష్ట కాల పరిమితికి మాత్రమే అమలులో వున్న ఈ పథకాన్ని నిరంతరం కొనసాగే పథకం గా మారుస్తూ కేంద్ర ఉపరితల రవాణాశాఖ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ పథకం అమలు కాబోతుంది.ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ రాహ్‌వీర్ పథకాన్ని త్రికరణ శుద్ధిగా తెలంగాణ రాష్ట్రంలో అమలు పరచాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది.పేరు మార్చుకున్న ఈ పథకం ప్రకారం రాహ్‌వీర్‌లుగా వ్యవహరించబోయే వ్యక్తులకు గతంలో ఉన్నరివార్డ్ 5000 రూపాయల మొత్తాన్ని 25000ల రూపాయలకు పెంచడంతో పాటు ప్రశంసా పత్రాన్ని ఇవ్వాలనుకోవడం బై స్టాండర్లకు ఖచ్చితంగా ప్రోత్సాహకంగా మారుతుందని చెప్పక తప్పదు. మార్గదర్శకాల ప్రకారం ఒక సంవత్సర కాలంలో ఏ వ్యక్తియైనా గరిష్టంగా ఐదుసార్లు ఈ ప్రోత్సాహక బహుమతిని



అందుకోవచ్చు. ఇటీవలే ముగిసిన 37వ జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాలు 2026లో రాహ్‌వీర్ పథకం పై విస్తృత ప్రచారం జరిగిన నేపథ్యంలో మోర్త్ మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం రాహ్‌వీర్ విధి విధానాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపిస్తూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల తీవ్రత దృష్ట్యా అధిక సంఖ్యలో ప్రాణనష్టం, ఆస్తుల విధ్వంసం, రాష్ట్రస్థూల జాతీయ ఉత్పత్తిపై వాటి ప్రభావంనేపథ్యంలో వాటిని అమలు పరచాల్సిన బాధ్యతను వ్యక్తిగతం చేస్తూ త్రికరణ శుద్ధిగా నిర్వర్తించాలని కలెక్టర్‌లకు ఆదేశాలను జారీచేసింది. రాష్ట్రంలోని రహదారులపై ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి సదరు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారిని ఒక గంటలోపు సమీప క్రిటికల్ కేర్ ఆస్పత్రులలో చేర్పించిన వారి వివరాలను రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు చేరవేయడానికి జిల్లాల స్థాయిలో జిల్లాల కలెక్టర్ల చైర్మన్ షిప్‌లో ఓ అప్రైజల్ కమిటీ పనిచేస్తుంది. అందులో జిల్లా యస్.పి/ సి.పి ఆఫ్ పోలీస్ సభ్యులుగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరోసభ్యుడిగా, జిల్లా రవాణాశాఖ అధికారి కన్వీనర్‌గా కొనసాగుతారు. గుడ్ సమారిటన్‌ల వివరాలను (ఆధార్ కార్డ్,బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు) పోలీసుశాఖ అధికారులు జాతీయ స్థాయిలో నిర్ధారించబడిన స్టాండర్డ్ అనెగ్జ్యూర్‌లో పొందుపరిచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయంతో జిల్లా కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్‌కి పరిశీలన తగుచర్యల కోసం పంపించడంతో పాటు సదరు వివరాలను ఇడర్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేయాల్సివుంటుంది. అదే విధంగా సదరు వివరాల ప్రతి నకలును అకనాలెడ్జ్‌మెంట్ రూపంలో ప్రతిపాదిత గుడ్ సమారిటన్‌కు అందించాలి. జిల్లా కలెక్టర్ తమ పరిశీలనానంతరం ప్రతి నెల అర్హులైన గుడ్ సమారిటన్‌ల వివరాలను కమిటీ కన్వీనర్‌గా కొనసాగుతున్న జిల్లా రవాణాశాఖ అధికారికి పంపడం జరుగుతుంది. తదనంతరం డి.టి.ఓ ఆ దరఖాస్తును రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు పంపాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో పరిశీలన అనంతరం అర్హులైన రాహ్‌వీర్‌లకు ఇరవై ఐదువేల రూపాయలను పి.యఫ్.యమ్.యస్ అకౌంట్ ద్వారా గుడ్ సమారిటన్‌ల బ్యాంకు ఖాతాలోకి నేరుగా జమచేయబడుతుంది. అట్టి మొత్తం జాతీయ రోడ్ భద్రత నిధినుండి రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు రియంబర్స్‌మెంట్ రూపంలో తిరిగి చెల్లించబడుతుంది. ఈ నెల మూడవ తేదీన రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కలెక్టర్లకు జారీచేసిన ఉత్తర్వులలో ప్రతి నెలా జిల్లాల స్థాయిలో జరిగే జిల్లా రహదారి భద్రత సమావేశాలలో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల ద్వారా, పోలీసుశాఖ, రవాణాశాఖ, వైద్య ఆరోగ్యశాఖల ప్రత్యేక చొరవతో రాహ్‌వీర్ పథకానికి సంబంధించి విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టడం ద్వారా ఘోర రోడ్డు ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన బాధితుల ప్రాణాలను కాపాడడానికి ఓ అద్భుతమైన లైఫ్‌లైన్‌గా ఉపయోగపడే ఈ పథకాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఐతే ప్రభుత్వ ప్రజాసంక్షేమ అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మోస్తున్న పబ్లిక్ రిలేషన్స్‌శాఖ ఈ పథకం విధివిధానాలను, ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే ఆశించిన ఫలితాలు లభించవచ్చని పాలనా నిపుణులు అనుకుంటున్నారు. మరోవైపు అత్యంత ఘోర ప్రమాదాలలో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలాల్లో మృత్యువుతో పోరాడుతున్న ప్రమాద బాధితుల పట్ల బై స్టాండర్లు ప్రాణదాతలుగా మారాలంటే రోడ్ సేఫ్టీ స్టేక్ హోల్డర్లయిన పోలీసుశాఖ పౌరుల అంతర్గత భద్రత కార్యక్రమాలలో తల మునకలుగా ఉన్నప్పటికీ, ఆ ఒత్తిళ్లను దాటి రహదారి ప్రమాదాల తీవ్రతను గుర్తిస్తూ రాహ్‌వీర్ పథకం అమలు కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలి. అదే విధంగా అనునిత్యం రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిండా మునిగి వుండే వైద్య ఆరోగ్యశాఖ సైతం రాహ్‌వీర్‌ల గుర్తింపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. ఇకపోతే రాష్ట్రానికి అధిక మొత్తంలో రాబడి వనరుల ను సంపాదించి పెడుతున్నప్పటికీ సిబ్బంది కొరతతో విశాలమైన తమ పరిధిలో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న రవాణాశాఖ కూడా ఇదేదో అదనపు బాధ్యతగా,బరువుగా భావించకుండా రాహ్‌వీర్ పథకం కన్వీనర్‌గా తన బాధ్యతను గుర్తెరిగి ఈ కార్యక్రమం అమలు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి. ఆస్పత్రులలో చేరిన అర్హులైన ప్రమాద బాధితులకు ఆర్థిక భారం పడకుండా ఒక లక్షా ఏభై వేల రూపాయల నగదు రహిత ఉచిత వైద్య సహాయాన్ని అందించడానికి గతేడాది కాలం నుండి అందుబాటులో వున్న క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ పథకం తన పేరు మార్చుకుని పి.యమ్.రాహత్ పేరుతో మరో వినూత్న పథకంగా నిన్నటికి నిన్న దేశ ప్రధాని చేతుల్లో పురుడు పోసుకోవడం కొసమెరుపు. ●

# టీచర్లకు ఎఐ ప్రత్యామ్నాయంగా మారుతుందా?

జి.సత్యనారాయణరాజు

ఎఐ అనేది ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం అవుతుందా అనే చర్చ జరుగుతోంది. అది ఒక సహాయక సాధనం మాత్రమే. తరగతి గదిలో మానవ స్పర్శ, సానుభూతి స్ఫూర్తిని ఎఐ భర్తీచేయలేదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఎఐ అనేది ఉపాధ్యాయుల పాత్రను మెరుగుపరచడానికి ఉద్దేశించింది.అయితే వారిని భర్తీ చేయడానికి కాదంటున్నారు.మానవ సంబంధాలను నిర్మించడానికి,మానసిక మద్దతును అందించడానికి,అర్థవంతమైన అభ్యాస అనుభవాలను సులభతరం చేయడానికి మానవులైన ఉపాధ్యాయులు ఇప్పటికీ చాలాఅవసరం. వారినేపథ్యం లేదా సామర్థ్యాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఎఐ సాధనాలు అందుబాటులో ఉంటాయి. ఇది విద్యార్థుల ప్రత్యేక అవసరాలు అభ్యాస శైలులకు అనుగుణంగా అభ్యాస సామగ్రిని మార్చగలదు. అంతేకాకుండా అభ్యా సకుల గోప్యత, డేటా భద్రత కలిగిఉంటాయి. విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అభ్యాస సామగ్రిని, జోక్యాలను సర్దుబాటు చేయడంలో ఎఐ వ్యవస్థలు మరింత అధునాతనంగా మారతాయి. ఈ వ్యక్తిగతీక రించిన విధానం అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరు స్తుంది. ఎఐ ఆధారిత చాట్‌బాట్‌లు,వర్చువల్ అసిస్టెంట్‌లు సహజ భాషను అర్థం చేసుకోవడంలో, ప్రతిస్పందించడంలో మరింత అభివృద్ధి చెందుతాయి.విద్యార్థులకు తక్షణ మద్దతు మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి. విద్యా డేటాను విశ్లేషించడంలో విద్యావేత్తల కోసం కార్యాచరణ విధానాలను రూపొందించడంలో ఎఐ అల్గారిథమ్‌లు మెరుగుపడుతూనే ఉంటాయి. ఇది డేటా ఆధారిత నిర్ణయాధికారం, వ్యక్తిగతీకరించిన బోధనను సాధ్యం చేస్తుంది. విద్యలో ఎఐని అమలు చేయడం అనేది నమ్మదగిన డేటా లభ్యత ప్రత్యేక సాంకేతిక నైపుణ్యంవంటి సవాళ్లతో కూడి ఉంటుంది. ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా, విద్యావేత్తలు తరగతిగదిలో ఎఐని విజయవంతంగా అనుసరించి ఫలితాలు సాధించవచ్చు.విద్యారంగంలో ఆన్‌లైన్ కోర్సుల రూపకల్పన, నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎన్నోఅవకాశాలను కలిగిస్తోంది. విద్యావేత్తలను శ్రమతో కూడిన పనులనుండి విముక్తి చేస్తుంది. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, కంటెంట్ ఎల్లప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా ఉండేలా చూస్తుంది. పరిపాలనా పనులను ఇప్పుడు ఎఐ ఉపయోగించి ఆటోమేట్ చేయవచ్చు. దీనివల్ల అధ్యాపకులు తమ దృష్టిని పూర్తిగా విద్యార్థులపై కేంద్రీకరించడానికి అవకాశం ఉంటుంది.దీంతో ఏ విద్యార్థి వెనుకబడిపోకుండా చూసుకోవచ్చు. ప్రతివిద్యార్థి గ్రహణ శక్తి ఒకేలా ఉండదు. ఎఐ దీనిని గుర్తించి పాఠం వినడంలో ఇబ్బంది పడుతుంటే, మరిన్ని ఉదాహరణలతో సులభంగా వివరిస్తుంది. పరీక్షా పత్రాల మూల్యాంకనం, హాజరు వంటి పరిపాలనా పనులను ఎఐ చూసుకుంటుంది. దీనివల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతికవిలువలు సృజనాత్మకతను నేర్పడంపై ఎక్కువసమయం కేటాయించగలరు. ఏ విద్యార్థి పరీక్షల్లో వెనుకబడే అవకాశం ఉందో ఎఐ డేటా ద్వారా ముందే గుర్తించి ఉపాధ్యాయులను హెచ్చరిస్తుంది. ఏఐ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదు. ●

# వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తున్న కేటాయింపులు

బొల్లిముంతసాంబశివరావు

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన 2026-27ఆర్థిక బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులు 14.2.26న శాసనసభలోప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ 3,32,205 కోట్ల రూపాయలు. ఇది గతబడ్జెట్ కన్నా 9,856 కోట్లు ఎక్కువ. రెవిన్యూ వ్యయం 2,56,143కోట్లు. మూలధనం 53,915కోట్లు. రెవిన్యూలోటు 22,002 కోట్లు కాగా ద్రవ్య లోటు75,868కోట్లు.బడ్జెట్ లెక్కలు గమనిస్తే వివిధ రంగాలకు కేటాయించిన దానికోసం పెద్దమొత్తంలో అప్పులు చేయాలి. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రాష్ట్రం మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. గతబడ్జెట్లో అప్పులకు వడ్డీల కింద 24,430 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వ ఖర్చులలో 18 శాతం వరకు వడ్డీలు, అసలు చెల్లింపులకే సరిపోతుందని ది హిందు తెలిపింది. ఈ లెక్కన అప్పులకు వడ్డీలచెల్లింపులు ఈ ఆర్థికసంవత్సరంలో మరింత పెరుగుతాయి. నూతన ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టే బడ్జెట్లో, గత బడ్జెట్ వివిధ రంగాలకు కేటాయించిన మొత్తంలో ఎంత ఖర్చుపెట్టారు, ఎంతవరకు పని జరిగింది? ఇంకా ఎంతపని మిగిలి ఉంది? పూర్తిగా పని జరగకపోవటానికి కారణాలు వివరించి అందుకు నూతన బడ్జెట్లో నిధులు కేటాయించి ఎప్పటికి పూర్తి అవుతుందో తెలియచేయాలి. కాని 2026-27 బడ్జెట్లో అలాంటి ప్రస్తావనే లేదు. బడ్జెట్ మొత్తం అంకెల గారడీగా ఉంది. బడ్జెట్లో వివిధ రంగాలకు కేటాయింపులు గమనిస్తే వ్యవసాయరంగానికి రైతులకు ఇచ్చే రాయితీలను గణనీయంగా తగ్గాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.48,341.14 కోట్లు కేటాయించగా, ఈ ఆర్థిక సంవత్సర బడ్జెట్లో రూ.11,745.21 కోట్లు మాత్రమే కేటాయింపు జరిగింది. అంటే వ్యవసాయరంగానికి గణనీయంగా కేటాయింపులు తగ్గాయి. గతబడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.12,903 కోట్లు కేటాయించగా, ఈఆర్థిక బడ్జెట్లో రూ.9,906 కోట్లు కేటాయించారు. ఒకవైపున మూడు వేలకోట్ల దాకా కేటాయింపులు తగ్గించగా, బడ్జెట్ ప్రసంగాల్లో మాత్రం ఆర్థికమంత్రి,వ్యవసాయ మంత్రిమాత్రం సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. రైతాంగ సేద్యం తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రతిసంవత్సరం సేద్యపు ఖర్చులు పెరగటం, అందుకు అనుగుణంగా పంటలకు మద్దతు ధరలు లేకపోవడం, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ, ప్రభుత్వమే న్యాయమైన ధరకు పంటలు కొనుగోళ్లు చేయకపోవడం వల్ల రైతాంగం తీవ్రంగానష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతులు పంటలకు సరైన ధర కల్పించాలని డిమాండ్ చేశారు.రైతుల డిమాండ్ నేపథ్యంలో ఆనాటి వైసీపీప్రభుత్వ ముందస్తు పంటపెట్టుబడిని మూడు ధపాలుగా 13,500 రూపాయలు ప్రకటించింది. ఇందులో కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆరువేల రూపాయలు కలిసిఉన్నాయి. చంద్రబాబు నాయకత్వాన ఉన్నకూటమి ప్రభుత్వం ముందస్తు పెట్టుబడి రూ.



20వేలుగా ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సంవత్సరం పెట్టుబడి సహాయం ఇవ్వలేదు.ఆ తర్వాత సంవత్సరంలో కూడా ఇప్పటికి రెండుసార్లు మాత్రమే ఇచ్చింది. చాలామంది రైతులు పథకానికి దూరమయ్యారు. ఈ పథకం ఖర్చు తగ్గించుకోవడానికి అర్హతపేరుతో కొందరి రైతులను పథకం నుంచి తప్పించడానికి చంద్రబాబు ప్రభుత్వం పూనుకుంది. గతబడ్జెట్లో ముందస్తు పెట్టుబడి కోసం అన్నదాత సుఖీభవ పథకానికి రూ.9,400 కోట్లుకేటాయించిన ప్రభుత్వం, ఈ ఆర్థికసంవత్సరం బడ్జెట్లో రూ.6,600 కోట్లు మాత్రమే కేటాయించింది. ఫలితంగా చాలామంది రైతులు పథకానికి దూరముఅవుతారు.ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతూ ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో పంటలు కొనుగోళ్లు చేసి తమను ఆదుకోవాలని రైతులు ఆందోళన చేసిన ఫలితంగా పంటల బీమా పథకం ప్రవేశపెట్టి రైతులకు పరిహారం అందిస్తామని పాలకులు చెప్పారు. ప్రస్తుతం పంటల బీమా ప్రీమియం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సి ఉండగా, గతసంవత్సరం చంద్రబాబు ప్రభుత్వ బడ్జెట్లో మాత్రం 1,023 కోట్లు కేటాయించినా ప్రీమియం చెల్లింపులు మాత్రంచేయలేదు. ఫలితంగా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు బీమా పరిహారానికి దూరమయ్యారు. ఈ సంవత్సరంబడ్జెట్లో 250 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈకేటాయింపులు గమనిస్తే,రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయ చూస్తుంది అనేఅభిప్రాయం ఏర్పడుతున్నది. సేద్యపు ఖర్చులు పెరగడం,పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవడం, పంటలు అమ్ముడుకాని పరిస్థితుల వల్ల రైతాంగం నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అనేకమంది రైతులు బలవన్మరణాల పాలయ్యారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న రైతాంగం బహిరంగ మార్కెట్లో పంటల ధరలు పడిపోయినప్పుడు న్యాయమైన గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే పంటలు కొనుగోళ్లు చేయాలని ఆందోళన చేసిన ఫలితంగా అందుకోసం ధరలస్థిరీకరణ నిధిని ఆనాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి మూడు వేలకోట్లు కేటాయించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత బడ్జెట్లో 300 కోట్లు మాత్రమే కేటాయించడంపై తీవ్ర విమర్శల నేపథ్యంలో ఈ ఆర్థికసంవత్సరం బడ్జెట్లో 500 కోట్లు కేటాయించి, కేటాయింపులు పెంచినట్లు చెప్పింది. ఈ నామమాత్రపు కేటాయింపు పెంపువల్ల రైతులకు ప్రయోజనం లేదు. ధరల స్థిరీకరణనిధి ద్వారా కూటమి ప్రభుత్వం పంటల కొనుగోళ్లు చేయలేదు. పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరగ్యారంటీ ఇవ్వడంలేదు. రైతాంగానికి సున్నా వడ్డీకే పంట రుణాలు అందిస్తామని, కౌలు రైతులకు కూడా దాన్ని వర్తింప చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. ఈబడ్జెట్లో సున్నా వడ్డీ రుణాల ప్రస్తావనగాని, కౌలురైతుల ప్రస్తావన ఎక్కడాకన్పించదు. రైతాంగాన్ని ఆదుకునే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయని కూటమిప్రభుత్వం,అవసరానికి మించిన వ్యవసాయయాంత్రీకరణ, లాభసాటి పంటల సాగు గురించి గొప్పలు చెప్పింది. ప్రకృతి వ్యవసాయమే రైతుల సమస్యలకు పరిష్కారంఅన్న విధంగా బడ్జెట్ ప్రసంగంలో మంత్రిమాటలు ఉన్నాయి. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే వ్యవసాయ బడ్జెట్ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ, స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు మద్దతుధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించడమే రాష్ట్ర రైతాంగం తక్షణ కర్తవ్యం. ●



# ఏపిలో టెక్నాలజీ పాలన భేష్

- సిఎం చంద్రబాబును అభినందించిన బిల్ గేట్స్ ● ఆర్‌టిజిఎస్ కేంద్రం సందర్శన
- డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్‌కు వివరించిన సిఎం చంద్రబాబు
- ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్న బిల్ గేట్స్

విజయవాడ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సందర్శించిన బిల్ గేట్స్ అక్కడ డిస్ ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ విభాగాలనూ అనుసంధానించామని తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచేశారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందించటం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని...ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని సీఎం వివరించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన బిల్ గేట్స్ పౌరసేవలను సులభతరం చేయటం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఏపీలోని ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రిని గేట్స్ అడిగారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి బ్లాక్ చైన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులను భద్రపరుస్తున్నామని వివరించారు. భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేసి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏపీ ఏఐ సెర్చ్ బార్‌ను అందుబాటులోకి తెచ్చామని అధికారులు గేట్స్‌కు ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన బిల్ గేట్స్ పన్నుల వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు.

### సంజీవని ప్రాజెక్టు వెరీ నైస్: గేట్స్

గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... దట్స్ వెరీ నైస్ అంటూ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఏఐ వినియోగం ద్వారా ప్రాథమికంగా వారి సందేహాలను తీర్చేలా వైద్య సేవలను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి వైద్య సేవలు అందించే విధానం చాలా బాగుందని ప్రశంసించారు. భారత్ బయోడిజైన్ ద్వారా భవిష్యత్తులో వైద్య సేవలు అందించే విధానాన్ని గేట్స్ అడిగి తెలుసుకున్నారు. అల్ట్రా సౌండ్ పరీక్షలు, స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఎక్కువ వ్యయం చేయాల్సి వస్తోందని.. డయాగ్నోస్టిక్స్ సేవలు తక్కువ వ్యయానికే అందితే వారికి వెసులుబాటు ఉంటుందని గేట్స్ వ్యాఖ్యానించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందని అన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ గ్రేట్ వర్క్ అంటూ వ్యాఖ్యానించారు.



గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ భేటీ

### గేట్స్‌కు యువ అధికారుల ప్రజెంటేషన్

అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్ గేట్స్‌కు వీడియో డిస్ ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికా గార్గ్, ప్రఖర్ జైన్, సౌరబ్ గౌర్, సురేశ్ కుమార్‌లు ప్రజంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో జరిగిన ప్రజంటేషన్ల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, సీఎస్ కె.విజయానంద్ సహా తదితర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### వేడుకగా కపిలేశ్వర కామాక్షి అమ్మ కల్యాణం

తిరుమల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి మహాశివరాత్రి వేడుకల్లో సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మ కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కల్యాణమండపంలో ప్రత్యేక వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చారు. సాయంసంధ్యవేళ చల్లటిగాలులు వీస్తుండగా కపిలతీర్థం ప్రాంగణం పచ్చని తోరణాల నడుమ పెళ్ళిపందిరిగా ముస్తాబైంది. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్యపూజ, మంగళసూత్రధారణ మొదలైన ఘట్టాలతో శాస్త్రోక్తంగా కపిలేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం మరుసటిరోజు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం పరిపాటి. ఈ సందర్భంగా గృహస్థ భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులందుకున్నారు. హరహరమహాదేవ శంభో శంకర, ఓం నమఃశ్శివాయ అంటూ భక్తులు నామస్మరణ చేశారు. టిటిడి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసింది. జెఇఒలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

**ఉదయం పురుషామృగవాహనంపై:** కపిలేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం స్వామివారు పురుషామృగవాహనంపై అధిరోహించి భక్తులకు అభయమిచ్చాడు. అర్ధరాత్రి 12గంటల నుండి కపిలతీర్థంలో లింగోద్భవ అభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. పురవీధుల్లో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



### శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి

తిరుమల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సు ప్రజలందరిపై కలగాలని, అందరికీ శుభాలు కలగాలని పలువురు కాంక్షించారు. సోమవారం ఉదయం మగధీర చిత్రం విలన్ దేవ్‌గిల్, జబర్దస్త్ నటులు ఆటో రాంప్రసాద్, తన్మయి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### విమానాశ్రయంలో బిల్‌గేట్స్‌కి ఘనస్వాగతం


గన్నవరం(కృష్ణా), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్‌కి గన్నవరం విమానాశ్రయంలో కూటమి మంత్రులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రరాజధాని అమరావతిలో ఒకరోజు పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో బిల్‌గేట్స్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. మంత్రి నారా లోకేష్ బిల్‌గేట్స్‌కు పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. మంత్రులు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, రాష్ట్రపరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజు, కృష్ణా జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ, జిల్లాఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు బిల్‌గేట్స్‌కు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గాన అమరావతి బయలుదేరి వెళ్ళారు. ఇదిలా ఉండగా బిల్‌గేట్స్ ప్రయాణిస్తున్న విమానం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సమయానికి విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో పొగమంచు కారణంగా విజిబులిటీ తక్కువగా ఉండటంతో కొద్దిసేపు గాలిలో చక్కర్లు కొట్టింది. దీంతో ఉత్కంఠత నెలకొనగా కొద్దిసేపటి అనంతరం వాతావరణం అనుకూలించటంతో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది.

**వీడ్కోలు:** అమరావతి పర్యటన అనంతరం రోడ్డుమార్గాన గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న బిల్‌గేట్స్‌కు మంత్రి లోకేష్, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. అనంతరం బిల్‌గేట్స్ ప్రత్యేక విమానంలో ఇక్కడి నుండి బయలుదేరి వెళ్ళారు.

## వైభవోపేతంగా శ్రీగంగా భవానీ సమేత మల్లేశ్వర స్వామివార్ల రథోత్సవం

### - శ్రీస్వామి అమ్మవార్ల నామస్మరణతో మార్మోగిన బెజవాడ నగరం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: విజయవాడ నగర వీధులలో హర హర మహాదేవ... దుర్గమ్మవారికి జయహో... భక్తులు జయజయ నాదాలు చేస్తుండగా వైభవోపేతంగా శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల రథోత్సవం అశేష భక్తులను అనుగ్రహిస్తూ ముందుకు సాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన రథోత్సవం సోమవారం నాడు భక్తిప్రపత్తుల మధ్య, వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య కోలాహలంగా జరిగింది. సాయంత్రం 4గంటలకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. సీనా నాయక్ శాస్త్రోక్తంగా కొబ్బరికాయలు కొట్టి రథయాత్రను ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాట బృందాల ప్రదర్శనల మధ్య దివ్య రథం కనకదుర్గ నగర్ నుండి బ్రాహ్మణ వీధి, పాత శివాలయం, మెయిన్ బజార్, కెనాల్ రోడ్డు మీదుగా రథం వెళ్తున్న మార్గమంతా భక్తులకు దర్శనమిస్తూ సాగింది. "హర హర మహాదేవ" శంఖారావాలతో ఆధ్యాత్మిక వాతావరణంలో రథం సెంటర్ వద్ద ఊరేగింపు పూర్తికాగా ఉత్సవ మూర్తులను తిరిగి కనకదుర్గ నగర్ మీదుగా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేర్చారు. ఆలయ స్థానాచార్య వి.శివప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు మరియు అర్చకుల వేదనాదాలు పలుకుతుండగా ఆదిదంపతులు పరమ శివుడు పార్వతీ సమేతుడై భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, వన్ టౌన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అబ్బూరు శ్రీనివాసరావు, బడేటి ధర్మారావు, గూడపాటివెంకట సరోజినీ దేవి, జి.వి. నాగేశ్వరరావు, జింక లక్ష్మీదేవి, మన్నె కళావతి, మోరు శ్రావణి, పద్మావతి ఠాకూర్,





పానబాక భూలక్ష్మి ్మ, పెనుమత్స రాఘవరాజు, సుబ్రహ్మణ్య కుమార్ ఏలేశ్వరపు, సుకాసి సరిత, తంబళ్ళపల్లి రమాదేవి, తోటకూర వెంకట రమణారావు, తరిగొప్పుల పార్వతి, వెలగపూడి శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**కమనీయం ఆదిదంపతుల కల్యాణోత్సవం:** మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవం కాలంలో ఆదివారం రాత్రి కమనీయంగా ఆదిదంపతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఇఒ, చైర్మన్, అధికారులు భక్తులు పాల్గొన్నారు.

**వేదోక్తంగా పూజలు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి కల్యాణోత్సవాలలో సందర్భంగా ఆలయంలో ఉదయం 8 గంటలకు మంటప పూజ, మూలమంత్ర హవనం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ. ఉదయం 9 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో "సదస్యం", సాయంత్రం 4 గంటలకు మంటపారాధన, కలశారాధన, మూలమంత్ర హవనం, బలిహరణ, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.

**నేడు మహాశివరాత్రి మహోత్సవాల పూర్ణాహుతి:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న మహాశివరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం 17న ఆలయంలో ఉదయం 8 గంటలకు మంటప పూజ, మూల మంత్ర హవనములు, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం. పాత యాగశాలలో ఉదయం 9 గంటలకు "పూర్ణాహుతి" నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. అనంతరం వసంతోత్సవము, దుర్గా ఘాట్ నందు కృష్ణానదిలో అవభృతోత్సవము (చక్రస్నానం), ధ్వజావరోహణంతో మహాశివరాత్రి మహోత్సవాలు పూర్తవుతాయని, భక్తజనులందరూ అధిక సంఖ్యలో ఈ పూర్ణాహుతి, ఇతర విశేష పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

### రేపు మే నెల ఆర్జితసేవల కోటా విడుదల

#### - ఆన్‌లైన్‌లో శ్రీవారి దర్శనాలకు టిటిడి పిలుపు



తిరుమల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న మేనెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 18వ తేదీ నుండి 24వరకు విడుదల చేయనుంది. ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్న సేవా దర్శనాల కోటాలో రేపు ఉ.10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లు చేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 18వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వ తేదీ నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్ ద్వారా టిక్కెట్లుకు భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 21న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అంగప్రదక్షణ టోకెన్లను 23వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప) 750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. ఇక శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కూడా పూర్తిగా ఆన్‌లైన్‌లో 23న ఉ. 11గంటలకు విడుదల చేస్తారు. దివ్యాంగులు, వృద్ధుల కోటా 23న మ.3గంటలకు, రూ.300లు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24న ఉ.10గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేయనుంది. 24న గదుల కోటా విడుదల చేస్తారు. 27న మధ్యాహ్నం 3గంటలకు శ్రీవారి సేవా కోటా ఏప్రిల్ నెలకు విడుదలవుతుంది. భక్తులు ఈ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిడిదేవస్థానమ్స్.ఏపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలని టిటిడి కోరింది.

### ఇక రెవెన్యూశాఖలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్లు

విజయవాడ,ఫిబ్రవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల పరిమితులను సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకుంటున్న మార్పుల్లో భాగంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖలోని ఎమ్మార్వో కార్యాలయాల్లో పని చేసే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు పేరును మారుస్తూ, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉత్తర్వులు విడుదల చేసింది. ఉత్తర్వుల ప్రకారం, ఇప్పటికే ఈ పోస్టులో పనిచేస్తున్న ఉద్యోగులు ఇక నుంచి జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ గా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మార్పు కారణంగా ఉద్యోగ వివరణలు, జాబ్ ప్రొఫైల్, సమర్థతా ప్రమాణాలు స్పష్టతతో గుర్తిస్తున్నట్లు తెలిపింది. ముఖ్యంగా జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అసిస్టెంట్‌గా నిర్వహిస్తున్న విధులు ఇప్పుడు జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మారాయి. రెవెన్యూ శాఖలో వర్క్ లోడును సరళతరం చేయడం, పోస్టుల మధ్య స్పష్టత, ఉద్యోగుల బాధ్యతలను సులభంగా గుర్తించడం ఈ మార్పు లక్ష్యంగా ఉంది. ఇది శాఖలో పనితీరును మరింత సమర్థవంతంగా మార్చే దిశగా పరిగణించవచ్చు.

### నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: పెదపారుపూడి మండలంలో దారుణం జరిగింది. నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి జరిగింది. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదనాన్న వరసయ్యే వ్యక్తే లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక కుటుంబ సభ్యులు గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు.. పెదపారుపూడి పోలీసులు చర్యలు చేపట్టారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసినట్లు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినిల్ మీడియాకు తెలిపారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పోలీసులు సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు.

### అగ్నివీర్ నియామకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: సైన్యంలో నియామకాల కోసం ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి నట్లు రిక్రూట్‌మెంట్ అధికారి, గుంటూరు డైరెక్టర్ కర్నల్ రజత్ సువర్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ వివిధ విభాగాల్లో నియామకాలకు ఈ నెల 13న నోటిఫికేషన్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్ ఇండియన్‌ఆర్మీ. ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో విడు దల చేసినట్లు తెలిపారు. గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం పరిధిలోని కర్నూలు, ఎస్పీఎస్ నెల్లూరు, అనంతపురం, కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరు పతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి, మార్కాపురం జిల్లాలకు చెందిన అవివాహిత యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మన్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు రెండు విభాగాలకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గరిష్ఠ వయోపరిమితిని 21 నుంచి 22 ఏళ్లకు పెంచినట్లు చెప్పారు. ఐటీఐ, డిప్లొమా, ఎన్‌సీసీ, అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయన్నారు.

### 26నుండి తిరుమలేశుని తెప్పోత్సవాలు




తిరుమల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 26వ తేదీ నుండి ఐదురోజులు వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు, నీటివిభాగం అధికారులు బలమైన తండ్లతో తెప్పను తీర్చిదిద్దుతారు. తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి అన్ని చర్యలు తీసుకుని ఏర్పాట్లు చేస్తుంది. ఫిబ్రవరి 26వ తేదీ గురువారం సాయంత్రం నుండి మార్చి 2వతేదీ సోమవారం వరకు ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయ స్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు. రెండవరోజు మూడుచుట్లు, మూడవరోజు ఐదు చుట్లు. నాలుగు, ఐదు రోజుల్లో పలురకాల అలంకరణల్లో మలయప్ప తెప్పలపై విహరిస్తారు. తొలి రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేశారు.

### మార్చి 3న శ్రీవారి ఆలయం మూత

#### - ఆ రోజు ఉదయం 9గంటల నుండి దర్శనాలు రద్దు



తిరుమల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మార్చి 3వతేదీ మంగళవారం 10.30గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేస్తున్నారు. ఆరోజు సాయంత్రం 3.20గంటల గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణసమయానికి 6గంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మార్చి 3వ తేదీ ఉదయం చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దు చేశారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8.30గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమవుతుంది. ఆరోజు ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధనసేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. దేశవిదేశాల్లో ఉన్న శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని గమనించి తిరుమల యాత్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని టిటిడి కోరింది.

## 23న తెప్పోత్సవాల ట్రయల్‌రన్

#### - 20నుండి మార్చి 5వరకు పుష్కరిణి స్నానాలు రద్దు

#### - మార్చి 3న కుమారధార ముక్కోటి

#### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



తిరుమల, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఐదురోజులపాటు జరగనున్న శ్రీవారి తెప్పోత్సవాల ట్రయల్‌రన్ ఈనెల 20వ తేదీ శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నారు. 26వతేదీ నుండి మార్చి 2వరకు తెప్పోత్సవాలు పుష్కరిణిలో జరగనున్నందున 20వ తేదీ నుండి మార్చి 5 వరకు భక్తులకు పుష్కరిణిలో స్నానాలు టిటిడి రద్దుచేసింది. మార్చి 3వతేదీ కుమారధారతీర్థ ముక్కోటి సందర్భంగా భక్తులకు ఏర్పాట్లు, సౌకర్యాలపై సోమవారం తిరుమల పద్మావతి అతిథిభవనంలో సుధర్మ సమావేశం మందిరంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమావేశమయ్యారు. ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమన్నారాయణ, సువర్ణమ్మ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, ఇఇలు శ్రీనివాసరావు, సుధాకర్, సురేంద్రతో కలసి సమీక్షించారు.

వేసవి సెలవులు మొదలు కావడానికి ముందే భక్తుల తాకిడి ఎక్కువగా ఉందని, అందుకు అనుగుణంగా అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు ఆదేశాలిచ్చారు. మార్చి 3వ తేదీ మంగళవారం కుమారధారతీర్థ ముక్కోటి వేడుకలు జరుపుకోనున్నామని, అందుకు భక్తులకు పటిష్ట భద్రత ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలన్నారు. కుమారధారతీర్థ ముక్కోటికి ఉదయం 5గంటల నుండి 10గంటల వరకు తీర్థానికి భక్తులను అనుమతిస్తామని. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు.

అధిక బరువు, ఆస్తమా, గుండె జబ్బుతో బాధపడేవారిని అనుమతించరని, వృద్ధుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అటవీమార్గంలో తీర్థానికి నడచి వెళ్ళడానికి అనుమతించబోమన్నారు. పాపవినాశనం నుండి కుమారధార తీర్థం వరకు అక్కడక్కడ భద్రత సిబ్బంది భక్తులకు సేవలందించేలా చూడాలన్నారు. భక్తులకు సకల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్చి 3న విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు వెంకయ్యచౌదరి తెలిపారు.

# కన్నుల పండువగా శ్రీశైల మల్లన్న రథోత్సవం

## భక్తజన సందోహం నడుమ మల్లన్న తెప్పోత్సవం



శ్రీశైలం ప్రాజెక్ట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: మహాశివరాత్రి పురస్కరించుకొని నవాహిక దీక్షతో 11 రోజులపాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 9వ రోజైన సోమవారం నాడు శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కళ్యాణం కోసం జపాలు, పారాయణులు, చేశారు. అనంతరం మండపారాధనలు, పంచావరనార్చనలు, శివ పంచాక్షరి, నిత్య హోమాలు, రుద్రహోమం, చండీ హోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారం జరిపారు. అదే విధంగా సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపాను స్థానాలు, రుద్ర పారాయణులు, హోమాలు చేశారు.

మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజున సాయంకాలం స్వామి అమ్మవార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. రథోత్సవంలో సాంప్రదాయాన్ని అనుసరించి ముందుగా రధాంగపూజ, రధాంగ హోమం, రథంగా బలి, కార్యక్రమాలు నిర్వహించారు. రధాంగ బలిలో వసంతముతో నింపిన గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, కుంభం (అన్నం రాసి) సాత్విక బలిగా సమర్పించారు. తరువాత శ్రీ స్వామి అమ్మవార్లను రథంపైకి వేంచేపు చేయించి రథోత్సవం జరిపించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని బంతి, చామంతి, గులాబీలు, కాగడాలు, కనకాంబరాలు, చాందిని, తదితర 11 రకాల పుష్పాలతో రధాన్ని అలంకరించడం జరిగింది. ఈ రథోత్సవ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ శరన్, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, మండలి సభ్యులు, అధికారులు, అర్చక స్వాములు, భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



**భక్తజన సందోహం నడుమ మల్లన్న తెప్పోత్సవం:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ పుష్కరిని వద్ద ఈ తెపోత్సవ కార్యక్రమం జరిపారు. ఈ తెప్పోత్సవ కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రాంగణంలో శ్రీ స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను షోడ శోపచారపజల నిర్వహించబడ్డాయి. తరువాత ఉత్సవమూర్తులను ఆలయ రాజగోపురము నుండి పుష్పాలంకృత పల్లకిలో ఊరేగింపుగా తోడుకొని వచ్చి పుష్కరిణిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తెప్పపై వేంచేబు చేయించి విశేష పూజాదికాలు నిర్వహించారు. తరువాత మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఎంతో శాస్త్రకంగా ఈ తెప్పోత్సవం జరిగింది. కాగా వివిధ రకాల పుష్పాలతో చేసిన ప్రత్యేక అలంకరణతో విద్యుత్ దీపాలంకరణతో ఈ తెప్ప ఎంతో కళాత్మకంగా రూపొందించబడింది. తెప్పోత్సవాన్ని దర్శించుకోవడం వలన శ్రేయస్సు కలుగుతుంది, శత్రు బాధలు తొలగిపోతాయి, కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.



బంగారు సింహవాహనంపై దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు



ఆదిదంపతుల రథోత్సవంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులు

# కదలిన కైలాసనాధుని రథం

# ఇసుకేస్తే రాలనంత భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: 'హర హర మహాదేవా శంభోశంకరా కరుణించి మము బ్రోవరా' అంటూ శివభక్తులు భోళాశంకరుని రథోత్సవంలో పాల్గొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆదిదేవుని రథత్సోవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవాన్ని స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దంపతులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయనతో పాటు ఇఓ బాపిరెడ్డి దంపతులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ దంపతులు పాల్గొన్నారు. లక్షలాది మంది భక్తులు నాలుగు మాడా వీధుల్లో దేవదేవుని రథోత్సవానికి తరలి వచ్చారు. ఆయన దివ్యతేజస్సును తిలకించటానికి వేయి కళ్ళు అయినా చాలన్నట్లు అలంకారాలు తీర్చి దిద్దారు. భోళాశంకరుని భక్తజనుల హరనామస్మరణతో దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారి రథం వెంటరాగా శ్రీకాళహస్తి పురవీధుల్లో కనువిందు చేస్తు సాగింది. స్వామి రథంలో ఇన్‌చార్జి ప్రధానార్చక కరుణాకర్ గురుకుల్, ఎస్ఎంకె పరుశురాంగురుకుల్, (అచ్చితాస్వామి)కృష్ణమూర్తి గురుకుల్, ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, నిరంజన్ గుకుల్‌లు ఆశీనులయ్యారు. ఈ ఉత్సవాలను కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి దంపతులు, ఇఇ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఉత్సవ ఇన్‌చార్జిలు వెంకటస్వామి, నాగభూషణం పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి పర్వదినాన రాత్రంతా శివనామస్మరణతో జాగరణ చేసిన భక్తులు ఆలయంలో నిద్రించిన వారు వేకువ జామున లేచి లింగోద్భవ అభిషేక దర్శనం కూడా చేసుకున్నారు.

# జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో నాగబాబుకు 5 మెడల్స్





భీమవరం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ జిల్లా గోఖలపూర్‌లో జరిగిన 45వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ మీట్‌లో మొత్తం 5 విభాగాలలో పాల్గొని ఏకంగా ఐదు పతకాలు సాధించారు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన యాతం నాగబాబు. తద్వారా ఆయన భీమవరానికే కాక రాష్ట్రానికే జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిపెట్టారు. అంతేకాక 2026 మార్చిలో థాయిలాండ్‌లో జరుగనున్న ప్రపంచ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. 800 మీటర్ల పరుగు పందెం నందు మొదటి స్థానం (బంగారు పతకం), 1500 మీటర్ల పరుగు పందెం నందు మొదటి స్థానం (బంగారు పతకం), 400 మీటర్ల పరుగుపందెం నందు రెండవ స్థానం (వెండి పతకం), 4 400 మీటర్ల రిలే పరుగు పందెం నందు రెండవ స్థానం (వెండి పతకం), 4 100 మీటర్ల రిలే పరుగు పందెం నందు మూడవ స్థానం (కాంస్య పతకం) మొత్తం రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకం సాధించారు. ఈ జాతీయ అథ్లెటిక్స్‌లో దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి 3,400 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఒకేసారి ఐదు పతకాలతో మధ్యప్రదేశ్‌లో 3400 మంది అథ్లెట్స్ మధ్య మెరిసిన యాతం నాగబాబు భీమవరంలో వైద్య ఆరోగ్యశాఖ నందు జిల్లా ఉప మలేరియా అధికారిగా పనిచేస్తున్నారు. ఐదు పతకాలు సాధించిన నాగబాబును సహోద్యోగులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు అభినందిస్తున్నారు.



# లో ఓల్టేజి సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపునకు చర్యలు

- వినియోగదారులకు సకాలంలో సేవలు
- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్


తిరుపతి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలో తొమ్మిది జిల్లాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న లో ఓల్టేజి సమస్య, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు చర్యలు తీసుకుంటామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల మంజూరు కూడా సకాలంలో చేపడతామన్నారు. పలు జిల్లాల వినియోగదారులు ఆయా సమస్యలను విన్నవించారని, వాటి పరిష్కారంలో సకాలంలో సేవలందించాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం "డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి" కార్యక్రమం తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 51సమస్యలు అందాయి. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఫోన్ ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేసి తెలియజేయవచ్చని కోరారు. ఇంకా 91333 31912కు వాట్సాప్ నంబర్‌కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పి.అయూబ్ ఖాన్ సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్,ఐటి), కె. గురవయ్య డైరెక్టర్ (టెక్నికల్ ,హెచ్ఆర్డి), కె.రామ్మోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పి.హెచ్. జానకి, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, కె. ఆదిశేషయ్య, యం. మురళీ కుమార్, యం. కృష్ణారెడ్డి, రామచంద్రరావు, సంపత్‌కుమార్, జిఎంలు వి.విజయన్, చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత తదితరులు పాల్గొన్నారు.



# వృషభ వాహనంపై మణికంఠేశ్వరుడు

కాణిపాకం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగధాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం శివపార్వతులు వృషభ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటా క్షించారు. మరగధాంభిగా సమేత మణికంఠేశ్వర స్వామి అలంకార భూషితులై వృషభ వాహనంపై అధిరోహించి భక్తులను అభయహస్తం అందించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకంకు చెందిన హరిజన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించి వరుస ఉభయం తీసుకువచ్చారు. అంతకుముందు ఆలయంలో అర్చకస్వాములు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి అలంకరంచి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం వృషభ వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారికేల కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



# ఆర్థికసంఘం నిధులపై ఆంక్షలు తొలగించాలి

విజయవాడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధుల వినియోగంపై రాష్ట్రప్రభుత్వం విధించిన ఆంక్షలు తొలగించాలని సర్పంచ్‌ల సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఈమేరకు సోమవారం సచివాలయంలో గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వేల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, అఖిలభారత పంచాయతీ పరిషత్ (డిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతి పత్రం అందచేసారు. కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ కమీషన్ మార్గదర్శకాల ప్రకారం ఈనిధులను ఖర్చుచేసేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయం నుండి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం 15వ ఆర్థికసంఘం నిధులను కరెంట్‌బకాయిలు, గ్రీన్ అంబాసిడర్‌ల జీతాలు, చెత్తసేకరణ వంటి అంశాలకే ఖర్చుచేయాలన్న ఆదేశాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గతంలో మాదిరిగానే సిసిరోడ్ల నిర్మాణం, అంగన్‌వాడిల నిర్మాణం, పాఠశాల భవనాలు, సెడ్‌డ్రైయిన్‌లు, విద్యుత్ పరికరాల కొనుగోలుకు ఈనిధులను వినియోగించుకునేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఇప్పటికే పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్‌లు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత నవంబర్, డిసెంబర్ నెలల్లో అప్‌లోడ్ చేసిన బిల్లులను పెండింగ్‌లో ఉంచారని వాటికి నిధులు విడుదల చేయాలని కోరారు. వీరి వినతికి సానుకూలంగా స్పందించిన శశిభూషణ్‌కుమార్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామి ఇచ్చారు.



# ఆచార్య కొలకలూరి ఇనాక్ రచనలు ఠాగూర్ గ్రంథాలయానికి అందజేత

విజయవాడ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: సుప్రసిద్ధ రచయిత, విశ్రాంత ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన విలువైన పుస్తకాలను ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి అందజేశారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ రచించిన అరుదైన పుస్తకాలను నవభారత్ నిర్మాణ సంఘం వ్యవస్థాపకులు సూరేపల్లి రవికుమార్ హైదరాబాద్ నుండి విజయవాడకు తీసుకొచ్చారు. ఆ పుస్తకాలను ఏదైనా గ్రంథాలయానికి ఇవ్వవలసిందిగా ఇనాక్ కోరారు. ఆయన కోరిక మేరకు విజయవాడ బందరురోడ్డులో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి ఇవ్వాలని నిర్ణయించుకున్న మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ ఆ గ్రంథాలయాధికారిణి రమాదేవిని సంప్రదించగా ఆమె వెంటనే అంగీకరించారు. పుస్తకాలను తీసుకుని వెళ్ళి, బందరురోడ్డులో గల ఠాగూర్ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి రమాదేవికి అందజేశారు కలిమిశ్రీ. సామాన్య పాఠకులకే కాక పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కూడా ఉపయోగపడే పుస్తకాలు అందించడం సంతోషంగా వుందని, వీటిని పాఠకులకు, విద్యార్థులకు అందుబాటులో వుంచుతామని గ్రంథాలయాధికారిణి రమాదేవి అన్నారు. కార్యక్రమంలో సూరేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

# ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో ఎంఎస్ఎంఈ రంగానికి భారీ కేటాయింపులు

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి





సచివాలయం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకం "ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త" ద్వారా 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఇది వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర 2047 దార్శనికతకు అనుగుణంగా రూపొందించబడిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎంఎస్ఎంఈ క్లస్టర్, మౌలికసదుపాయాల అభివృద్ధికి రాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసిందని అన్నారు. ఏపి-సిడిపి పథకం కింద రూ.200కోట్ల వ్యయంతో 5ఏళ్ళలో 45ఉమ్మడి సౌకర్య కేంద్రాల ఏర్పాటు చేయడం ద్వారా 1,688 కొత్త సంస్థలు ఆవిర్భవించనున్నాయని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే 15పార్కులు అందుబాటులోనికి రాగా,82 పార్కులకు శంకుస్థాపన పూర్తిచేసి మౌలిక సదుపాయాల కల్పనా కార్యకలాపాలు వేగంగా జరుగుతున్నాయన్నారు.

**బడ్జెట్ కేటాయింపులు:** క్లస్టర్ అభివృద్ధికి రూ.111.82 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100.00 కోట్లు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ప్రోత్సాహకాలకు రూ.229.36 కోట్లు, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.316.38 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.71.20 కోట్లు ప్రోత్సాహకాల కోసం కేటాయించడం జరిగిందన్నారు.

హార్టికల్చర్, ఎగుమతి రంగం అభివృద్ధిలో భాగంగా కొబ్బరి, జీడిమామిడి, కోకో రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, కొబ్బరి ప్రాసెసింగ్‌లో రూ.1000 కోట్లు, కోకోలో రూ.400 కోట్ల పెట్టుబడి సామర్థ్యం ఉందన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై సుంకం లేని దిగుమతి పరిమితిని 1నుంచి 3శాతానికి పెంచడం వల్ల ఏపిలోని ఆక్వా రంగం మరింత ప్రపంచస్థాయి పోటీని తట్టుకొని ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిని ఒక పారిశ్రామిక కేంద్రంగా మార్చడమే మా లక్ష్యంగా ఈ బడ్జెట్ కేటాయింపులు మన యువతను ఉద్యోగాల కోసం వెతికే వారి నుండి, ఉద్యోగాలు ఇచ్చే వారిగా మారుస్తాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.

# తలలపై పగిలిన టెంకాయలు

## - హనుమన్న కొటాలులో కురబ దేవతలకు పూజలు

కుప్పం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: కుప్పం మండలం సదుమూరు పంచాయతీ హనుమన్న కొటాలు గ్రామంలో కురబ కులస్తుల అధ్వర్యంలో గ్రామంలో వెలసిన కురబ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పండగ సందర్భంగా గ్రామంలోని శ్రీహనుమంతరాయ స్వామి, శ్రీ సిద్ధేశ్వర స్వామి, కుందాని లక్కమ్మ, శ్రీబీరేశ్వరస్వామి తదితర దేవతలకు పూజలు జరిపారు. అనంతరం సాయంత్రం మొక్కులు కలిగిన భక్తులు తలలపై టెంకాయలు పగలగొట్టుకుని భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నేతలు విభూషణ్, లీలా వెంకటేష్, కృష్ణమూర్తి, రమేష్, దాము, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సైనిక్ సంక్షేమ అధికారి తిమ్మప్ప సేవలు అభినందనీయం

అనంతపురం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త బ్యూరో: జిల్లా సైనిక్ సంక్షేమ అధికారిగా పనిచేసిన తిమ్మప్ప మాజీ సైనికులు, సర్వింగ్ సోల్జర్స్, వారి కుటుంబ సభ్యులకు చేసిన సేవలు ఎంతో గొప్పవని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి భవనంలోని విసి హాల్‌లో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప తన పదవీ కాలం పూర్తి చేసుకుని సొంత ఐఅండ్‌పీఆర్ శాఖలో త్వరలో జెడి ప్రమోషన్ ఉన్నందున హెడ్ క్వార్టర్స్ విజయవాడకు తిరిగి వెళుతున్న సందర్భంగా తిమ్మప్పకు జిల్లా అధికారుల సంక్షేమ సంఘం తరఫున జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల, పలు శాఖల జిల్లా అధికారులు శాలువా కప్పి, జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు మాలోల, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రామసుబ్బా రెడ్డి, జిల్లా ఫైర్ సర్వీసెస్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా వ్యవసాయ అధికారి రవి, డిఈఓ ప్రసాద్ బాబు, జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కమిటీ, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్, ఎల్డిఎం నరేష్, ఉమ్మడి జిల్లా ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జిల్లా గ్రంథాలయం సెక్రెటరీ కమ్మన్న, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం, తిమ్మప్పను మాజీ సైనికులు, వీర నారీలు, సంఘం నాయకులు, కార్యాలయ నూతన అధికారి, సిబ్బంది తిమ్మప్పను ఘనంగా సత్కరించారు. కార్యాలయ నూతన అధికారి మహమ్మద్ రజాక్, మాజీ సైనికుల సంఘం జిల్లా నాయకుడు విశ్వేశ్వర రావ్, అనంతపురము, తాడిపత్రి, పుట్టపర్తి, గుంతకల్లు, కదిరి, హిందూపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, ధర్మవరం తదితర ప్రాంతాల నుండి వచ్చిన మాజీ సైనిక సంఘం నాయకులు, వీర్ నారీలు, కార్యాలయం సిబ్బంది తదితరులు తిమ్మప్పను ఘనంగా సత్కరించారు.

# సంపద పెంచి పేదలకు పంచాలనేదే ఆశయం

## - ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: రాష్ట్రంలో సంపదను పెంచి పేదలకు పంచాలనేదే సిఎం చంద్రబాబునాయుడు ఆశయం అని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 2019-24 మధ్య రాష్ట్రంలో వైఎస్సార్సీ పాలనలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూల్చడంతో పాటు పది లక్షల కోట్లు అప్పులు చేసి పప్పుకూడు పెట్టారని దుయ్యబట్టారు. 12.3శాతం వడ్డీకి రుణాలు తెచ్చిన ఘనత వైఎస్సార్సీ ప్రభుత్వంకే దక్కుతుందన్నారు. నాటి పాలన విధ్వంసం అయితే కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వికాసం వైపు పరుగులు తీస్తోందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర విభజన సమయంలో సైతం రూ.16 వేల కోట్లు అప్పులు ఉన్నా, రాజధాని లేకున్నా బస్సులోనే బస చేసి పాలన సాగించారని గుర్తు చేశారు. వైఎస్సార్సీ పాలనలో దగా పడ్డ రాష్ట్రానికి సిఎం చంద్రబాబు దిశ, దశ మార్చుతున్నా రన్నారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చిన సిఎం చంద్రబాబు దేశంలో ఎక్కడాలేనివిధంగా ట్రూడౌన్ చార్జీల పేరిట విద్యుత్ బిల్లులు తగ్గించారన్నారు. రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్ ఐదు కోట్ల ఆంధ్రుల ఆశల బడ్జెట్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, అన్ని వర్గాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించారన్నారు. కేవలం సంక్షేమం కోసమే రూ.52 వేల కోట్లు కేటాయించారన్నారు. రైతుల కోసం రూ.13 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కల్పించారన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో మార్పులు తెస్తున్నారన్నారు. పాఠశాల విద్యకు రూ.32,308 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు.

ఈసందర్భ ంగా ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, టిడిపి మండల అధ్యక్షులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, ఉదయ్‌కుమార్, సుబ్బు, కడ సభ్యురాలు సుగుణమ్మ, నేతలు మణి, గిరి, సంతోష్ పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- కోటిన్నర సొమ్ము స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి కృష్ణమోహన్



రాయచోటి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: జాతీయ రహదారిలో ఒంటరి డ్రైవింగ్ చేసే వాళ్లే లక్ష్యంగా ఎక్కడో మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా ఫైనాన్స్ కంపెనీని పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిని రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రామాపురం పోలీసులు ఆటకట్టించారు. ఒంటరిగా వాహనాలలో వచ్చే వారిని ముందుగా మేము పెయిన్స్ కంపెనీ వాళ్ళము అని చెప్పి అనేక రకాలుగా బయబ్రంతకు గురిచేసి డబ్బులను వసూలు చేసి మోసానికి తెర లేపారు. రామాపురం పోలీసులు ఆ మోసానికి సమాప్తం పలికే విధంగా అడుగులు వేశారు. ఎట్టకేలకు మహారాష్ట్ర మోసాల ముఠాను అరెస్ట్ చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ 1,50,00,000 విలువైన సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాయచోటిలోని డీఎస్పీ కార్యాలయం నందు డీఎస్పీ కృష్ణమోహన్ సంబంధిత వివరాలను మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణ మోహన్ తెలియజేసిన వివరాలు... రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన షేక్ ఇర్ఫాన్ అనే వ్యక్తి ఈ నెల 14 వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామాపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డి.ఎస్.పి కృషమోహన్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రామాపురం సమీపంలోని జాతీయ రహదారిలో మహారాష్ట్రకు చెందిన లారీ (ట్రక్) డ్రైవర్ షేక్ ఇర్ఫాన్‌ను కొందరు వ్యక్తులు ఆపి ఈఎంఐ బకాయిలు పెండింగ్ ఉన్నాయని, మేము ఫైనాన్స్ కంపెనీ వాళ్ళం అని మోసపూరిత మాటలు చెప్పి లారీ (ట్రక్) వాహనాన్ని స్వాధీనం చేసుకొని దొంగిలించారు. చేసేది ఏమి లేక ఇర్ఫాన్ రామాపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు లక్కిరెడ్డిపల్లి సిఐ కృష్ణం రాజునాయక్, జిల్లా సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, రామాపురం ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో చిట్లూరు పంచాయతీ గంగమ్మ గుడి మజ్జిగవాండ్ల పల్లి, గంగమ్మ గుడి రోడ్డులో నిందితుల ఆచూకీ కనుక్కుని అక్కడికి వెళ్ళారు. నిందితులను గుర్తించి పట్టుకునే ప్రయత్నంలో వారు పారిపోయారు. పోలీసులు వెంబడించి నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన రాజ్‌పుత్ర మల్హారి షిండే, నిసార్ రఫిక్ షేక్, లక్ష్మణ్ దిగంబర, సూరజ్ రమేష్ ఔరదేలుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఒక లారీ (ట్రక్), 33 లోహపు ముద్దలు, స్కార్పియో వాహనం, ఒక కొరడా, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొమ్ము విలువ సుమారు రూ 1,50,00,000 ఉంటుందని డీఎస్పీ కృష్ణ మోహన్ తెలియజేశారు. అదేవిధంగా ఇలాంటి దొంగతనాలు వారు అనేకం చేశార అని నిందితులు ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు కృష్ణం రాజునాయక్, చంద్రశేఖర్, ఎస్ఐ శివకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# వైసిపి నేతలపై టిడిపి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

● మాజీ మంత్రి నారాయణ స్వామి కక్షపూరిత చర్యలు ● నామినేషన్ విత్ డ్రా చేసుకోలేదని భూమి కబ్జా
● భూమి ఆక్రమణ,.. కులం పేరుతో బెదిరింపులు ● అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, బెస్త సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్

విజయవాడ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా చెర్లోపల్లి గ్రామానికి చెందిన కె.నిరోషా సోమవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ తమ గ్రామంలో సర్వే నెం. 120/5లో ఉన్న తమ భూమిని స్థానిక వైసిపి నేతలు కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే సర్వే నెం. 201/2 భూమిపై కోర్టులో కేసు నడుస్తుండగానే నిబంధనలకు విరుద్ధంగా వేరే వ్యక్తులు ఆన్‌లైన్‌లో తమ పేర్ల మీద నమోదు చేసుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదు. దీంతో పాటు తమ పూర్వీకుల నుండి సంక్రమించిన సర్వే నెం. 162/1, 162/4ఎ భూములకు సంబంధించి 'నోషన్ ఖాతా' సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై గతంలో ఆర్డీఓకి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు మంత్రి సవిత, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బెస్త సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్‌లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం జుపల్లి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తాను తెలుగుదేశం పార్టీ తరపున ఎంపిటిసి, సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశాను. నామినేషన్ ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చినా లొంగకపోవడంతో మాజీ మంత్రి నారాయణ స్వామి కక్షపూరితంగా వ్యవహరించి తన సొంత భూమిని ఆక్రమించారు. సర్వే నెంబర్ 1314 లో గల 3.98 ఎకరాల భూమి తన తల్లి సిద్దమ్మ పేరు మీద 2000 సంవత్సరంలో మంజూరు చేయబడింది. ఎన్నో ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న ఈ భూమిని అక్రమంగా లాక్కుని పట్టాలు పంపిణీ చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం కోటకొండ గ్రామానికి చెందిన మండ్ల కాశమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలోని సర్వే నెం. 2857దిలో తమకు 3.00 ఎకరాల భూమి కలదు. దీనికి సంబంధించి పట్టాదారు పాస్ బుక్, 1బీ,అడంగల్, ఆన్‌లైన్ రికార్డులన్నీ తన పేరుపైనే ఉన్నాయి. అదే సర్వే నంబర్‌లో పక్కనే 2 ఎకరాల భూమి ఉన్న కల్లకుంట్ల బాలరాజు అనే వ్యక్తి తమకు చెందిన సుమారు 1.60 ఎకరాల భూమిని గత మూడు సంవత్సరాలుగా దౌర్జన్యంగా ఆక్రమించి సాగు చేస్తున్నాడు. భూమి గురించి అడిగితే తను ఎస్సీ కులానికి చెందినవాడినని, ఎదురు తిరిగితే అక్రమ కేసులు పెడతానని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. తాము సాగు చేసిన పంటను నాశనం చేయడమే కాకుండా పొలంలోని నీటి పైపులను కూడా తగులబెట్టారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధింత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గోడెం అనుమాయమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 322/1, 322/2, 589/1లలో మొత్తం 1.19 ఎకరాల భూమి కలదు. ఈ భూమిలోకి వెళ్లడానికి సర్వే నెం. 322/3 (0.14 సెంట్లు) గుండా దారి ఉంది. పక్క పొలం వారైన గోడెం వేణు వారి కుటుంబ సభ్యులు, తమను పొలంలోకి వెళ్లకుండా దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు. అడిగితే చంపుతామని బెదిరిస్తూ దుర్భాషలాడుతున్నారు. గతంలో సర్వే కోసం దరఖాస్తు చేసుకోగా, గన్నవరం మండల సర్వేయర్ వచ్చి భూమిని కొలవడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ఎదుటి పక్షం వారు సర్వేయర్ గారి పైన కూడా దాడికి దిగి, సర్వే జరగకుండా అడ్డుకున్నారు. దీనివల్ల ఇంతవరకు ఎటువంటి రిపోర్టు అందలేదు. వారిపై చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలని కోరాడు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన ఆవుల శ్రీకాంత్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..కర్నూలుకు చెందిన కోడితం శ్రీనివాసులు అనే వ్యక్తి, తమ పొలాన్ని (సర్వే నెం: 243/1, విస్తీర్ణం 2.32 ఎకరాలు) కంకర ఫ్యాక్టరీ కోసం 12 ఏళ్ల లీజుకు తీసుకుంటానని నమ్మించాడు. లీజు అగ్రిమెంట్ అని చెప్పి తన తండ్రిని రిజిస్టర్ ఆఫీసుకు తీసుకెళ్లి అక్కడ ఆయనకు మద్యం తాపించి, మత్తులో ఉన్న సమయంలో లీజు పత్రాలకు బదులు సేల్ డీడ్ (అమ్మకం పత్రాలు) పై సంతకాలు చేయించుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ (తేదీ: 29062002) చేయించుకున్నాడు. ఎటువంటి మైనింగ్ అనుమతులు, లైసెన్సులు లేకపోయినా దౌర్జన్యంగా బ్లాస్టింగ్లు చేస్తూ కంకర ఫ్యాక్టరీ నడుపుతున్నాడు. లీజు గడువు ముగిసిన తర్వాత తమ పొలం తమకు ఇవ్వమని అడిగితే.. "పొలం నేను కొన్నాను, వస్తే చంపేస్తాను" అంటూ కోడితం శ్రీనివాసులు తుపాకీతో బెదిరిస్తున్నాడు. తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలం పిటికాయగుళ్ళ గ్రామానికి చెందిన నడిపి వెంకటరెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 170/2 నుండి 170/1 సర్వే నంబర్ల పరిధిలో సుమారు 15 ఏళ్లుగా మూడు అడుగుల లోతులో ఉన్న సాగునీటి పైపులను, ఈ నెల 13-02-2026న నబీరసూల్, మరికొందరు వ్యక్తులు కలిసి ఎపి07డిజె 2673 నంబర్ గల జెసిబి వాహనంతో ఉద్దేశ్యపూర్వకంగా ధ్వంసం చేశారు. దారి లేకపోయినప్పటికీ కక్షపూరితంగా 15-02-2026న సాగులో ఉన్న మిర్చి పంటను ట్రాక్టర్‌తో తొక్కించి పూర్తిగా నాశనం చేశారు. ఈ ఘటనపై 13నే బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇంతవరకు నీళి నమోదు చేయలేదు. నిందితుల వాహనాన్ని స్వాధీనం చేసుకోలేదు. తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.



రాజశేఖర్ కుటుంభసభ్యులకు సాయం అందిస్తున్న దృశ్యం

## రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆసరా

విజయవాడ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందిన ఎపిఎస్‌పి రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి సహచరులు అసరాగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 1998 బ్యాచ్‌కు చెందిన వై.రాజశేఖర్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2024జనవరిలో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మృతి చెందారు. రాజశేఖర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంగతి గమనించిన సహచరులు విరాళాలు సేకరించి మృతుని కుటుంబానికి చేయూతనిచ్చారు. విజయవాడజోన్ తరుపున మొత్తం రూ.2.40 లక్షల విరాళాలు సేకరించి సోమవారం కమాండెంట్ యం.శంకరరావు, డిఎస్పీలు మల్లిఖార్జునరావు, ఏపి సెక్రటరీ యూనిట్ హెమసుందరరావు, ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్‌ల చేతుల మీదుగా మృతుని కుటుంబసభ్యులకు అందచేసారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వింజమూరు (నెల్లూరు), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి వ్యక్తి చనిపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఏఎస్‌పేట మండలం రాజవోలు గ్రామానికి చెందిన కూరపాటి లక్ష్మీ సురేష్ దంపతుల కుమారుడైన కూరపాటి సురేంద్ర(27) వింజమూరులోని అపోలో ఫార్మసీలో రెండు నెలల క్రితం విధుల్లో చేరారు. సోమవారం విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం ఒంటిగంట డ్యూటీకి హాజరై సాయంత్రం సమయంలో షాపు వద్ద నుండి పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. బంగ్లా సెంటర్‌కు వస్తుండగా మధ్యలో వైఆర్ జూనియర్ కళాశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్ దాటి వస్తూ తిరిగి రోడ్డు ఎక్కే సందర్భంలో స్కిడ్ అయి పడిపోగా వెనుక వైపు నుంచి వస్తున్న ఉదయగిరి డిపో బస్సు అతని మీదుగా ఎక్కి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు హుటాహుటీన ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లగా వైద్యాధికారి పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తమై మృతదేహాన్ని ఆత్మకూరుకు తరలించారు. సంబంధిత విషయమై పోలీసులు వైద్యశాలకు చేరుకుని సమాచారం సేకరించారు. మృతునికి భార్య, రెండు సంవత్సరాల పాప ఉన్నారు.

## ఈతకు వెళ్లి ఒకరు మృతి మరొకరు గల్లంతు

బిట్రగుంట (నెల్లూరు), ఫిబ్రవరి 16 ప్రభాతవార్త: బోగోలు మండలం తాటిచెట్లపాలెం గ్రామంలో సముద్ర తీరంలో సోమవారం ఈతకు వెళ్లి ఒకరు మృతి చెందగా మరొకరు గల్లంతైన సంఘటన జరిగింది. దగదర్తి మండలం ఉలవపాడు గ్రామానికి చెందిన కొంగి దీపక్, నూనె లోకేష్, ఇమ్మానియేల్ సరదాగా సముద్రంలోని ఈతకు వెళ్లారు. ఇందులో కొంగి దీపక్, నూనె లోకేష్ సముద్రంలో మునిగిపోగా కొంగి దీపక్(18) మృతి చెందారు. నూనె లోకేష్ గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని ఇమ్మానియేల్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి మెరైన్ పోలీసులు బిట్రగుంట పోలీసులు రంగప్రవేశం చేసి కొంగి దీపక్ మృతదేహాన్ని వెలికి తీసి గల్లంతైన లోకేష్ కోసం వెతుకుతున్నారు. ఈ సంఘటనతో ఉలవపాడులో విషాద ఛాయలు నెలకొన్నాయి.

## విద్యుత్ బకాయి రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలి

### గీతం వర్సిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాత వార్త: విద్యుత్ బాకాయిల నిమిత్తం రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని గీతం యూనివర్సిటీకి సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి సోమవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. నాలుగు వారల్లో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. విద్యుత్ బకాయిల కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం ధర్మాసనం స్పందించింది. బకాయిలపై హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై గీతం యూనివర్సిటీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. వీటీసీ, గీతం యూనివర్సిటీ ఒక్కటేనని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ధర్మాసనం ముందు వాదనలు వినిపించింది. వీటీసీ ఫెర్రో అలాయస్ కంపెనీ విద్యుత్ బకాయిలకు తమకు సంబంధం లేదని గీతం యూనివర్సిటీ వాదించింది. అయితే వీటీసీ సంస్థకు, గీతంకు ఉన్న సంబంధాన్ని హైకోర్టు సింగిల్ బెంచ్ నిర్ణయించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఇరు పక్షల వాదనలు విన్ని సుప్రీంకోర్టు ఈ మేరకు రూ.15 కోట్లను డిపాజిట్ చేయాలని తేల్చిచెప్పింది. కాగా వీటీసీ సంస్థ నుండి భూములను కొనుగోలు చేసిన గీతం యూనివర్సిటీ రూ.118 కోట్లు బకాయిలు చెల్లించాలని లేని పక్షంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను గీతం యూనివర్సిటీ హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్ రూ.54 కోట్లు చెల్లించాలని గీతం యూనివర్సిటీని ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టును గీతం యూనివర్సిటీ ఆశ్రయించింది.

# రైతులకు మరింత ద్రవ్యపరపతి

**కిసాన్ క్రెడిట్‌కార్డు సులభతరం**
**రిజర్వ్ బ్యాంక్ కీలక మార్పులు**
**త్వరలో మార్గదర్శకాలు విడుదల**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మరింత ఎక్కువ మంది రైతులకు ద్రవ్యపరపతిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకంలో పెద్ద మార్పు లు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి ద్రవ్య పరపతి విధాన కమిటీ, ఎంపీసీ, సమావేశం తర్వాత అభివృద్ధి సంబంధిత నియంత్రణ విధానాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ మార్పుల ఉద్దేశ్యం ఎక్కువ మంది రైతులకు ఈ పథకం చేరేలా చేయడం, ప్రక్రియలను సులభం చేయడమని తెలిపింది. వ్యవసాయ రంగం అవసరాలు కాలానుగుణంగా మారుతు న్నాయి కాబట్టి వాటికి సరిపడేలా రుణ వ్యవస్థను మార్చడం ప్రధానమని పేర్కొంది. ఇదే సమయంలో కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకంపై పూర్తిస్థాయి సమీక్ష పూర్తయిందని తెలిపింది. ఈ సమీక్షలో కవరేజ్ పెంపు, పని విధానాలు సరళీకరణ, వ్యవసాయ రంగం అలాగే అనుబంధ రంగాల్లో వస్తున్న కొత్త అవసరాలపై దృష్టి పెట్టింది. వ్యవసాయ రంగం అలాగే అనుబంధ కార్యకలాపాలకు సంబంధించిన కిసాన్ క్రెడిట్ కార్డ్ మార్గదర్శకాలు ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్నాయి. ఇవన్నీ కలిపి ఒకే కొత్త ఫ్రేమ్‌వర్క్‌గా రూపొందించి బ్యాంకులకు సవరించిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర బ్యాంక్ భావిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్గదర్శకాలలో పంట కాలం ఒకే విధంగా నిర్ణయించే విధానం ఉంది. అన్ని ప్రాంతాల్లో ఒకే రీతిలో పంట కాలాన్ని నిర్వచించడం వల్ల రుణ అవసరాల అంచనా సులభం అవుతుంది, తిరిగి చెల్లింపు కాలపరిమితుల్లో స్పష్టత వస్తుంది.

కిసాన్ క్రెడిట్ కార్డ్ గడువును ఆరు సంవత్సరాలకు పెంచాలని కూడా ఆర్‌బీఐ సూచించింది. దీని వల్ల రైతులకు బ్యాంకులతో దీర్ఘకాలం స్థిరమైన రుణ సంబంధం ఏర్పడుతుంది. ప్రతి పంట కాలానికి ఉన్న స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా డ్రాయింగ్ లిమిట్ నిర్ణయించే విధానాన్ని తీసుకు రానున్నారు. ఇలా చేయడం వల్ల సాగు ఖర్చులకు దగ్గరగా రుణ పరిమితి లభిస్తుంది.

ఆధునిక పరికరాలు, ప్రిసిషన్ ఫార్మింగ్ సాధనాలు, ఇతర అగ్రి టెక్ పరిష్కారాలపై అయ్యే ఖర్చులు కూడా కిసాన్ క్రెడిట్ కార్డ్ కింద అర్హమైన వినియోగంగా చేర్చనున్నారు. ఈ మార్పులన్నీ కలిగిన ముసాయిదా మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని ఆర్‌బీఐ తెలిపింది.

# బూటులో దాచి.. 10 బంగారు బిస్కెట్లు చోరీ

**జోయలుక్కాస్‌లో సేల్స్‌మన్ నిర్వాకం**
**వీటి విలువ రూ. 1.65 కోట్లు.. స్వాధీనం**
**24 గంటల్లో ఛేదించిన పోలీసులు**

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జల్సాలకు అలవాటు పడ్డాడు.. ఖరీదైన వాహనా ల్లో చక్కర్లు కొట్టాలనుకున్నాడు.. పనిచేసే షాపు లో మొదట ఒక బంగారు బిస్కెట్‌ను తన కాలి బూటులో దాచాడు. ఎవరు గుర్తించకపోవడంతో అప్పుడప్పుడు అనుమానం రాకుండా దాదాపు పది బంగారు బిస్కెట్లను బూటులో పెట్టి చోరికి పాల్ప డ్డాడు.. ఈ వ్యవ హారమంతా అక్కడే ఉన్న సీసీ టీవీ కెమెరాలో నమోదైంది.. దుకాణ నిర్వాహకుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పంజాగుట్ట పోలీ సులు 24 గంటలు తిరక్కుండానే నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి కిలో బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకు న్నారు. ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి కథనం ప్రకారం.. పంజాగుట్టలోని జోయలుక్కాస్ జ్యూయె లరీ షోరూంలో దాదాపు ఒకొక్కటి వంద గ్రాము లతో కూడిన పది బంగారు బిస్కెట్లు మాయ మైనట్లు ఈ నెల 14న దుకాణ ప్రతినిధులు గుర్తించారు. దాదాపు రూ. 1.62 కోట్ల విలువైన కిలో బంగారం కనిపించక పోవడంతో వెంటనే సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అందులో భాగంగా కాంట్రాక్ట్ (?) గోపాలకృష్ణ అనే సేల్స్‌మాన్ కాలిబూట్లలో బంగారు బిస్కెట్లు పెట్టుకొని అక్కడి నుంచి జారుకున్నట్లు గుర్తించారు. దీంతో స్టోర్ మేనేజర్ జిన్స్ సెబాస్టియన్ పంజాగుట్ట పోలీ సులకు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట ఎసిపి మురళీకృష్ణ ఆధ్వ ర్యంలో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, డిఐ నాగరాజు, డిఎస్సై సురేష్ బృందం నిందితుడిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన కారంపూడి గోపాల కృష్ణ(25)గా నిందితుడిని గుర్తించి అతని వద్ద నుంచి ఒక కిలో బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాటితోపాటు ఒక సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసు కున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జల్సాల కోసం ఈ చోరికి పాల్పడినట్లు పోలీ సుల దర్యాప్తులో భాగం గా నిందితుడు ప్రాథమి కంగా అంగీకరించాడు. కాగా నగల దుకాణ యజ మానులు తమ స్టోర్ లోపల, బయట, అను బంధ రహదారులు, సెల్లా ర్లు, పార్కింగ్ ప్రాం తాల్లో సీసీటీవీ కెమె రాలను మరింత ఎక్కువగా, నాణ్యమైన వాటిని ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ సూచించారు. ఉద్యోగుల రాకపోకలపై దృష్టి పెట్టాలని, భద్రతా చర్యల విషయంలో రాజీ లేకుండా వ్యవహరించాలని సూచించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.



నిందితుడు గోపాలకృష్ణ, చిత్రంలో స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు, సెల్‌ఫోన్, బైక్ కీ.

# హైదరాబాద్‌లో 'డెడ్‌డ్రాప్' డ్రగ్స్ సరఫరా బట్టబయలు

### కొండాపూర్‌లో అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

హైదరాబాద్ (గచ్చిబౌలి), ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: నగరంలో డ్రగ్స్ భూతం రోజురోజుకు జడలు విప్పుతుంది. ఓ వైపు ఈగల్ టీం, పోలీసులు పటిష్ట నిఘాతో కట్టడి చేస్తుండగా, మరోవైపు డ్రగ్స్ సరఫరాదారులు కొత్త దారులను వెదుకుతున్నారు. తాజాగా నగరంలో డెడ్‌డ్రాప్ డ్రగ్స్ సరఫరా బయటపడడం సంచలనం గా మారింది. కొండాపూర్‌లో ఓ అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాను ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు దాడులు చేసి పట్టు కోగా, ఈ ముఠా డెడ్‌డ్రాప్ తరహాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు సభ్యుల ఈ ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు వీరి వద్ద నుంచి 32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎపిలోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మురళీ కృష్ణంరాజు(24) ఇంజినీరింగ్ మధ్యలోనే వదిలేసి కొన్నాళ్లు ప్రైవేటు ఉద్యోగాలు చేశాడు. వాటిలో ఎక్కువ డబ్బు దొరక్కపోవడం, జల్సాలు, డ్రగ్స్ సేవించడం అలవాటు కావడంతో ఖర్చులు పెరిగాయి. దీంతో తానే డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించాడు. మొదట మణికొండలో ఉండే ఓ వ్యక్తి నుంచి గ్రాము కొకైన్ 10వేలకు కొనుగోలుచేసి 11వేలకు తెలిసిన వారికి విక్రయించేవాడు. కాగా మణికొండ వ్యక్తి పోలీసులకు పట్టుబడడంతో బెంగళూరుకు చెందిన నైజీరియన్ వద్ద నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తీసుకు వస్తున్నాడు. గోవాలో మరో వ్యక్తి వద్ద సైతం గ్రాము 7వేలకు కొని, నగరానికి తీసుకువచ్చి 12 వేలకు విక్రయిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి కెపిహెచ్‌బిలో నివాసం ఉంటున్న స్నేహితుడు భూపతిరాజు చిరంజీవివర్మ(28)ను సైతం ఇందులో భాగం చేసి వినియోగదారులకు డ్రగ్స్‌ను సర ఫరా చేయించ సాగాడు. మరో నిందితుడు, కృష్ణంరాజుకు వరుసకు సోదరుడు హేమంత్‌రాజు(37) డ్రగ్స్ కు బానిసగా మారగా, ఇతన్ని సైతం సరఫరాలో భాగం చేసి దందా చేస్తున్నాడు. కొండాపూర్‌లోని వెంకటేశ్వర రెసిడెన్సీలో వీరు డ్రగ్స్‌తో ఉనా న్నరని సమాచారం అందుకున్న ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు సంయు క్తంగా దాడులుచేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 15మంది వినియోగదారుల వివరాలను సేకరించి, వారికి నోటీసులు జారీ చేశారు.

**డెడ్‌డ్రాప్ సరఫరా:** ఈ ముఠా డ్రగ్స్ సరఫరా కోసం డెడ్‌డ్రాప్ విధానాన్ని ఎంచుకొని తమ వివరాలు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకున్నారని పోలీసులు తెలిపారు. వైఫైతో పనిచేసే వాట్సాప్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్ తీసుకొని, బెంగళూరులోని తన స్నేహితుల అకౌంట్‌లకు పేమెంట్‌ను కృష్ణంరాజు చేయించుకుంటాడు. అనంతరం వారు కృష్ణంరాజుకు ట్రాన్స్‌ఫర్ చేస్తుంటారు. డబ్బు చెల్లించిన వారికి డెడ్‌డ్రాప్ విధానంలో సరఫరా చేస్తుంటారు. నిర్మానుష్య ప్రదేశంలో డ్రగ్స్‌ను పెట్టి, సదరు ప్రదేశం లోకేషన్, ఆనవాళ్లను వినియోగదారులకు చేరవేస్తారు. వారిని అక్కడికి వెళ్లి డ్రగ్స్ తీసు కోమని సూచిస్తారు. డెడ్‌డ్రాప్ విధానాన్ని ఉపయోగించే పోలీసులు పట్టుకున్నారు.

# నేర పరిశోధనలో పోలీసు జాగిలాల సేవలు అమోఘం

**నేడు మొయినాబాద్‌లో**
**25వ బ్యాచ్ జాగిలాల దీక్షాంత్ పెరేడ్**



శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నగర శివార్లలోని మొయినాబాద్‌లో గల పోలీసు జాగిలాల శిక్షణా సంస్థలో 25వ బ్యాచ్ జాగిలాల దీక్షాం త్ పరేడ్ మంగళవారం జరగనుంది. ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాలు ఆఖరుకు పారా మిలటరీ, త్రివిద దళాలు జాగిలాల సేవలను ఉపయోగించు కుంటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే రక్షణ, హోం శాఖల పరిధిలో గల అన్ని విభాగాల్లో నేడు జాగిలాల పాత్ర కీలకంగా వుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ పోలీసు శాఖ జాగిలాల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఉమ్మడి ఎపి హయా ంలోనే మొయినాబాద్‌లో గ్రే హౌండ్స్ విభాగంలో 2004లో దీనిని నెలకొల్పారు. ఇప్పటి వరకు సుమారు 900 వరకు జాగిలాలకు 1200 పైగా హ్యాండ్లర్లు (జాగిలాల పర్యవేక్షకులు) ఇక్కడ శిక్షణ పొంది అన్ని రాష్ట్రాలు, పారా మిలటరీ బలగాలలో సేవలందిస్తున్నారు. పోలీసులకు వుండే విధం గానే జాగిలాలకు ప్రత్యేకంగా శిక్షణ వుంటుంది. శారీరక శ్రమతో కూడిన శిక్షణతో పాటు పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను గుర్తించడంలో వీటి కి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. నెలల వయస్సు కలిగిన మేలు రకం జాగిలాలను ఇక్కడకు తీసుకువచ్చి దాదాపు ఏడాది పాటు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణలో జాగిలాలు రాటుదేలి పోలీసులకు వెన్నుదన్నుగా వుంటాయి. కొన్నిసార్లు ఉగ్రవాదులపై ఎదురుదాడి కూడా చేస్తాయి. కాశ్మీర్ లోయలో ఎన్ కౌంటర్ సమయంలో ఓ ఉగ్రవాదిపై దూకి అతన్ని మట్టుపెట్టడంతో భద్రతా బలగాలకు ఓ జాగిలం తనవంతు సహాయం చేసి ప్రాణాలను విడిచిం ది. ఈ జాగిలానికి రాష్ట్రపతి సేవ పతకం లభించింది. ఇటువంటి ఉదంతాలు అ నేకం వున్నాయి. విమానాశ్రయాలు, ఓడ రేవుల్లో మాదకద్రవ్యాల ను గుర్తించడంలో జాగిలాలదే కీలక పాత్ర. తెలంగాణ పోలీసు విభాగంలో వందకు పైగా జాగిలాలు సేవలందిస్తున్నాయి. జాగిలాల వెంట హ్యాండ్ల ర్లు వుంటారు. మంగళవారం నాటి జాగిలాల దీక్షాంత్ పరేడ్‌కు డిజిపి శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. నిఘా విభాగం అదనపు డి జి విజయ్ కుమార్ సహా ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక అధికారులు

**హైరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమలవుతోన్న జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకానికి ప్రత్యేక అధికారులు రాబోతున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని తెలంగాణలో పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి సోమవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రాజెక్టు ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు పదవులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దీనికి సంబంధించిన అర్హతలు, జీతభత్యాలు, ఇతర నియమ, నిబంధనల వివరాల కోసం వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని డాక్టర్ గోపి ఒక ప్రకటనలో తెలిపారు.

## త్వరలో అందుబాటులోకి ఆర్గానిక్ ఫార్మర్స్ యాప్

హైదరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త: తెలంగాణ రైతులకు మరో వినూత్న యాప్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్స హించేందుకు త్వరలో కొత్త యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. ఈ యాప్ ద్వారా ఆర్గానిక్ ఫార్మింగ్ చేసే రైతులకు రాయితీలు కల్పించడంతోపాటు వారి ఉత్పత్తులకు ఆదాయం పెరిగేలా చేయనున్నారు. అలాగే ఆర్గానిక్ వ్యవసాయానికి సంబంధించి రైతుల వివరాలన్నీ యాప్‌లో అందుబాటులో ఉండనున్నాయి. ఏ రైతు ఎంత పంట పడిస్తున్నాడు, ఏ పంట పండిస్తున్నాడు, ఎక్కడ సాగు చేస్తున్నాడు, ఉత్పత్తులు ఎప్పటిలోగా అందుబాటులోకి వస్తాయి తదితర వివరాలు కొత్తగా అందుబాటులోకి రానున్న ఆర్గానిక్ ఫామింగ్ యాప్‌లో ఉండనున్నాయి. రైతుల అడ్రస్, మొబైల్ నెంబర్లు, ఫొటోలు, వీడియోలు కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీంతో యాప్ సహాయంతో ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు నేరుగా రైతులను సంప్రదించవచ్చు. నకిలీ ఉత్పత్తులను అడ్డుకోవడానికి ఆర్గానిక్ ప్రొడక్ట్స్‌కు లేబులింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ విధానం ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేయవచ్చు. ఇక ఆర్గానిక్ ఉత్పత్తుల లేబుల్ కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ దగ్గర దరఖాస్తు చేసుకోవాలి.

# దేవాదాయ భూముల్లో పర్యాటకులకు వసతులు!

**హైదరాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** తెలంగాణలో పర్యాటకరంగ అభివృద్ధిపై టూరిజంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. పర్యాటకులకు అనువైన ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా రహదారులకు, ముఖ్య పట్టణాల్లో, ఆలయాలకు సమీపంలో ఉన్న దేవాదాయ శాఖ భూములను పర్యాటకులకు అనువైనవిధంగా అభివృద్ది చేస్తే ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆలయ భూములు ఇస్తే కాటేజీలు, రిసార్ట్ ల నిర్మాణం చేపడతామని దేవాదాయశాఖకు టూరిజంశాఖ ప్రతిపాదిస్తోంది. దేవాదాయశాఖ సైతం తన పరిధిలోని భూములను అభివద్ధి చేసేందుకు పర్యాటకశాఖకు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే త్వరలోనే ఈ రెండు శాఖల మధ్య ఎంఓయూ జరగనున్నట్లు తెలిసింది. తెలంగాణలో అలయాలకు 87235.39 ఎకరాలను కేటాయించినట్లు అధికారిక లెక్కలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ భూములపై కొరవడటంతో ఆ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇప్పటికే వేలాది ఎకరాల భూములు క్రమణకు గురయ్యాయి. లిటిగేషన్‌లో మరో 5569 35 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆ భూముల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరోపక్క కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంపైనా దృష్టి సారించింది. కొన్ని ఆలయాలకు చెందిన తూములను లీజులకు ఇవ్వగా కొన్ని భూములు నిరూపయోగంగా ఉన్నట్లు సమాచారం ఆ మామూలను పర్యాటక కేంద్రాలు తీర్చిదిద్దేందుకు టూరిజం శాఖ ముందుకు వచ్చింది. ఈ భూములను తమకు అప్పగిస్తే అక్కడ అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తామంటూ టూరిజంశాఖ ప్రతిపాదన చేసింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారు. భక్తులకు సరిపడా వసతి సౌకర్యాలు లేకపోవడంతో కొంత ఇబ్బందులకు గురవుతున్న సందర్భాలు అనేకం చోటుచేసు కుంటున్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని టూరిజం శాఖ గుట్టను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. కొండకింద ఆలయ భూములు ఉండటంతో ఆ భూములు లీజుకు ఇస్తే కాటేజీలు, వెల్నెస్ సెంటర్లు, బడ్జెట్ హోటళ్ల నిర్మించేలా ప్లాన్ రూపొందించింది. ఆధ్యాత్మిక పర్యాటకంతో పాటు వీకెండ్ స్పాట్గా దీన్ని తీర్చిదిద్దాలని భావిస్తున్నది. ఇది విజయవంతం అయితే రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలు అయిన వేములవాడ, భద్రాచలం, బాసర, ఇతర ప్రముఖ ఆలయాల భూముల్లోనూ ఇదే తరహా అభివృద్ధిని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# నేడు భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు రాక



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ మంగళవారం భారత్ పర్యటనకొస్తున్నారు. 19 వరకు అంటే మూడు రోజులు మెక్రాన్ భారత్‌లో పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.15గంటలకు ముంబైలోని లోక్ భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా మెక్రాన్–మోడీ ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. చర్చలలో భారత్– ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంపైనే ప్రధానంగా దృష్టి సారించనున్నారు. వ్యూహాత్మక సంబంధాన్ని మరింత బలోపేతం చేయడం, అభివృద్ధి చెందుతున్న, భవిష్యత్తు ఆధారిత రంగాలలో పరస్పర సహకారాన్ని విస్తరించడంపై దృష్టి సారిస్తాయని భావిస్తున్నారు. ఇరు దేశాల నాయకులు ముఖ్యమైన ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై దృక్పథాలను కూడా మార్పిడి చేసుకుంటారని భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5.15 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ సంయుక్త ప్రకటన చేయనున్నారు.

అనంతరం ఇరు దేశాల నుండి వ్యాపార, పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఢిల్లీలో జరుగుతున్న ఎఐ సమ్మిట్‌కు మోడీతో కలిసి మెక్రాన్ హాజరవుతారు.

ఈ సమ్మిట్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, గ్రీకు ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ ఉన్నారు.

**ఎఐ సమ్మిట్‌కు 45 దేశాల ప్రతినిధులు**

భారత్ ఆతిథ్యమిస్తున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనడానికి ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు పలు దేశాల అధినేతలు, ప్రతినిధులు వస్తున్నారు. కృత్రిమ మేధస్సు రంగంలో అంతర్జాతీయ సహకారం కోసం భారత్ రోడ్ మ్యాప్ (మూడు 'సూత్రాలు: ప్రజలు, గ్రహం, పురోగతి')ను ఆవిష్కరించనుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రపంచ నాయకులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, నిపుణులను ఒకచోట చేర్చి కృత్రిమ మేధస్సు భవిష్యత్తు దిశపై చర్చించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు, ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనే ఇతర ప్రముఖ నాయకులలో నెదర్లాండ్స్ ప్రధాన మంత్రి డిక్ స్కూఫ్, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయక, భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాన మంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూడం ఉన్నారు. ప్రముఖుల జాబితాలో స్పానిష్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ పెరెజ్‌కాస్టెజోన్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, క్రొయేషియా ప్రధాన మంత్రి ఆండ్రేజ్ ప్లెన్కోవిక్, ఎస్టోనియన్ అధ్యక్షుడు అలార్ కరిస్, ఫిన్నిష్ ప్రధాన మంత్రి పెట్టేరి ఓర్పో, కజకిస్తాన్ ప్రధాన మంత్రి ఓల్జాస్ బెక్టెనోవ్, లీచ్టెన్‌స్టెయిన్ వంశపారంపర్య యువరాజు అలోయిస్, స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పర్మెలిన్ కూడా ఉన్నారు. బొలీవియా ఉపాధ్యక్షుడు ఎడ్మండ్ లారా మోంటానో, గయానా ఉపాధ్యక్షుడు భరత్ జగ్దియో, సెర్బియా ఉపాధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిల్లే కూడా న్యూఢిల్లీ ఎఐ సమ్మిట్‌కు హాజరవుతారని విదేశాంగ శాఖ పేర్కొంది. ఎంఇఎ ప్రకారం, 45 కంటే ఎక్కువ దేశాల నుండి మంత్రివర్గ ప్రతినిధులు కూడా ఈ సమ్మిట్‌లో పాల్గొంటారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి, అనేక అంతర్జాతీయ సంస్థల నుండి సీనియర్ ప్రతినిధులు చర్చలలో పాల్గొననున్నారు.

- ముంబైలో ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు
- రఫేల్ డీల్‌తోపాటు పలు కీలక ఒప్పందాలు
- ఎఐ సమ్మిట్‌కు మెక్రాన్ హాజరు

# బీహార్ మహిళలకు మరో10 వేలు సాయం

## శివరాత్రి కానుక అందించిన సీఎం నితీష్‌కుమార్



**పాట్నా, ఫిబ్రవరి 16:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీజేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు. ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజనా కింద మొత్తం 2500 కోట్ల రూపాయలను నేరుగా మహిళల ఖాతాల్లోకి జమచేసారు. అంతేకాకుండా లబ్ధిదారులతో నితీష్ నేరుగా ముఖాముఖి జరిపారు. విడియోకాన్ఫరెన్సింగ్ ద్వారా జరిగిన ఈకార్యక్రమంలో స్వయం ఉపాధజపై ఆసక్తి ఉన్న మహిళలు చిన్న చిన్న వ్యాపారాలుచేసుకోవచ్చని తెలిపారు. సుమారు కోటి మంది లబ్ధిదారులు పదివేల రూపాయలు అందుకున్నారని, వారంతా చిన్నవ్యాపారాలుచేసుకోవచ్చన్నారు. విజయవంతం అయిన మహిళలు మళ్లీ అదనపు సాయం అందుకోవచ్చని అలాంటివారికి రూ.2 లక్షలరూపాయలవరకూ అందుతుందన్నారు. బీహార్‌లోని అతిపెద్ద ఎస్‌హెచ్‌జి కార్యాచరణ జీవిక ఇపుడు 40 లక్షలమంది సభ్యులతో గ్రామీణప్రాంతాల్లో వర్ధిల్లుతోందన్నారు. అదే విజయం పట్టణప్రాంతాల్లోకూడా సాధించిందని 3.85 వేల జీవికా దీదీలు ఎస్‌హెచ్‌జి సభ్యులున్నారని నితీష్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం జీవిక స్కీంను మరింత పటిష్ఠంచేసి మరింత విస్తృతంచేస్తుందన్నారు. గతనెల 26వ తేదీప్రధానిమోడీ ఈస్కీంను ప్రారంభించారు. ఆరోజునే పదివేల రూపాయలు ప్రతి ఒక్కరికి 75 లక్షలమంది మహిళలకు బదలీచేసారు. రాష్ట్రంలోని పదిలక్షలమందికిపైగా లబ్ధిదారులు ఈ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్‌యోజనకు దరఖాస్తుచేసారు.



## అజిత్‌పవార్ విమాన ప్రమాదం కేసు బ్లాక్‌బాక్స్ డీకోడింగ్ షురూ!

**బారామతి, ఫిబ్రవరి 16:** దివంగత డిప్యూటీసీఎం అజిత్‌పవార్‌ప్రయాణించిన విమానం బ్లాక్‌బాక్స్‌ను దర్యాప్తు సంస్థ ఎఎఐబి అధికారులు స్వాధీనంచేసుకున్నారు. బ్లాక్ బాక్స్ ఇప్పటికే ఢిల్లీచేసింది. ఎఎఐబి ప్రయోగశాలలో డీకోడ్‌చేసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. బ్లాక్‌బాక్స్‌లో విమానం కీలక సంకేతాలు, కాక్‌పిట్ చర్చలు అన్నీ కొనసాగుతాయని దర్యాప్తులో తేల్చారు. విమానప్రమాదాల్లో కూడా దర్యాప్తు కొలిక్కిరావాలంటే బ్లాక్‌బాక్స్ కీలకంగా మారుతుంది. మహారాష్ట్ర డిప్యూటి సీఎంగా ఉన్న అజిత్‌పవార్‌సహా ఐదుగురు ఈప్రమాదంలో చనిపోయిన సంగతి తెలిసిందే. ఇద్దరు కాక్‌పిట్‌క్రూసభ్యులు కూడా ఉన్నారు. పైలట్ ఇన్ కమాండ్ సుమిత్‌కపూర్, ఫస్ట్ ఆఫీసర్ శాంభవి పాథక్‌లు క్యాబిన్‌క్రూ పింకీ మాలిలు కూడా ఈ ప్రమాదంలో చనిపోయారు. ఈప్రమాదంపై ఎఎఐబి దర్యాప్తు అధికారులు, ఢిల్లీనుంచి డిజిసిఎనుంచి మరో ముగ్గురు అధికారులు ప్రమాదస్థలానికి వెళ్లి ప్రాథమిక వివరాలుసేకరించారు. ఈ విమానం విటిఎస్‌ఎస్‌కె పేరిట రిజిస్టరు కావడం ఢిల్లీ కేంద్రంగా ఉన్న ఆపరేటర్ విఎస్‌ఆర్ వెంచర్స్ కంపెనీ నిర్వహిస్తున్న సంగతితెలిసిందే.

ఈప్రమాదంతోనే పౌరవిమానయానశాఖ అప్రమత్తం అయి నియంత్రణకు వీలుకాని విమానాశ్రయాలు, ఎయిర్‌స్ట్రిప్‌లను తనిఖీలుచేపట్టాలనినిర్ణయించింది. అయితే ఈ ప్లాన్ మొత్తం ఇపుడు ప్రాథమిక దశలోనే ఉంది. విమానశిక్షణ సంస్థలు మాత్రమే ఈ ఎయిర్‌ఫీల్డ్‌లను ఉపయోగిస్తున్నాయి. విఐపిలకు వినియోగించే విమానాలకు కూడా వాడుకుంటుంటారు.

## డార్ఫర్‌లో సాయుధ మిలిటెంట్ల మారణకాండ

**ఖర్టూమ్, ఫిబ్రవరి 16:** సూడాన్‌లో పారామిలిటరీ దళాలు సృష్టించిన మారణకాండపై ఐక్యరాజ్యసమితి సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ చివరిలో దార్ఫర్ ప్రాంతంలో కేవలం మూడు రోజుల్లోనే రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) దళాలు 6 వేల మందికి పైగా పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చినట్లు తెలిపింది. ఈ హింస దిగ్భ్రాంతికరంగా ఉందని, ఇవి యుద్ధ నేరాలు, మానవత్వంపై ఘోరాలతో సమానమని సమితి మానవ హక్కుల కార్యాలయం తన నివేదికలో స్పష్టం చేసింది. నార్త్ దార్ఫర్‌లోని ఎల్‌ఫాషెర్ నగరాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో ఆర్ఎస్ఎఫ్, దాని

మిత్రపక్ష అరబ్ మిలీషియాలు ఈ ఘాతుకాలకు పాల్పడ్డాయని శుక్రవారం విడుదల చేసిన 29 పేజీల నివేదికలో వివరించింది. సామూహిక హత్యలు, లైంగిక దాడులు, చిత్రహింసలు వంటి అనేక అకృత్యాలకు పాల్పడ్డారని పేర్కొంది.

## బంగ్లా కొత్త ప్రభుత్వంలో యూనస్ కీలక బాధ్యతలు?




**ఢాకా, ఫిబ్రవరి 16:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బిఎన్‌పి ఛైర్మన్ తారిఖ్ రెహమాన్.. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. తన కేబినెట్ కూర్పుపై ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో ఇప్పటివరకు బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక సారథిగా వ్యవహరించిన మహ్మద్ యూనస్ తదుపరి పయనం ఎటువైపు అనే విషయం ఆసక్తిగా మారింది. క్లిష్ట సమయంలో దేశాన్ని ముందుండి నడిపించిన ఆయన, నూతన ప్రభుత్వంలో భాగస్వామి అవుతారా? ప్రత్యేక బాధ్యతలు అందుకుంటారా? అన్న విషయంపైనా చర్చ జరుగుతోంది,

ఉద్రిక్తతల వేళ మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్ వీడిన తర్వాత.. 2024 ఆగస్టులో తాత్కాలిక ప్రభుత్వానికి సారథిగా (ముఖ్య సలహాదారు) మహ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. దేశం అత్యంత అస్థిర పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో ఓ ప్రభుత్వ సంరక్షకుడిగా కొనసాగిర ఆయన.. 18 నెలలపాటు తన విధులను నిర్వర్తించారు. ఎన్నికల నిర్వహణలోనూ కీలకంగా వ్యవహరించారు. ఇవే కాకుండా రాజకీయ వ్యవస్థలో సంస్కరణకు శ్రీకారం చుట్టారు. ఒకే వ్యక్తికి ప్రధాని పదవిని రెండుసార్లకు పరిమితం చేయడం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళల ప్రాతినిధ్యం పెరుగుదుల, ఎన్నికల సమయాల్లో తటస్థంగా వ్యవహరించే తాత్కాలిక ప్రభుత్వాల ఏర్పాటు సిఫార్సులను పొందుపరిచారు. ఈ రెఫరెండానికి సంబంధించి తాజా ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు మద్దతు పలికారు. బంగ్లాదేశ్‌లో బిఎన్‌పి చీఫ్ రెహమాన్ నేతృత్వంలో ఏర్పడే కొత్త ప్రభుత్వంలో యూనస్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా యూనస్‌కు ఉన్న బలమైన సంబంధాల కారణంగా అధ్యక్షుడిగా ఎంచుకునే అవకాశం ఉందని స్థానిక రాజకీయాలను విశ్లేషించే డేవిడ్ బెర్గ్‌మన్ అనే కాలమిస్ట్ అంచనా వేశారు. ప్రపంచ స్థాయిలో ఆయనకున్న గుర్తింపు మరో బంగ్లాదేశీ నేతకు లేదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే బిఎన్‌పి, మహ్మద్ యూనస్ మధ్య చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చినప్పటికీ.. యూనస్ ప్రనితిధి మాత్రం వాటిని తోసిపుచ్చారు. ఆయనకు రాజకీయాలపై అంతగా ఆసక్తి లేదన్నారు.

సంక్షోభ పరిస్థితుల్లో తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడిగా కొనసాగిన యూనస్ సేవలను తారిక్ రెహమాన్ ఉపయోగించుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నూతన ప్రభుత్వానికి రాజకీయ లేదా ఆర్థిక సలహాదారుగా నియమించుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. భవిష్యత్తుపై ప్రస్తుతానికి యూనస్ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయనప్పటికీ.. బిఎన్‌పి చేసే ప్రతిపాదనను అంగీకరించే అవకాశాలే ఎక్కువని తెలుస్తోంది.

## శుభలగ్నం సీన్ రిపీట్!

### ప్రియురాలికి రూ.1.5 కోట్లకు భర్తను అమ్మేసిన భార్య



**భోపాల్, ఫిబ్రవరి 16:** ప్రముఖ టాలివుడ్ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో వచ్చిన శుభలగ్నం చిత్రంలో భార్య తన భర్తను కోటి రూపాయలకు ప్రియురాలికి అమ్మేస్తుంది. అచ్చం అలాంటి ఘటనే ఇప్పుడు భోపాల్‌లో చోటుచేసుకుంది. ఇందులో కూడా ఇద్దరు పిల్లల తల్లి తన భర్తను రూ.1.5 కోట్లకు మరో మహిళకు అప్పగించేసి పిల్లలతో హాయిగా వేరే చోటకు వెళ్లిపోయింది. ఈ ఒప్పందం న్యాయస్థానం సాక్షిగా జరగడం విశేషం. వివరాల్లోకి వెళితే భోపాల్‌లో 42 ఏండ్ల వ్యక్తికి 23 ఏండ్ల క్రితం పెండ్లయింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే తన తండ్రి తన కార్యాలయంలో 54 ఏండ్ల మహిళతో సంబంధం పెట్టుకుని తమను నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ 16 ఏండ్ల వారి పెద్ద కుమార్తె ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేసింది. కోర్టు భార్యాభర్తలు, అతని ప్రియురాలిని కౌన్సెలింగ్‌కు పిలిచింది. అయితే తాను ప్రియురాలితోనే ఉంటానని భర్త స్పష్టం చేశాడు. దీంతో తన భర్తను ప్రియురాలికి వదిలిపెట్టడానికి రూ.1.5 కోట్లు ఇవ్వాలని భార్య డిమాండ్ చేసింది. దీనికి ప్రియురాలు సై అనడంతో 23 ఏండ్ల వారి వివాహ బంధానికి తెరపడింది. ఆ భార్యకు ఒక డూప్లెక్స్ ఇంటితో పాటు 27 లక్షల నగదును ప్రియురాలు చెల్లించడంతో ఆమె తన ఇద్దరు పిల్లలతో అందులోకి మారిపోయేందుకు సిద్ధపడుతున్నది.

## సంక్షిప్తంగా..

### కర్ణాటకలో రూ.400 కోట్ల దారి దోపిడీ!



**బెంగళూరు, ఫిబ్రవరి 16:** ట్రక్కు నుంచి రూ.400 కోట్లమేర నగదు దారి దోపిడీ జరిగిందంటూ ఓ వాహన డ్రైవర్ మహారాష్ట్రలో చేసిన ఫిర్యాదు ఇటీవల కలకలం రేపింది. పొరుగునే ఉన్న కర్ణాటకలో ఇది రాజకీయ దుమారానికి కారణమైంది. నగదు తరలిస్తున్న ట్రక్కులో దోపిడీ జరిగిందంటూ డ్రైవర్ సందీప్ పాటిల్ గతేడాది డిసెంబర్ 17న నాసిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతేడాది అక్టోబర్ 22న కర్ణాటక బెల్గాం జిల్లాలోని చోర్లా ఘాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని చెప్పాడు. ఏడుగురు వ్యక్తులు అడ్డగించి, కిడ్నాప్‌చేసి, దాడి చేశారని ఆరోపించాడు. ఆపై రూ.400 కోట్ల విలువైన రెండువేల నోట్లతో పరారైనట్లు తెలిపాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలం కర్ణాటకలో ఉండటంతో అక్కడి పోలీసులు అప్రమత్తమయ్యారు.

### శబరిమలలో మహిళల ఆలయ ప్రవేశంపై సమీక్షకు సుప్రీం ఓకే



**తిరువనంతపురం, ఫిబ్రవరి 16:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మత పరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14 లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7నుంచి 22 వరకు రెండువారాల సమయం కేటాయిస్తున్నట్లు తెలిపింది.

### ఇంటిపై బాంబుల తయారీ: పేలుడులో ఇద్దరు మృతి




**భువనేశ్వర్, ఫిబ్రవరి 16:** సొంతిల్లే కదా అని తమ ఇంటిపైన వాటర్ ట్యాంకుల పక్కన బాంబులు తయారు చేస్తుంగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన ఈ సంఘటన సీసీటీవీలో రికార్డైన ఈ పేలుడు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జనవరి 27న మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో సుందర్‌పాడా ప్రాంతంలోని ఒక ఇంటిపై అక్రమంగా బాంబులు తయారు చేసేందుకు నలుగురు వ్యక్తులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా భారీ పేలుడు సంభవించింది. మంటలు అంటుకోవడంతో ఒక మహిళ, మరికొందరు పరుగులు తీశారు. ఆ నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

### ఏప్రిల్ 22న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** శీతాకాలంలో దాదాపు ఆరు నెలలుగా మూసివేసిన ప్రఖ్యాత కేదార్‌నాథ్ ఆలయం ద్వారాలు ఏప్రిల్ 22న తెరుచుకోనున్నాయి. మహాశివరాత్రి పురస్కరించుకొని మందిరాన్ని తిరిగి తెరిచేందుకు శుభ తేదీ, సమయాన్ని నిర్ణయించినట్టు ఆలయ ప్రజా సంబంధాల అధికారి హరీశ్ గౌర్ ఆదివారం వెల్లడించారు. దీంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర షెడ్యూల్ ఖరారైంది. బద్రీనాథ్ ధామ్ ద్వారాలు ఏప్రిల్ 23న, గంగోత్రి, యమునోత్రి ధామ్ ఏప్రిల్ 19న తెరుచుకుంటున్నాయి. ఉత్తరాఖండ్‌లోని గర్వాలీ హిమాలయ పర్వతాల్లో కొలువైన ఓంకారేశ్వర్ ఆలయం తలుపులు ఏప్రిల్ 22న తెరుచుకుంటాయని, ముందు పండితులు, పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.

### 24న జయలలిత నెచ్చెలి శశికళ కొత్తపార్టీ



**చెన్నై, ఫిబ్రవరి 16:** తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నేత వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తన ఆప్త మిత్రురాలి జయంతి రోజైన ఈనెల 24న పార్టీ పేరు, జెండా, విధివిధానాలను ప్రకటించే అవకాశం ఉంది. ఆమె తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా శశికళ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. చెన్నైలోని తన నివాసంలో జిల్లా స్థాయి నేతలు, అనుచరులతో వరుసగా సమావేశమవుతున్నారు. 18వ తేదీ వరకు ఈ చర్చలు కొనసాగనున్నాయి.

## 85శాతం పడిపోయిన ఇమ్రాన్‌ఖాన్ కంటిచూపు!

### జైలు అధికారులే బాధ్యులంటున్న కుటుంబసభ్యులు




**రావల్పిండి, ఫిబ్రవరి 16:** దేశ మాజీమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్యపరిస్థితి మరింత విషమించిందని ఆయన కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తంచేసారు. 73 ఏళ్ల ఇమ్రాన్ గడచిన రెండేళ్లుగా జైలులోనే ఉంటున్నారు. ఆయన కంటిచూపును 85శాతం కోల్పోయినట్లు వారు చెపుతున్నారు. ఆయన కుటికన్ను పూర్తిగా పనిచేయడంలేదని, గత జనవరిలోనే కుడ కంటిలో ఉన్న రక్తపుచారను తొలగించేం దుకు శస్త్రచికిత్స జరిగిందని ఇమ్రాన్ తరపు న్యాయ వాది వెల్లడించారు. దీనితో పాక్ సుప్రీంకోర్టు ఖాన్‌కు వైద్యం సమీక్షించి నివేదిక అందచే యాలని, ఒక డాక్టర్ల ప్యానెల్‌తో ఆయన వైద్య అధ్యయనంజరగాలని, అంతేకాకుండా ఆయన కుమారులతో టెలిఫోన్ కాల్స్‌కు అనుమతించాలని ఆదేశించింది. ఒక ప్రత్యేక కంటి ఆసుపత్రి ఖాన్‌ను రావల్పిండిలో కలిసి పరీక్షలుచేయాలనినిర్ణయించింది. అయితే జైలు ఆవరణలోనే ఆయన వ్యక్తిగత వైద్యులు కుటుంబసభ్యుల సమక్షంలోనే పరీక్షలుచేయాలని జైలు అధికారులు నిర్ణయించారు. ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పిటిఐ ఈ అంతర్‌పరీక్షల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఖాన్ సోదరీమణులు నోరీన్ ఖానుమ్, ఆలీమా ఖానుమ్‌లు సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన వైద్యుల అసెస్‌మెంట్ వద్దని ఈ విధానం ఎంతమాత్రం తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఇమ్రాన్ కుటుంబసభ్యులు లేకుండా ఆయనకు ఎలాంటి వైద్యపరీక్షలు నిర్వహించకూడదని నోరీన్ ఖానుమ్‌వెల్లడించారు. ప్రభుత్వం ఎందుకుస్పెషలిస్టులను ఎంపిక చేసేందుకు నిరాకరిస్తున్నదో తెలియడంలేదని, ఇమ్రాన్‌ఖాన్ వ్యక్తిగత వైద్యులు సూచించిన స్పెషలిస్టులను నియమించడంలో వారికున్న అభ్యంతరాలేమిటని ప్రశ్నించారు. ఇమ్రాన్ సోదరీమణులుమాత్రం ఖాన్‌కు వైద్యచికిత్స సకాలంలో అందించేందుకు జైలు అధికారులే పట్టించుకోవడంలేదని, వారంతా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. 2022లో జరిగిన కాల్పుల్లో ప్రాణాపాయంనుంచి తప్పించుకున్నారు.

## రోహిత్‌శెట్టి ఇంటిముందు కాల్పులు జరిపిన షూటర్ అరెస్టు

### మొత్తం ఏడుగురిని అరెస్టుచేసిన ముంబయి క్రైమ్‌బ్రాంచ్‌పోలీసులు

**ముంబయి, ఫిబ్రవరి 16:** ముంబయి క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు రోహిత్‌శెట్టిపై కాల్పులుజరిపిన నిందితుడిని అరెస్టుచేసారు. రోహిత్ ఇంటిబయట నిందితుడు కాల్పులు జరపడంతోముంబయి పోలీసులకు అందిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలను కూడా ఏఆర్పటుచేసారు. కాగా కాల్పులు జరిపిన షార్ప్‌షూటర్‌ను రాజస్థాన్‌నుంచి అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం ఆరుగురిని ఈ కేసులో అరెస్టుచేసినట్లు ముంబయి క్రైమ్ బ్రాంచ్‌పోలీసులు తెలిపారు. మరికొందరిని ఉత్తర ప్రదేశ్‌నుంచి కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై ఎంకోకా 1999 చట్టంప్రకారం కేసులునమోదుచేసి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఐదుగురు నిందితుల పోలీసు కస్టడీ ముగిసిందని, వీరిపై ఎంకోకా చట్టాన్ని ప్రయోగించినట్లు తెలిపారు. మంగళవారం వరకూ వీరుకట్టడీలోనే ఉంటారు. తిరిగి ముంబయి క్రైమ్‌బ్రాంచ్ 15 రోజుల కస్టడీని కోరారు. అయితే కోర్టు 17వ తేదీవరకూ మాత్రమే అనుమతినిచ్చింది. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది. నిర్మాత రోహిత్‌శెట్టి జుహు నివాసంలో ఈనెలలో ఐదురౌండ్ల కాల్పులు దుండగులు జరిపారు.

## శిక్ష పూర్తయిదంటూ పిటిషన్.. అబూసలేంకు సుప్రీంకోర్టులో చుక్కెదురు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** ముంబైలో 1993 నాటి పేలుళ్ల కేసులో దోషిగా తేలిన గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తనకు విధించిన 25 యేళ్ల శిక్షాకాలం ఇప్పటికే పూర్తయిందని, 10 నెలలుగా అక్రమంగా కస్టడీలో ఉంచారని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. కేసు పూర్వాపరాలు,సత్‌ప్రవర్తనకు సంబంధించిన రెమిషన్‌ను కలుపుకొని తాను ఇప్పటికే 25 యేళ్ల జైలు శిక్ష అనుభవించానని, విడుదల చేయాలని కోరుతూ అబూ సలేం గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, అతడికి మధ్యంతర ఉపశమనం ఇచ్చేందుకు హైకోర్టు గతేడాది జూలైలో నిరాకరించింది. 25 యేళ్ల ఇంకా పూర్తి కాలేదని ప్రాథమికంగా తేలినట్లు పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ అతడు 'సుప్రీం' తలుపు తట్టాడు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం అతడి పిటిషన్‌ను విచారించింది. ఈ వ్యవహారంపై హైకోర్టుకే వెళ్లాలని సూచించింది. సమాజానికి హాని చేసినందుకే 25 యేళ్ల శిక్ష పడిందని, టాడా (ఉగ్రవాద నిరోధక చట్టం) కింద దోషిగా తేలినట్లు గుర్తు చేసింది. 1993 ముంబయి పేలుళ్ల తర్వాత అబూ సలేం పోర్చుగల్‌క పారిపోయాడు. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2005 నవంబరులో కేంద్రం అతడిని భారత్‌కు రప్పించింది. అప్పగింత వ్యవహారంలో పోర్చుగల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. భారత్ అతడికి మరణశిక్ష విధించకూడదు. జైలుశిక్ష కూడా 25 యేళ్ల మించకూడదు. పోర్చుగల్‌కు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని.. 2022లో అబూసలేం దాఖలు చేసిన వేరే పిటిషన్‌పై తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు తెలిపింది.



ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో.. మధుమేహం ముందు వరుసలో ఉన్నది. వయసు, లింగభేదం లేకుండా ఈ వ్యాధి అందర్నీ ఇబ్బంది పెడుతున్నది. అయితే.. గర్భిణుల్లో షుగర్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తున్నదని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మధు మేహంతో జాగ్రత్త..

జెస్టేషనల్ డయాబెటిస్.. తల్లితోపాటు బిడ్డకూ హాని కలిగిస్తుందని హెచ్చరి స్తున్నారు. తగు జాగ్రత్తలు తీసు కుంటే.. ఆరోగ్యవంతమైన, పండంటి బిడ్డలకు జన్మనివ్వొచ్చని చెబుతున్నారు. సాధారణ మహిళలతో పోలిస్తే.. గర్భిణుల్లో ఇన్సులిన్‌కు ప్రతికూల హార్మోన్లు (కార్టిసోల్), మాయకు సంబంధించిన హార్మోన్లు ఎక్కువగా విడుదల అవుతా యట. ఫలితంగా ఇన్సులిన్ సామర్థ్యం తగ్గి.. రక్తంలో గ్లూకోజ్ స్థాయులు పెరుగుతాయట. దీనిని నిరక్ష్యం చేస్తే.. తల్లికి ఇబ్బంది కలగడంతోపాటు పిండం ఎదుగుదల మీదా ప్రభా వం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. డయాబెటిస్ ముదిరితే.. పిండం అవయవాల తయారీ మందగిస్తుందనీ, పుట్టిన తర్వాత గుండె, ఊపిరి తిత్తుల జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుందనీ చెబుతున్నారు. దీనినుంచి బయట పడాలంటే.. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని, ఆహారం విషయంలో నియ మాలు పాటించాలని సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు రక్తంలో గ్లూకోజ్ మోతాదును పరీక్షించుకుంటూ.. వైద్యుల సలహామేరకు మందులు వాడాలని అంటున్నారు. □

## అక్షరం దూరాన్ని తగ్గిస్తుంది



మైళ్ల దూరంలోని మనసు లను కలిపే శక్తి గతంలో అక్షరానికి ఉండేది. ఇప్పుడేమో హాలో అంటూ... అవతలివ్యక్తి చిరునవ్వు ఫోన్ స్క్రీన్పై కనిపిస్తోంది. అలాగని ఇది దూరాన్ని దగ్గర నేనే కాలం అనుకుంటే పొరపాటే ఎందుకంటే ఒకే ఇంట్లో దంపతులు ఉంటూ కూడా, సమయా భావంతో మైళ్లదూరంలో ఉన్న వ్యక్తుల్లా మెలగుతున్నారు. ఈ దూరాన్ని తగ్గించుకోవడానికి తిరిగి అక్షరాన్ని ఆశ్రయిస్తే ఎలా ఉంటుందో ప్రయత్నిద్దామా!

**ప్రమాదమే..** ఉదయం నిద్ర లేవడం నుంచి భార్యాభర్తలు ఎవరి పనులు వాళ్ల చేసి పరుగులు పెట్టడంతో రోజు మొదలై, ఏ అర్ధరాత్రికో ఇంటికి చేరుకోవడంతో పూర్తవుతోంది. లేదా దంపతుల్లో ఒకరు వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తే, మరొకరు ఆఫీసుకు బయలుదేరుతున్నారు. ఒకే ఇంట్లోనే ఉంటూ పరిచయస్థుల్లా మారుతున్నారు. హాలో, గుడ్మార్నింగ్ అనే పలకరింపులు, ఫోన్లో పొడిపొడి మెసేజ్ పరిస్థితి వచ్చింది. జీవనశైలి ఇలాగే కొనసాగితే మాత్రం తీవ్ర ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటివి దరిచేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాకాకుండా ఉండాలంటే భాగస్వామికి రోజూ ఓ ప్రేమలేఖలాంటి పలకరింపు అందించాలని సూచిస్తున్నారు.

**సేదదీరాలి...** ప్రేమించుకున్నప్పుడు లేదా పెళ్లైన కొత్తలో తమ మనసులోని ప్రేమకు అక్షరరూపాన్ని ఎలా ఇచ్చారో. ఆ తర్వాత కూడా ఆ ప్రేమలేఖ సంప్రదాయాన్ని కొనసాగించాలి. దీనికోసం వారానికోరోజు ఉత్తరాలకే అనుకోవాలి. ఇరువురికీ మనసులో దాగున్న తీయని జ్ఞాపకాలకు అందంగా అక్షరరూపమివ్వాలి. అప్పట్లో చేసుకున్న వాగ్దానాలు, జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యాలు, కలిసి తిరిగిన ప్రాంతాలు... వంటివన్నీ తిరిగి జ్ఞాపకం తెచ్చుకోవాలి. ఎదుటివారికి ఇష్టమైనవన్నీ గుర్తుకొచ్చేలా ఆ లేఖ ఉండాలి. ఒకరికొకరు చదివి వినిపించుకునే ఈ ఉత్తరాలు ఇద్దరినీ గతంలోకి తీసుకెళతాయి. ఆ ప్రేమను గుర్తుచేస్తాయి. జీవితమనే ప్రవాహంలో కొట్టుకుపోతున్న భాగస్వామికి మీ లేఖ కాసేపు సేదతీరడానికి సాయపడేలా పని చేస్తుంది. దైనందిన జీవితంలో తిరిగి నూతనోత్సాహాన్ని నింపుతుంది. □

## ధైర్య సాహసాలకు గ్యాలెంటరీ అవార్డు ..



ఆమె కలలు వేరు. ఎంపిక కెరియరూ వేరే! అలాంటామెకు ప్రజలకు సేవ చేయాలనే కోరిక కలిగింది. అందుకు తనకు కనిపించిన మార్గం సివిల్స్. అలా కాకుండా దారి మార్చుకుని... పోలీసులు అనుకోకుండా తనుశ్రీ తన ధైర్య సాహసాలతో తాజాగా గ్యాలెంటరీ అవార్డును అందుకున్నారు.

తనుశ్రీ పుట్టి పెరిగిందంతా బిహార్, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్ పూర్తిచేశారు. చిన్నప్పట్నుంచీ మంచి విద్యార్థినే. అయితే ఎప్పుడూ పుస్తకం పట్టుకునే ఉండటం ఆమె నైజం కాదు. సృజనాత్మకతకీ చోటిచ్చి ఎన్నో ప్రయోగాలు చేసేవారు. అలా తన అభిరుచికి ప్రాణం పోసేలా డిజైనింగ్ రంగం కనిపించింది. దీనితో నిఫ్ట్ గాంధీనగర్ నుంచి టెక్స్‌టైల్ డిజైనింగ్‌లో కోర్సుని పూర్తిచేశారు. తన పని ఇతరులకూ సాయ పడాలనేది తనుశ్రీ తత్వం. అందుకే నేత కార్మికులతో కలిసి పనిచేశారామె. ఝార్ఖండ్లోని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులోనూ భాగమయ్యారు. అలా నాలుగైదేళ్లు పనిచేశారు. అప్పుడే పేదల కష్టాలు అర్థమయ్యామెకు సమాజానికి సేవ చేస్తే ఏదైనా చేయాలనే ఆలోచన కలిగింది. ఏం చేద్దామా అని ఆలోచిస్తున్న తనకు తండ్రి కనిపించారు. ఆయన పోలీస్ ఆఫీసర్. అలా సివిల్స్ వైపు వెళ్లారు. యూపీఎస్సీ ప్రయాణం అంత సులువు కాదని అర్థమవ్వడానికి తనుశ్రీకి ఎంతోకాలం పట్టలేదు. వరుస వైఫల్యాలు. ఎంత కష్టపడినా అదే ఫలితం. ఈక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నీ సాధించారు. అక్కడ శిక్షణ తీసుకుంటూనే సివిల్స్‌కి సిద్ధమయ్యారు... చివరకు 2017లో ఐపీఎస్ సాధించారు. శిక్షణ అనంతరం కశ్మీర్‌లో పోస్టింగ్ అందుకున్నారు. స్టేట్ ఇన్వెస్టిగేషన్ పరిధి పనిచేసిన ఈమె తరవాత పుల్వామాకి సీనియర్ సూపరింటెండెంట్గా బదిలీ అయ్యారు. పుల్వామా... మిలిటెంట్ల హాట్‌స్పాట్‌గా చెబుతారు. అలాంటి చోట తన ప్రణాళికలు, వ్యూహాలతో ఉగ్రవాద దాడులను అడ్డుకున్నారు. ఇద్దరు ప్రమాదకర ఉగ్రవాదులను మట్టుపెట్టారు. ఈక్రమంలో ఎదురైన బెదిరింపులూ చాలానే. అయినా విధుల విషయంలో వెనుదిరగలేదు. ఇల్లాలిగా, తల్లిగానే కాదు... విధి నిర్వహణ బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తిస్తున్నారీమె. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యువతలో అవగాహన కల్పిస్తున్నారు. ఆ ధైర్యానికీ, ఆమె నాయకత్వానికీ, వృత్తిపట్ల నిబద్ధతకీ గుర్తింపుగా ప్రతిష్టాత్మక గ్యాలెంటరీ అవార్డుకి ఎంపీయ్యారు ఎస్ఎస్పీ తనుశ్రీ మహిళలు చేయలేరు అంటే అతి ప్రమాదకరమైన చోట సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ పోలీస్‌కి సెల్యూట్ చెప్పాల్సిందే . □

## ధ్యాన మార్గమే ఉత్తమం !

మనిషి దైనందిక జీవితంలో అనేక సమస్యలకు, ఒడిదుడుకులకు, గురౌతుంటారు. అటువంటి వారికి ధ్యానం పరమ ఔషదం లాంటిది. మనిషి మనిషికీ అనేక బాధలు ఉంటాయి. అటువంటి వాటికి ఆధ్యాత్మిక పరంగా పరిష్కారం వుంది. వాటిని ధ్యాన మార్గం ద్వారా దూరం చేయవచ్చును. ధ్యానం ఒక సందేశం కావాలి ధ్యానం మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. మనసుకు ఆహ్లాదం చేకూరుస్తుంది. వివిధ రోగాల నుండి విముక్తి కల్పిస్తుంది. పూర్వం ధ్యానం ద్వారా మునులు దివ్య లోకాలను సందర్శన చేసేవారు. యోగము సిద్ధించే గొప్ప శక్తి వంతమైనది ధ్యానం. శ్వాస పై ధ్యాస పెట్టడమే ధ్యానం యొక్క ముఖ్య విధి. అందుకే ధ్యానం ఒక పరమార్థం. దివ్య మైన యోగ మార్గం ఈ ధ్యానం. అదే దివ్య జ్ఞానం కాగలదు. పూర్వం మునులు, యోగులు, ధ్యానం ద్వారా మోక్ష ప్రాప్తి పొందడం జరిగింది. ధ్యానం ఒక పరమార్థం. ధ్యానం పవిత్రం, ధ్యానం మహాయోగం, భోది వృక్షం దగ్గర బుద్ధుడు ధ్యానం ద్వారా మహాయోగి కాగలిగాడు. శ్రీ రామకృష్ణ పరమ హంస, శారదాదేవి ధ్యానం ద్వారా యోగుల కాగలిగారు. స్వామి వివేకానంద ధ్యానం ఒక సందేశం అంటారు. తదేకలగ్నంతో ఏకాగ్రత తో చేసే ఈ ధ్యానం గొప్ప ఫలితాన్ని ఇస్తుందంటారు. అందుకే ధ్యానం చేయడం ధ్యానులకు ఉత్తమం. భగవద్గీత లో ధ్యాన యోగం గురించి వివరించడం జరి గింది. శరీరంలో సరికొత్త ఉత్తేజం ఈ ధ్యానం ద్వారా లభిస్తుంది. ఆరోగ్యం వికసిస్తుంది. అనారోగ్యం దరిచేరదు. ఆయురారోగ్యం అభివృద్ధి చెందగలదు. అందుకే ధ్యానం చేయడం మానవ కర్తవ్యంగా, ధ్యానం ఒక పరమార్థంగా భావించాలి. విశ్వశాంతికి మూలం ధ్యానం. సకల మానవాళికి ధ్యానం ఒక సందేశం కావాలి! అరుణాచలంలో రమణ మహర్షి మౌనంగా ధ్యానం చేసి కైలాస వాసి అయిన పరమ శివుణ్ణి ప్రసన్నం చేసుకోగలిగారు.. ప్రపంచస్థాయి లో ధ్యానంనకు గొప్ప ప్రాముఖ్యత వుంది. జీవాత్మ, పరమాత్మ, ఆత్మ జ్ఞానం నుండే మనకు సాక్షాత్కారం కలుగుతుంది. అది జ్ఞానులకు బోధ పడుతుంది. మనసులో మౌనంగా ధ్యానం చేసుకున్న వారికి మోక్షం కలుగుతుంది. ఈ పరమ సత్యం ప్రతి ఒక్కరూ గ్రహించాలి.



- ఎల్. ప్రఫుల్ల చంద్ర

## ఆ సమయంలో నొప్పి



పీరియడ్స్ సమయంలో భరించలేని నొప్పికి డిప్రెసనే కారణం అంటోంది ఓ రాజు అధ్యయనం. రుతుక్రమ సమయంలో నొప్పి, కుంగుబాటు... ప్రపంచవ్యాప్తంగా మహిళలపైన తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కానీ వాటి మధ్య సంబంధం ఏంటో అర్థం కాకుండా ఉండేది. ఆ విషయాన్ని తెలుసుకునేందుకు యూకే, చైనాకు చెందిన శాస్త్రవేత్తల బృందం ప్రయత్నించింది. డిప్రెషన్కు కారణమయ్యే కొన్ని రకాల జన్యువులే రుతుక్రమంలో నొప్పికి కారణమవుతున్నాయా అనే కోణంలో పరిశోధన చేపట్టింది. అందుకోసం ఐరోపా, తూర్పు ఆసియాకు చెందిన ఆరు లక్షల మంది నుంచి జన్యు డేటా సేకరించారు. తర్వాత బయోఇన్ఫర్మేటిక్స్ సాయంతో డిప్రెషన్, రుతుక్రమ నొప్పికి దారితీసే నాడీకణ వ్యవస్థల్ని అన్వేషిం చారు. ఈ అధ్యయనంలో డిప్రెషన్కి కారణ మవు తున్న జన్యువుల్లో కొన్ని పీరియడ్స్ సమయంలో నొప్పినీ కలిగి స్తున్నట్లు గుర్తించారు. భావోద్వేగాల్లో మార్పు వచ్చినప్పుడు పొత్తుకడుపులో నొప్పి 50 శాతం పెరుగుతున్నట్లు చెబుతున్నారు. నిద్రలేమితో బాధపడే వారిలో వీటిమధ్య సంబంధం ఇంకాస్త ఎక్కువనీ తెలిపారు. తద్వారా మానసిక ఆరోగ్యం, రుతుక్రమ సమయంలో నొప్పి మధ్య సంబం ధం ఉన్నట్టు తేల్చారు. □

## కారీ రోల్ ..




**కావలసినవి:** గోధుమపిండి కప్పు, పనీర్ 200 గ్రాములు, యోగర్ట్, ఉల్లి, క్యాబేజీ, క్యాప్సికమ్, క్యారెట్ తరుగు ముప్పావు కప్పు చొప్పున, అల్లం వెల్లుల్లి పేస్టు అర టేబుల్ స్పూన్, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పౌడర్, వాము, పసుపు అర చెంచా చొప్పున, ఛాట్ మసాలా , కాశ్మీరీ కారం, నిమ్మరసం ఒకటిన్నర చెంచా చొప్పున, ఉప్పు రుచికి సరిపడా, నూనె తగినంత, పుదీనా అర కప్పు, అల్లం అంగుళం ముక్క, కొత్తిమీర తరుగు పావు కప్పు, పచ్చిమిర్చి 2, వెల్లుల్లి రెబ్బలు 3

**తయారీ:** పుదీనా, కొత్తిమీర, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బల్లో కొన్ని నీళ్లు, కొద్దిగా ఉప్పు కలిపి మెత్తగా నూరి గ్రీన్ చెట్నీ చేయాలి. ఒక పాత్రలో యోగర్ట్, అల్లం, వెల్లుల్లి పేస్టు, వాము, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పౌడర్, ఛాట్ మసాలా, కశ్మీరీ కారం, నిమ్మరసం వేసి కలపాలి. అన్నీ బాగా కలిశాక పన్నీర్ ముక్కలు జోడించి కొంతసేపు నాననివ్వాలి. మరో బౌల్లో ఉల్లి, క్యాబేజీ, క్యాప్సికమ్, క్యారెట్ తరుగు, చెంచా ఛాట్ మసాలా, చెంచా నిమ్మరసం, కొద్దిగా ఉప్పు వేసి వెజ్ సలాడ్ చేయాలి. పిండిలో కాస్త ఉప్పు, అర టేబుల్ స్పూన్ నూనె, కొన్ని నీళ్లతో పిండి కలపాలి. అర గంట తర్వాత పల్చగా రోటీలు చేసి పెనం మీద కాల్చుకోవాలి. ప్యాన్‌లో రెండు టేబుల్‌స్పూన్ల నూనె కాగనిచ్చి.. మ్యారినేట్ చేసిన పన్నీర్ ముక్కలను నాలుగు నిమిషాలు ఉడికించి దించాలి. ఒక్కో రోటీ మీద గ్రీన్ చెట్నీ పరిచినట్లు రాసి.. మధ్యలో పనీర్ టిక్కా క్యూబ్స్, వాటి మీద వెజ్ సలాడ్ వేసి చుట్టి, అంచులను కలిపేసి.. బటర్ పేపర్‌తో సగం వరకూ చుట్టాలి. అంతే... తిని ఆనందించడమే తరువాయి. □


# తెర

## మహేష్ బాబు లాంచ్ చేసిన 'నాగబంధం' ఎపిక్ టీజర్



విరాట్ కర్ణ హీరోగా దర్శకుడు అభిషేక్ నామా రూపొందిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మైథో యాక్షన్ స్పెక్టకిల్ 'నా గబంధం' టీజర్ పవిత్ర మహా శివ రాత్రి సందర్భంగా విడుదలైంది. ఈ చిత్రాన్ని నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి భారీ స్థాయిలో నిర్మిస్తు న్నారు. వరల్డ్ క్లాస్ విజువల్స్, రిచ్ ప్రొడక్షన్ విల్యూస్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రతి ఫ్రేమ్‌లోనూ వారి గ్రాండ్ విజన్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఆధ్యాత్మికతను అద్భుతమైన విజువల్ అంబిషన్ తో కలిపి ఒక గొప్ప సినీ అనుభూతిని అందించేలా టీజర్ మెస్మరైజ్ చేస్తోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు టీజర్‌ను లాంచ్ చేయడంతో దేశవ్యాప్తంగా అంచనాలు మరింత పెరిగాయి. హిమాలయాల మిస్టిక్ నేపథ్యంతో ప్రారంభమయ్యే ఈ టీజర్, కాలానికంటే పురాతనమైన ఒక రహస్య ప్రపంచానికి ప్రేక్షకులను తీసుకెళ్తుందిఅహ్మద్ షా అబ్దాలి నేతృత్వంలో జరిగిన ఆఫ్ఘాన్ దాడి నుండి కొంత ప్రేరణ పొందిన ఈ కథలో మైథాలజీ, చరిత్ర, ఆధ్యాత్మిక యుద్ధం మేళవింపుగా కనిపిస్తుంది. పవిత్ర 'నాగబంధం దేవాలయం' ఈ ఎపిక్ కథలో కీలక పాత్ర పోషిస్తుంది. హిమాలయాల రహస్య మార్గాల్లో దాగి ఉన్న ఈ దేవాలయం ఒక విశ్వశక్తిని కాపాడుతుందని నమ్మకం 'బ్రహ్మ సృష్టి నుంచి పుట్టింది..విష్ణు ధర్మం కాపాడుతోంది.. మహా దేవుడి ఆగ్రహం శక్తినిస్తుంది.." అనే లైన్ ఈ చిత్ర సోల్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. దర్శకుడు అభిషేక్ నామా గ్రాండ్ విజన్‌తో మైథాలజీ, యాక్షన్, ఆధ్యాత్మికతను అద్భుతంగా మేళవించారు.

## 'నాట్ ఎ డాక్టర్' ఇంట్రెస్టింగ్ టైటిల్ పోస్టర్ రిలీజ్



'నాట్ ఎ డాక్టర్' ఇంట్రెస్టింగ్ టైటిల్ పోస్టర్ రిలీజ్ స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి బలమైన, కంటెంట్‌బేస్డ్ చిత్రాలకు నిర్మించిన రాహుల్ యాదవ్ నక్కా మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు. నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహిస్తున్నారు. 'భానుమతి రామకృష్ణ', 'మంత్ ఆఫ్ మధు' చిత్రాలలో విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ కాంబినేషన్ మరోసారి జతకట్టడం ఆసక్తిని పెంచింది. నాట్ ఎ డాక్టర్ అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం, టైటిల్ పోస్టర్‌తోనే ఆసక్తిని రేకెత్తిస్తోంది. అడవి నేలలో నుంచి బయటికి వస్తున్న భారీ, మట్టి తడిసిన చేయి పోస్టర్‌లో కనిపిస్తూ, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని సూచిస్తోంది. చుట్టూ పెరిగిన మాస్ రూట్స్, ఆకులు, ఎత్తైన చెట్ల నేపథ్యం కలిపి మిస్టరీతో నిండిన వాతావరణాన్ని సృష్టిస్తు న్నాయి. »Based on a novel that was never written## అనే ట్యాగ్‌లైన్ కథలో అద్భుతమైన భావోద్వేగాలు ఉంటాయని సూచిస్తోంది. పాత్‌బ్రేకింగ్ సినిమాలను ప్రోత్సహించే స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై, శ్రీకాంత్ నాగోతి తన ప్రత్యేకమైన కథన శైలితో ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. సహజమైన నటనతో గుర్తింపు పొందిన నవీన్ చంద్ర ఈ చిత్రంలో ఒక విభిన్నమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే వెలువడనున్నాయి.

## 'బ్యాండ్ మేళం' బ్లాక్ బస్టర్ హిట్

### డైరెక్టర్ బాబీ

.మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ నిర్మించిన చిత్రం 'బ్యాండ్ మేళం' బ్లాక్ బస్టర్ హిట్:



డైరెక్టర్ బాబీ. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. ఈ మూవీని మార్చి 13న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు ఈ సినిమాకి సంబంధించిన గ్లింప్స్‌ని వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ఈ గ్లింప్స్‌ని సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌కి దర్శకుడు బాబీ, రచయిత బీవీఎస్ రవి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ మేరకు నిర్వహించిన ఈవెంట్‌లో.. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. .. 'బ్యాండ్ మేళం' గ్లింప్స్‌ని వాలెంటైన్స్ డేకి రిలీజ్ చేయండి అని నేను ఒత్తిడి చేశాను. గ్లింప్స్ చూసిన వెంటనే రోషన్ నంబర్ కనుక్కుని ఫోన్ చేసి మాట్లాడాను. ఫ్యూచర్‌లో రోషన్ పెద్ద స్టార్ అవుతాడు. ఎంతో కూల్‌గా నటించేశాడు. నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ.. శివ నిర్వాణ 2017లో నా ఆఫీస్‌కు వచ్చాడు. శివ తుర్లపాటి శివ నిర్వాణని పరిచయం చేశాడు. శివ నిర్వాణ చెప్పిన కథ చాలా నచ్చింది. . చిన్నప్పటి నుంచి నాతోనే ఉన్న వీడికి కట్టాలిర్రా అనే డైలాగ్‌తో ఈ 'బ్యాండ్ మేళం' గ్లింప్స్ రిలీజ్ చేశాం. బీవీఎస్ రవి మాట్లాడుతూ.. .. 'బ్యాండ్ మేళం' సినిమాని ఆల్రెడీ నేను చూశాను. కథని నేను ముందే విన్నాను. విన్నప్పటి కంటే మూవీని చూసిన తరువాత ఆశ్చర్యపోయాను. చిత్రాన్ని చాలా గొప్పగా తీశాడు. హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. .. 'కోర్ట్'తో నన్ను నిలబెట్టిన వాల్ పోస్టర్ టీంకి, నాని అన్నకి, ఆడియెన్స్‌కి అందరికీ థాంక్స్. 'బ్యాండ్ మేళం' అనే పేరుని అందరూ వినే ఉంటారు. మా సినిమాతో ఆ పేరు అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలబడిపోతుంది.


## ' తు యా మైన్' చిత్రంపై మణిరత్నం ప్రశంసల జల్లు

ప్రముఖ దర్శకుడు బిజోయ్ నంబియార్ తెరకెక్కించిన సర్వైవల్ థ్రిల్లర్ చిత్రం ' తు యా మైన్' ఇటీవల విడుదలై ప్రేక్షకుల నుండి, విమర్శకుల నుండి విశేష స్పందనను రాబడుతోంది.



శనయ కపూర్, ఆదర్శ్ గౌరవ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం, తనదైన ఉత్కంఠభరితమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తాజాగా దక్షిణాదిలో నిర్వహించిన ఓ ప్రత్యేక స్క్రీనింగ్‌లో భారతీయ చలనచిత్ర దిగ్గజం మణిరత్నం ఈ చిత్రాన్ని వీక్షించి, చిత్రబృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా సినిమా గురించి ఆయన మాట్లాడుతూ.. "బిజోయ్ నంబియార్ ఈ చిత్రంలో ఒక కైనెటిక్ ఎనర్జీని తీసుకు వచ్చారు. ఇది థియేటర్లలో, ప్రేక్షకుల మధ్య కూర్చొని పెద్ద తెరపై చూసినప్పుడే ఆ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించగలం," అని ప్రశంసించారు. ప్రత్యేక ప్రదర్శన అనంతరం ప్రేక్ష కులు కూడా సినిమాపై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరు దీన్ని "అద్భుతమైన సినిమా"గా అభివర్ణించగా, మరికొందరు ఇందులోని ఉత్కంఠభరితమైన సన్నివేశాలు, గ్రిప్పింగ్ స్టోరీటెల్లింగ్ కొత్త అనుభూతిని ఇచ్చాయని పేర్కొన్నారు. మణిరత్నం వంటి లెజెండరీ డైరెక్టర్ నుంచి ప్రశంసలు లభించడం సినిమా విజయాన్ని మరింత బలపరిచింది..

## 'హే బలవంత్' ఆడియన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్ : శివానీ నగరం



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బలవంత్' ( హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

**'హే బలవంత్' ఎలాంటి సినిమా?**

నాది సుహాస్‌తో రెండో సినిమా.. నా కెరీర్‌లో మూడో సినిమా.. సుహాస్‌తో ఇంతకు ముందు చేసిన సినిమాలో చాలా ఇంటెన్స్ క్యారెక్టర్.

**ఈ సినిమాతో హ్యాట్రిక్ హిట్‌ను పూర్తిచేస్తారా?**

. సినిమా చాలా బాగుంటుంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. సుదర్శన్, సుహాస్, నాపాత్రలు మిమ్ములను బాగా నవ్విస్తుంది.

**ఈ సినిమా ఒప్పుకుంటానికి రీజన్ ఏమిటి?**

నాకు వచ్చిన కథలో దిబెస్ట్ పిక్ చేసుకుంటున్నాను. ఫస్ట్ సినిమాలో కామెడీలో లేదు. సెకండ్ సినిమాలో ఫుల్ కామెడీ, ఈ సినిమాలో కూడా కామెడీ ఉంది.

**ఈ సినిమాలో బిజినెస్ ఏమిటి? ఆ బిజినెస్‌తో మీకు ఏమైనా సంబంధం ఉంటుందా?**

లేదండి.,. అది సినిమాలో నరేష్ గారి ఫ్యామిలి బిజినెస్ అది నాకు సంబంధం లేదు. అది థియేటర్‌లో చూసి మీరు ఎంజాయ్ చేస్తారు. కడుపుబ్బా నవ్వుకుంటారు

**ఈ సినిమా ఎలా ఉండబోతుంది?**

.ఈ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలో కలర్‌ఫుల్ విజువల్స్, మ్యూజిక్ బాగుంటుంది. వెన్నెల కిషోర్. నరేష్ కామెడీ అలరిస్తుంది. ప్రతి పాత్ర మిమ్ములను నవ్విస్తుంది.

**మీరు సింగర్ అని విన్నాం?**

కూచిపూడి, సంగీతం నేర్చుకున్నాఉ. సింగర్ టర్నింగ్ యాక్టర్‌ని. లిటిల్ హార్ట్స్‌లో చిన్న హమ్మింగ్ ఉంటుంది. ఆరంభం సినిమాలో ఓ పాట పాడాను. సింగింగ్ కూడా ఓపెన్‌గా ఉన్నాను. అవకాశాలు వస్తే పాడతాను.


**సుహాస్‌తో రెండో సినిమాలో చేయడం ఎలా అనిపించింది?**

నాకు చాలా ఫ్రెండ్లీ.. నాకు సపోర్ట్, చాలా మంచి నటుడు.

**సినిమాల్లోకి వెళుతున్నా అన్నప్పుడు మీ ఇంట్లో ఒప్పుకున్నారా?**

మా ఇంట్లో వెరీ సపోర్టింగ్.. వాళ్ల ఇచ్చిన అవకాశాన్ని మంచి సినిమాలతో ప్రూవ్ చేసుకున్నాను.

## 'శివ్ కైలాషోం కే వాసి' పాట పాడిన రాశీ ఖన్నా



మహా శివరాత్రి పర్వదినాన దేశవ్యాప్తంగా శివ కీర్తనలు ప్రతిధ్వని స్తున్నాయి. ఇక మహా దేవుడిపై తాజాగా రాశీ ఖన్నా పాడిన పాట ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. తాను పాడిన పాటకు వస్తున్న ప్రశంసలపై రాశీ ఖన్నా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. 'శివ్ కైలాషోం కే వాసి' అనేది అహంకారాన్ని నాశనం చేయడం, అంతరంగాన్ని మేల్కొల్పడం, అతీంద్రియత శక్తి అయిన అయిన మహా దేవుడి మీద భక్తిని చాటే ప్రార్థనగా నిలుస్తుంది. 'మహా శివరాత్రి' అత్యంత పవిత్రమైన పర్వదినం కావడం, ఇలాంటి ఓ విశిష్టమైన రోజున పాట పాడటం ఎంతో ఆనందంగా ఉంది అని రాశీ తెలిపారు. ఈ పాటలో రాశీ కనిపించిన తీరు, ఆమె వినయం, పలికించిన భావోద్వేగాలు అందరినీ ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఆమె స్వరం సైతం ఎంతో వినసొంపుగా, వినడానికి మనసుకు ఎంతో హాయిగా అనిపించేలా ఉంది. ఆమె పాడుతున్న విధానంలో ఒక నిశ్శబ్ద ప్రకాశం, ప్రశాంతత ఉంది. ఇదొక భక్తిపూర్వకమైన నిజాయితీ ప్రదర్శనలా కాకుండా ప్రార్థనలా అనిపిస్తుంది. అక్షయ్ కుమార్‌తో ప్రస్తుతం రాశీ ఖన్నా ఓ ప్రాజెక్ట్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే




# ఇషాన్ మ్యాచ్ ఫిక్సింగ్

**ఢిల్లీ:** టీమిండియా డైనమైట్ ఇషాన్ కిషన్ త్వరలో ఓ ఇంటివాడుకానున్నాడు. టీ20 ప్రపంచ కప్‌లో దుమ్మురేపుతున్న కిషన్... టోర్నీ ముగిశాక ప్రేయసి అదితి హుండియాతో కలిసి పెళ్లి పీట లెక్కబోతున్నాడుడు. ఇషాన్ తాత అనురాగ్ పాండే ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. ఇషాన్ ఎవరిని చేసుకున్నా అంగీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికే ఇషాన్ సోదరుడు కూడా ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నారు. పిల్లల సంతోషం కంటే తమకు కావాల్సిందేమిటనీ అనురాగ్ పాండే అన్నారు. దీంతో అదితి హుండియాతో ఇషాన్ పెళ్లి దాదాపు ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

ఇషాన్ ప్రేయసి అదితి జైపూర్‌కు చెందిన ప్రముఖ మోడల్. ఆమె 2017లో మిస్ ఇండియా ఫైనలిస్టుగా నిలిచారు. 2018లో మిస్ దివా సూపర్ నేషనల్ టైటిల్ గెలుచుకుని గ్లామర్ ప్రపంచంలో తనదైన ముద్రవేశారు. అదితి తరచుగా ఇషాన్ మ్యాచ్‌లను చూసేందుకు స్టేడియానికి వచ్చే అదితి కెమరాల ఫోకస్‌లో పడ్డారు. ముఖ్యంగా 2022 ఐపీఎల్ సమయంలో ఆమె ఫోటోలు వైరల్ అవడంతో వీరిద్దరి ప్రేమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటూ ఇషాన్ సక్సెస్‌ను ఎపుడూ అభినందిస్తుంటారు. త్వరలోనే ఈ జంట తమ వివాహ తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని నెటిజన్లు అంచనా వేస్తున్నారు.

# ఒమర్ జాయ్ ఆల్‌రౌండ్ షో


**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో అఫ్ఘనిస్తాన్ బోణీ చేసింది. గ్రూప్-డి లీగ్ మ్యాచ్‌లో యూఏఈపై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఆరంభంలోనే వికెట్ కోల్పయినా అలీషాన్(31 బంతుల్లో 40 రన్స్), షోయబ్ ఖాన్(48 బంతుల్లో 69 రన్స్) మూడో వికెట్‌కు 84 పరుగులు జోడించడంతో యూఏఈ 150 మార్క్ దాటింది. అఫ్ఘనిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు.

161 పరగుల లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ మరో నాలుగు బంతులు మిగిలివుండగానే 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఇబ్రహీం జద్రాన్ 53 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా వారిలో రసూలీ 33 రన్స్, అజ్మతుల్లా ఒమర్ జాయ్ 40 రన్స్‌తో రాణించారు. మూడు మ్యాచ్‌ల్లో ఆఫ్ఘనిస్తాన్‌కు ఇది తొలి విక్టరీ.

# హాకీ ప్రోలీగ్ : భారత్ హాకీ వీరుల పూర్ షో



**రూర్కెలా :** హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. సొంత గడ్డపై జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్ అంచె పోటీల్లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే ఎదురయ్యాయి. చివరి లీగ్ మ్యాచ్‌లోనూ అర్జెంటీనా చేతిలో 2-4తో భారత హాకీ జట్టు ఓటమి చూసింది. ప్రో లీగ్‌లో తొమ్మిది జట్లు పోటీపడుతున్నాయి. భారత్ అంచె పోటీల్లో నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడి భారత్ 8వ స్థానంలో నిలిచింది. తదుపరి ప్రోలీగ్ ఆస్ట్రేలియాలో జరగనుంది. హోబర్ట్ వేదికగా ఈనెల 21న స్పెయిన్‌తో, 22న అతిథ్య ఆస్ట్రేలియాతో, 24న మరోసారి స్పెయిన్, 25న ఆస్ట్రేలియాతో భారత్ మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది.

# పాక్‌ది చెత్త టీమ్

## ఆ నలుగురు వేస్ట్ - మాజీ క్రికెటర్లు గరంగరం



**లాహోర్ :** కొలంబో వేదికగా జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ పోరాడకుండానే భారత్ చేతిలో ఘోరంగా ఓటమి పొందడంతో ఆ జట్టుపై ఇంటా, బయటా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా పాక్ మాజీలు తమ జట్టుపై దుమ్మెత్తి పోస్తున్నారు. చిరకాల ప్రత్యర్థిపై మ్యాచ్‌లో పాక్ ఆటతీరును తప్పు పడుతున్నారు. సరైన వ్యూహం లేకుండానే బరిలోకి దిగారని మండిపడుతున్నారు.

బాబర్, షాబాద్, షాహీన్‌లకు ఇప్పటికే చాలా అవకాశాలు వచ్చాయని, అయినా విఫలమవుతున్నారని షాహిద్ అఫ్రిది ఫైర్ అయ్యాడు. తన చేతుల్లో అధికారం ఉంటే వీరిని జట్టులోకి తీసుకోనని కుండబద్దలు కొట్టారు. అలాగే ఆరుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం సరైన నిర్ణయం కాదని మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ అన్నాడు. పాతవాళ్లను తప్పించి పాక్ టీ20 జట్టును కొత్త ఆటగాళ్లతో నింపాల్సిన సమయం వచ్చిందని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. మరోవైపు బాబర్ ఆజమ్ బ్యాటింగ్ వైఫల్యం పాక్‌ను వెంటాడుతోందని షోయబ్ అక్తర్ అన్నాడు.




## బెన్, స్టీవర్ట్ మెరుపులు - పోరాడి ఓడిన ఇటలీ

# సూపర్-8లో ఇంగ్లాండ్

**కోల్‌కతా:** ఇటలీ క్రికెట్ కూనే అయినా మేటి టీమ్ ఇంగ్లాండ్‌ను వణికించింది. గెలుపు ముంగిట బోల్తా పడింది. బెన్, స్టీవర్ట్ మెరుపులతో అలరించారు. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగిన గ్రూప్-సి టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 24 రన్స్‌తో నెగ్గి ఊపిరిపీల్చుకుంది. 3 విజయాలతో సూపర్ 8కు చేరింది.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఆరంభంలోనే జాస్ బట్లర్ వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్(15 బంతుల్లో 28 రన్స్), జాకబ్ బెతెల్(20 బంతుల్లో 23 రన్స్) ధాటిగా ఆడుతూ స్కోరు వేగం పెంచారు. టామ్ బాటన్ కూడా వస్తూనే పరుగులు సాధించాడు. స్టీవర్ట్ రెండు వికెట్లతో మధ్య ఓవర్లలో ఇంగ్లాండ్ మరోసారి తడబడింది. స్లాగ్ ఓవర్లలో విల్ జాక్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే మూడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో అర్ధసెంచరీ సాధించడంతో ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 202 పరుగులు చేసింది.

203 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీని తొలి ఓవర్లోనే రెండు వికెట్లఉ తీసి జోఫ్రా అర్చర్ దెబ్బతీశాడు. ఓవర్టన్ కూడా మరో వికెట్ తీయడంతో ఇటలీ 22 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో జస్టిన్ (34 బంతుల్లో 43) అండగా బెన్ మనెంటి.. ఇంగ్లాండ్ బౌలర్లపై సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఏకంగా ఆరు సిక్స్‌లు, మరో నాలుగు బౌండరీలతో 25 బంతుల్లోనే 60 పరుగులు సాధించాడు. క్రీజ్‌లోకి వచ్చిన గ్రాంట్ స్టీవర్ట్(23 బంతుల్లో 45రన్స్) బ్యాట్‌కు పనిచెప్పి ఇంగ్లాండ్‌ను బెంబేలెత్తించాడు. ఓ దశలో ఇటలీ గెలిచే ఊపులో కనిపించింది. అయితే సామ్ కుర్రాన్.. మొదట స్టీవర్‌తో పాటు వెంటవెంటనే మరో రెండు వికెట్లు తీసి ఇటలీని 178 పరుగులకు పరిమితం చేశాడు. ఇంగ్లాండ్‌కు గెలుపందించాడు.

**సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లాండ్-202/7**(20 ఓవర్లలో) (విల్ జాక్స్ 53 నాటౌట్, టామ్ బాంటన్ 30, ఫిల్ సాల్ట్ 28, స్టీవర్ట్ 2/51, కలుగమగే 2/41); **ఇటలీ-178 ఆలౌట్**(20 ఓవర్లలో) (బెన్ మనెంటి 60, గ్రాంట్ స్టీవర్ట్ 45, జస్టిన్ 43, సామ్ కుర్రాన్ 3/22, జేమీ ఓవర్టన్ 3/18)

# వింటర్ ఒలింపిక్స్‌లో క్లేబో రికార్డు





**ఇటలీ:** నార్వే క్రాస్ కంట్రీ స్కీయర్ జోహానెస్ క్లేబో చరిత్ర సృష్టించాడు. తాజాగా 4 ఇంటూ 7.4 కిలోమీటర్ల రిలే టీమ్‌లో నార్వేకు స్వర్ణం అందించాడు. ఇటలీలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో ఆరో స్వర్ణాన్ని, ఓవరాల్ గా తొమ్మిదో గోల్డ్ మెడల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. వింటర్ ఒలింపిక్స్‌లో అత్యధిక స్వర్ణాలు గెలుపొందిన ఒకే ఒక్కడుగా క్లేబో నిలిచాడు. 2018 ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో మొదటిసారి బరిలోకి దిగిన క్లేబో మూడు స్వర్ణాలు, ఆ తర్వాత బీజింగ్ వింటర్ ఒలింపిక్స్‌లో ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ గెలుపొందాడు. ఈ వింటర్ ఒలింపిక్స్‌లో క్లేబో అద్భుత ప్రదర్శన ఇస్తున్నాడు. మొత్తంగా ఆరు స్వర్ణాలు అందుకున్నాడు. రిలే టీమ్‌తో కలిసి ఈ ఫీట్ అందుకోవడం గర్వంగా ఉందని క్లేబో పేర్కొన్నాడు.

# ఆస్ట్రేలియా జట్టులోకి స్టీవ్ స్మిత్



**కొలంబో:** టీట్వంటీ ప్రపంచకప్‌లో ఆడుతున్న ఆస్ట్రేలియా జట్టులోకి స్టీవ్ స్మిత్‌ను తీసుకున్నారు. గాయపడ్డ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో స్మిత్‌ను తీసుకున్నట్లు ఐసీసీ టెక్నికల్ కమిటీ ధృవీకరించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్, ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినీస్ గాయాలతో ఇబ్బంది పడుతుండడంతో బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసేలా స్మిత్‌ను ఎంపికచేశారు. జింబాబ్వే చేతిలో అనూహ్య పరాజయం కూడా మరో కారణం. శ్రీలంకలోని పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తుండడం, స్పిన్నర్లను ఎదుర్కోవడంలో చక్కగా ఎదుర్కోగల స్మిత్ జట్టులోకి రావడం ఆస్ట్రేలియాకు బూస్టింగ్ ఇవ్వనుంది.

# టోకుధరల సూచీ ద్రవ్యోల్బణం1.81%




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** భారత్ టోకుధరల సూచీ ద్రవ్యోల్బణం జనవరిలో 1.81శాతంగా స్థిరపడింది. పదినెలల గరిష్టానికి చేరింది. గత ఏడాది డిసెంబరునెలలో 0.83శాతం మాత్రమే ఉన్న ఈ ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 1.81శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణ గణాంకాలను వాణిజ్యమంత్రిత్వశాఖ సోమవారం విడుదలచేసింది. ఉత్పత్తిరంగ ప్రాథమిక ఖనిజాలు, ఇతర ఉత్పత్తిరంగా వస్తువులు, ఆహారేతర ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమ ఉత్పత్తులధరలు పెరగడమే ఇందుకు కీలకం. జనవరిలో ఆహార ఉత్పత్తులధరలుపెరిగాయి. దీనితో ద్రవ్యోల్బణం 1.41శాతానికి పెరిగాయి. ప్రైమరీ ఆర్టికల్స్ వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు, ముడిచమురు వంటివి జనవరిలో 0.15శాతం తగ్గాయి. ఆహార ఉత్పత్తులధరలు కూడా 1.79శాతం తగ్గాయి. ఖనిజవనరుల ధరలు 0.47శాతంతగ్గాయి. ఇక ఆహారేత్తర ఉతప్పత్తులధరలు మాత్రం ప్రియంగా మారాయి. 5.32శాతానికి పెరిగినట్లు తేలింది. ముడిపెట్రోలియం, సహజవాయుధరలు 4.27శాతం పెరిగాయి. చమురు, ఇంధన ధరలు 1.62శాతం జనవరిలో తగ్గినట్లు తేలింది. విద్యుత్‌ధరలు 2.91శాతం, మినరల్ ఆయిల్ 1.68శాతంతగ్గితే బొగ్గుధరలు మాత్రం 0.73శాతంపెరిగాయి. తయారీ రంగ ఉత్పత్తులు 1.30శాంపెరిగాయి. మొత్తం 22 ఉత్పత్తిరంగ గ్రూపుల్లో 19 విభాగాల్లో ధరలు పెరిగాయి. మూడు ధరలు తగ్గాయి. బేసిక్ మెటల్స్, ఆహార ఉత్పత్తులు, వస్త్రపరిశ్రమ, విద్యుత్ సామగ్రి, ఇతర ఉత్పత్తిరంగ వస్తువులు వీటిలో ఉన్నాయి. ఫార్మా రంగ ఉత్పత్తులు, యంత్రసామగ్రి, ఫర్నిచర్ వంటివి మాత్రం డిసెంబరుతో పోలిస్తే తగ్గాయి.




# లక్ష దిగువకు రానున్న పసిడి!

## ఆర్థిక వేత్తల విభిన్న అంచనాలు

**ముంబై, ఫిబ్రవరి 16:** బంగారం ధరలు సమీప భవిష్యత్తులో భారీగా పడిపోయే అవకాశం ఉందని, 2027 చివరి నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష లోపునకు దిగిరావొచ్చని ఆర్థిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి ధరలు ఇప్పటికే కొంతమేర తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ కరెక్షన్ మరింత లోతుగా ఉండబోతోందన్న అంచనాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు సుమారు 5వేల డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది జనవరిలో నమోదైన గరిష్ఠ స్థాయి 5,626 డాలర్లతో పోలిస్తే తక్కువే. ఇక భారత మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,56,200 వద్ద ఉంది. జనవరిలో నమోదైన ఆల్‌టైమ్ హై రూ.1,80,779తో పోలిస్తే 13.5 తగ్గింది. 2027 చివరి నాటికి కామెక్స్ గోల్డ్ ధర ఔన్సుకు మూడువేలు డాలర్ల స్థాయికి, భారత మార్కెట్లో తులం బంగారం ధర రూ.90 వేల నుంచి రూ.లక్ష మధ్యకు స్థిరపడవచ్చని అంచనా. ప్రపంచ రాజకీయ పరిణామాలు, రష్యా తిరిగి అమెరికా డాలర్లతో వాణిజ్య లావాదేవీలు ప్రారంభించవచ్చనే వార్తలు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే (డీడాలరైజేషన్) ఒత్తిడి తగ్గి, సెంట్రల్ బ్యాంకులు బంగారం కొనుగోళ్లను తగ్గించే అవకాశం లేకపోలేదు. 2025 ఆగస్టులో ఔన్సు బంగారం ధర 3,335 డాలర్లుగా ఉన్నప్పుడు, అది 2,800 డాలర్లకు పడిపోతుందని ప్రముఖ ఆర్థికవేత్త అమిత్‌గోయల్ అంచనా వేశారు. అయితే అందుకు విరుద్ధంగా రికార్డుస్థాయికి చేరింది. ఈ పెరుగుదలను "క్లాసిక్ కమొడిటీ బబుల్"గా గోయల్ పేర్కొన్నారు. జేపీ మోర్గాన్, ఏఎన్‌జెడ్ వంటి ఇతర సంస్థల విశ్లేషకులు మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ కొనసాగుతుందని, 2026 చివరి నాటికి బంగారం ధర ఔన్సుకు 5వేలనుంచి 5,800 డాలర్ల స్థాయికి చేరవచ్చని వారి అంచనాలున్నాయి. మార్కెట్ ప్రస్తుతం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆధారపడి తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారత్ వాణిజ్యలోటు 34.68 బిలియన్ డాలర్లు

## ఈవారంలోనే 18శాతానికి సుంకాల తగ్గింపు అమలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** భారత వాణిజ్య ఎగుమతులు 0.6శాతంపెరిగి జనవరినెలలో 36.56 బిలియన్ డాలర్లకు చేరినట్లు తేలింది. భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ భారత్ ఎగుమతులు మాత్రం వృద్ధిపథంలో ఉన్నాయని వాణిజ్యశాఖ ప్రకటించింది. అలాగే దిగుమతులు కూడా 19శాతంపెరిగి 71.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రత్యేకించి బంగారం, వెండి దిగుమతులు పెరిగాయి. వాణిజ్యలోటు గత ఏడాది ఇదే కాలంలో ఉన్న 23.43 బిలియన్ డాలర్లతోపోలిస్తే 34.68 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది డిసెంబరులో కూడా వాణిజ్యలోటు 25 బిలియన్ డాలర్లుగా ఉంది. వాణిజ్యకార్యదర్శి రాజేష్ అగర్వాల్‌మాట్లాడుతూ వాణిజ్య ఎగుమతి, దిగుమతులు, సేవలరంగ ఎగుమతులు మాత్రం సానుకూలంగానే ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 860 బిలియన్ డాలర్లవరకూ ఉంటాయని అన్నారు. సమిష్టిగా చూస్తే వాణిజ్యం, సేవలపరంగా చూస్తే 6.15శాతం పెరిగి 720.76బిలియన్ డాలర్లుగా ఉన్నాయని రాజేశ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా అమెరికా ప్రస్తుతం ఉన్న 25శాతం ట్యారిఫ్‌లను 18శాతానికి తగ్గిస్తుందనిఈవారంలోనే ఈ తగ్గింపు ఉంటుందని తెలిపారు. జాప్యం జరిగినపక్షంలో భారత ప్రతినిధిబృందం చర్చఇస్తుందని అన్నారు. వచ్చేవారంలోనే ప్రతినిధిబృందం అమెరికాకువెళుతుందన్నారు. 18శాతం తగ్గింపు అనేది ముందు అమలుకు తీసుకురావాలని ప్రత్యేకించి అమెరికాకు అల్టిమేటమ్ ఇచ్చినట్లు ఆయన అన్నారు.

# జనవరినెలలో చెలామణీలో ఉన్న నగదు రూ.40లక్షల కోట్లు!

**ముంబయి, ఫిబ్రవరి 16:** యూపిఐ లావాదేవీలు రికార్డుస్థాయిలో కొనసాగుతుండటం, క్యాష్ విత్‌డ్రాలు కూడా ఎటిఎంలనుంచి పెరుగుతున్నా చెలామణీలో ఉన్న నగదు మాత్రం పెరిగింది. కరెన్సీటు జిడిపి నిష్పత్తి ప్రస్తుతం రికార్డుస్థాయికి వెళ్లింది. జనవరిలో 40 లక్షలకోట్లు నగదు చెలామణీలో ఉన్నట్లు తేల్చింది. వార్షిక వృద్ధి 11.1శాతంగా ఉంది. గత ఏడాది ఇదే 5.3శాతం మాత్రమే ఉంది. అదే చెలామణీలో ఉన్న నగదు అంటే సిఐసి 88,517 కోట్లనుంచి రూ.2.76 లక్షలకోట్లకు పెరిగింది. అలాగేప్రజలవద్ద ఉన్న కరెన్సీ సిడబ్ల్యుపి ప్రకారం చూస్తే చెలామణీలో ఉన్న కరెన్సీలో 97.6శాతంగా ఉందని అంచనా. అంటే ఆల్‌టైమ్ రికార్డుస్థాయి 39 లక్షలకోట్లుగా ఉన్నట్లు జనవరిలో ఆర్థికవేత్తలు అంచనావేసారు. ఎస్‌బిఐ ముఖ్య ఆర్థికవేత్త సౌమ్యకాంతిఘోష్ మాట్లాడుతూ ప్రజలవద్ద ఉన్న కరెన్సీ కరోనా మహమ్మారి తర్వాత గణనీయంగా పెరిగిందని రూ.4.6 లక్షలకోట్లుకుపైగా పెరిగినట్లు వెల్లడించారు. అయితే నగదు జిడిపిల నిష్పత్తిమాత్రం ఇటీవలి కాలంలో 14.4శాతంనుంచి 11శాతానికి తగ్గింది. కర్ణాటక, తమిళనాడు, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఎటిఎంలనుంచి క్యాష్ విత్రాలు పెరిగినట్లు ఎస్‌బిఐ ఆర్థికవేత్త తెలిపారు. చిరువ్యాపారులకు జిఎస్టీ నోటీసులు వెళ్లడం, చిన్నవ్యాపారులు, వెండార్లకు కర్ణాటకలో ఈ నోటీసులు అందయి. 40 లక్షలు దాటిన యుపిఐ లావాదేవీలు జరిపిన వారికి ఈ నోటీసులు ఇచ్చారు. ఈ విధానంతమిళనాడు, కేరళ, బెంగాల్, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాలను కూడా ప్రభావితంచేసింది. ఎటిఎంలద్వారా విత్‌డ్రాలు రూ.37 కోట్లు.

వాణిజ్యం

KWALITY WALL'S™

## యూనిలీవర్‌తో వేరుపడిన తర్వాత స్వతంత్ర సంస్థగా క్వాలిటీవాల్స్ లిస్టింగ్

# రూ.31వద్ద ట్రేడ్ అయిన షేర్లు

**ముంబయి, ఫిబ్రవరి 16:** హిందూస్తాన్ యూనిలీవర్‌తో డీలిస్టింగ్ అయిన తర్వాత ఐస్‌క్రీమ్‌బ్రాండ్ క్వాలిటీ వాల్స్ రెండంకెల వృద్ధిని సాధించే లక్ష్యంతో దూసుకుపోతోంది. కంపెనీ రూ.7300 కోట్ల విలువైనదిగా నిర్ధారించారు. సోమవారం షేర్లు 31చొప్పున ట్రేడ్ అయ్యాయి. ఐస్‌క్రీమ్ మార్కెట్లలో తలసరి వినియోగం 400 నుంచి 500 మిలీలీటర్లుగా ఉందని ఇప్పటికే సర్వే సంస్థలు అంచనాలు వేసాయి. క్వాలిటీ వాల్స్ సిఎఫ్ఓ ప్రశాంత్‌ప్రేమ్‌రాజ్‌కా మాట్లాడుతూ తలసరి వినియోగం పెరగాల్సి ఉందని మార్కెట్‌లో సగం వాటా అసంఘటిత తరంగంలోనే ఉందని, ప్రీమియం కేటగిరీలో మార్కెట్ పెరగాల్సి ఉందని సిఎఫ్ఓ అన్నారు. క్వాలిటీ వాల్స్ ఇండియాకు మార్కెట్‌లో రెండు లక్షలకుపైగా కూలర్లు ఉన్నాయని, వీటిని పదిలక్షలకు పెంచే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఏటా 50 నుంచి 60 వేల ఔట్‌లెట్లు తెరవాలన్న లక్ష్యంతోపనిచేస్తున్నట్లు తెలిపారు.

ది మాగ్నమ్ ఐస్‌క్రీమ్ కంపెనీ క్వాలిటీ వాల్స్ ఇండియాలో 26శాతం వాటాను 21.33 షేరుధరకు మొత్తం 1303 కోట్లు ఆఫర్ ఇచ్చింది. అయితే ఇప్పటికిప్పుడు క్వాలిటీ వాల్స్ స్వతంత్ర సంస్థగా మార్కెట్‌లో రన్ అవుతోంది.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ!

## బ్యాంకులు, ఫైనాన్స్ కౌంటర్ల మద్దతు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీ లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో జోరుగా కొనుగోళ్లు జరగడం సూచీలకు కలిసొచ్చింది. దాంతో గత రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం 82,480.40 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్.. క్రమంగా కోలుకుని లాభాలబాట పట్టింది. చివరికి సెన్సెక్స్ 650 పాయింట్ల లాభంతో 83,277.15 వద్ద ముగియగా నిఫ్టీ 211.65 పాయింట్ల లాభంతో 25,682.75 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా బంగారం ఔన్సు 5,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.64శాతంపెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.16శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1747 షేర్లుపెరిగితే 2565 షేర్లు దిగజారాయి. 201 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. మార్కెట్ల దోరణి ప్రతికూలంగానే ఉన్నా చివరినిమిషంలో ఎంపికచేసిన రంగాల్లో కొనుగోళ్లుపెరిగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2 నాటి సెటిల్మెంట్లు రూ.1,55,333గా కొనసాగాయి. విక్రమ్ ఇంజినీరింగ్ 10.21శాతం,




ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 6,70శాతం, శక్తిపంప్స్ ఇండియా 11.83శాతంచొప్పున క్షీణిస్తే జికె ఎనర్జీ ఐదుశాతం ఎగువన ఉగిసింది. క్రిసిల్ కూడా 3.38శాతం పైకి ఎగబాకింది. క్వాలిటీ వ్స్ షేర్లు 38.15బిఎస్ఇలోను, 40.20 చొప్పున ఎన్ఎస్ఇలోను ట్రేడ్ అయ్యాయి. ప్రెసిసన్ వైర్స్ ఒడియా 15.14శాతం పెరిగాయి. కార్‌ట్రేడ్ టెక్ 5.37శాతంపెరిగితే టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా 2.19శాతం, టిటాఘర్ రైల్ సిస్టమ్స్ 1.59శాతం క్షీణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.